ధర మాయ!

పొగాకు సాగు పెంచేందుకు వ్యాపారుల పన్నాగం

- ఆరంభం నుంచి సిండికేట్
- ధరలు దిగ్గోసి కొనుగోలు
- భారీగా నష్టపోయిన రైతులు
- సాగుకు దూరంగా ఉండాలని నిర్ణయం
- ఇప్పుడు వ్యాపారుల సరికొత్త ఎత్తుగడ
- మార్కెట్ ముగింపు దశలో ధరలు పైపైకి..
- మేలు రకం కిలోకు రూ.65 పెంపు
- సాగుదారుల్లో కొత్త ఆశలు
- మళ్లీ పెరుగుతున్న పొలాల కౌలు ధరలు, బ్యారన్‌ల అద్దెలు

పొగాకు మార్కెట్‌లో వ్యాపారులు మాయాజాలం ప్రదర్శిస్తున్నారు. నిన్నమొన్నటి వరకూ ధరలు దిగ్గోసి రైతులను దగా చేసిన వారు ఇప్పుడు సరికొత్త ఎత్తుగడ వేస్తున్నారు. రానున్న సీజన్‌లో పొగాకు సాగును పెంచే విధంగా రైతులకు ఆశల వల విసురుతున్నారు. మార్కెట్ ముగింపు దశలో ధరలు పెంచి మురిపిస్తున్నారు. ఈ ఏడాది పొగాకు కొనుగోళ్ల ప్రారంభం నుంచి మార్కెట్‌లో వ్యాపారులు వ్యవహరించిన తీరుతో తీవ్రంగా నష్టపోయిన రైతులు రానున్న సీజన్‌లో పంట సాగుకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నారు. దీంతో పొలాల కౌలు, బ్యారన్‌ల అద్దెలు భారీగా తగ్గాయి. రైతులు మూడొంతుల పొగాకు విక్రయించుకున్నాక వ్యాపారులు ఓ పన్నాగం ప్రకారం మేలురకాన్ని కిలోకు రూ.65 పెంచి కొనుగోలు చేస్తూ రైతులు పునరాలోచనలో పడేలా చేస్తున్నారు. ఆ ప్రభావంతో పొలాల కౌలు, బ్యారేన్‌ల అద్దె క్రమంగా పెరుగుతున్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే తీవ్రంగా నష్టపోక తప్పదని రైతులను బోర్డు అధికారులు హెచ్చరిస్తున్నారు. సాగు విస్తీర్ణం పెంచొద్దని కోరుతున్నారు.


కొండపి వేలం కేంద్రంలో పొగాకును కొనుగోలు చేస్తున్న వ్యాపారులు (ఫైల్)

కొండపి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పొగాకు రైతులు ప్రస్తుత సీజన్‌లో భారీగా నష్టపోయారు. పెట్టుబడి ఖర్చులకు అనుగుణంగా ధరలు లభించకపోవడంతో ఆర్థికంగా చితికిపోయారు. పచ్చాకు ముఠా కూలీలకు కూడా డబ్బులు చెల్లించలేక నానా ఇబ్బందులు పడ్డారు. పొగాకు సాగు వద్దు బాబోయ్.. అని కాడి కింద వేసే దశలో వ్యాపారులు మాయాజాలం ప్రదర్శిస్తున్నారు. పండించిన దానిలో మూడొంతుల పొగాకు తక్కువ ధరకు అమ్ముకున్నాక ఇప్పుడు ధరలు పెంచి కొనుగోలు చేస్తూ పొగాకు రైతుల మెడలకు ఉరితాళ్లు తయారు చేసే పన్నాగాన్ని ప్రారంభించారు. గడచిన పంట కాలానికి దక్షిణాదిలోని ఎస్ఎల్ఎస్, ఎస్‌బీఎస్ నేలలున్న 11 వేలం కేంద్రాల పరిధిలో 104.60 మిలియన్ కిలోల పంట ఉత్పత్తికి బోర్డు అనుమతించింది. రైతులు 158.60 మిలియన్ కిలోల పంట పండించినట్లు బోర్డు అంచనా వేసింది. అందులో ఇప్పటి వరకూ 105.82 మిలియన్ కేజీల పొగాకును వేలం కేంద్రాల్లో వ్యాపారులు కొనుగోలు చేశారు. రైతుల వద్ద ఇంకా 52.78 మిలియన్ కిలోలు నిల్వ ఉంటుందని బోర్డు అధికారులు భావిస్తున్నారు.


పొగాకు నారుమడిలో కలుపు నివారణ మందును పిచికారీ చేస్తున్న కూలీ

వేలం ప్రారంభం నుంచి ధరలు దిగ్గోత

ఈ ఏడాది పొగాకు కొనుగోళ్లు మార్చి మొదటి వారం నుంచి మొదలయ్యాయి. ప్రారంభంలో మేలురకం పొగాకు కిలోకు రూ.280 వ్యాపారులు ఇచ్చారు. మీడియం గ్రేడ్ కిలోకు రూ.240 చెల్లించారు. లోగ్రేడ్

మిగతా 6వ పేజీలో

ఆఖరులో మేలు రకం ధర పెంచి ఆశలు

పక్షం రోజులుగా వ్యాపారుల సిండికేట్ బ్రేక్ అయ్యింది. మేలు రకం పొగాకు ధర కిలోకు రూ.65 పెంచి కొనుగోలు చేస్తున్నారు. వేలం ప్రారంభంలో కిలోకు రూ.280 మించకుండా సీలింగ్ పెట్టి కొనుగోలు చేసిన కంపెనీలు పక్షం రోజులుగా ధరలు పెంచుకుంటూ పోతున్నాయి. ప్రస్తుతం కిలో రూ.346కు కొనుగోలు చేస్తున్నాయి. తమ వద్ద ఉన్న పొగాకు దాదాపు విక్రయించుకున్న దశలో మేలు రకానికి ధరలు పెంచడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఇది రాబోయే పంట కాలానికి పొగాకు సాగును ప్రోత్సహించడానికి వ్యాపారులు వేసిన పన్నాగంగా అభిప్రాయపడుతున్నారు. తిరిగి పక్షం రోజులుగా పొగాకు కౌలు ధరలు, బ్యారన్‌ల అద్దెలు పెరుగుతున్నాయని రైతులు అంటున్నారు.



ప్రత్యామ్నాయ పంటల సాగు ఉత్తమం

రైతులు ఇప్పుడు అన్ని రకాల గ్రేడ్‌లను వేలానికి తీసుకురావాలి. రాబోయే రెండు నెలలు కూడా కొనుగోళ్లు జరుగుతాయి. ఈ ఏడాది పొగాకు మార్కెట్‌ని రైతులు దృష్టిలో ఉంచుకోవాలి. చివరి దశలో మేలు రకానికి ధరలు పెరిగాయని రాబోయే సంవత్సరంలో సాగు విస్తీర్ణం పెంచుకోవద్దు. ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసు కోవడం ఉత్తమం. రైతులు పొగాకు సాగులో స్వీయ నియంత్రణ పాటించాలి.

- శీలం రామారావు,
పొగాకు బోర్డు ఒంగోలు ఆర్ఎం



అధిక ధరలకు పొలాలను కౌలుకు తీసుకోవద్దు

మేలురకం పొగాకుకు కొంతమేర ధరలు పెరిగాయని రైతులు సాగు విస్తీర్ణం పెంచవద్దు. అధిక ధరలు చెల్లించి పొలాలు, బ్యారన్లు కౌలుకు తీసుకోవద్దు. రానున్న ఏడాదిలో బోర్డు అనుమతించిన ఉత్పత్తి పోను అదనంగా పండిస్తే దానిపై భారీగా పెనాల్టీలు చెల్లించేందుకు ఇప్పటికే రైతులు అంగీకారం తెలిపారు. విజ్ఞతతో ఆలోచించి బోర్డు అనుమతికి లోబడి సాగు చేయాలి. తక్కువ పెట్టుబడితో నాణ్యమైన పంట పండించాలి.

- బి.బ్రహ్మయ్య,
పొగాకు బోర్డు వైస్‌చైర్మన్

డీఎస్సీ అభ్యర్థుల కోసం భారీ ఏర్పాట్లు

- 1,700 మందికి వసతి, 43 బస్సులు
- నియోజకవర్గాల వారీగా సీటింగ్


ఏర్పాట్లపై అధికారులకు సూచనలిస్తున్న డీఈవో కిరణ్‌కుమార్

ఒంగోలు విద్య, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : డీఎస్సీ టీచర్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు ఈనెల 25న అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నియామక పత్రాలను అందజేయనున్నారు. ఆ కార్యక్రమానికి విద్యాశాఖ అధికారులు భారీ ఏర్పాట్లు చేశారు. మెగా డీఎస్సీలో జిల్లాస్థాయిలో 661 మంది, జోనల్ స్థాయిలో 188 మంది కలిపి 849 మంది జిల్లాకు చెందిన అభ్యర్థులు ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికయ్యారు. ప్రతి అభ్యర్థికి తోడు కుటుంబ సభ్యుడు ఒకరిని అనుమతిస్తున్నారు. దీంతో 1,700 మందికి ఒంగోలులోని నాలుగు కేంద్రాల్లో వసతి ఏర్పాట్లు చేశారు. ప్రతి కేంద్రానికి ఒక అధికారిని ఇన్‌చార్జిగా నియమించారు. ప్రతి 20 మంది అభ్యర్థులకు ఒకరిని బాధ్యులుగా నియమించారు. ఆ 20 మందికి సంబంధించిన అన్ని విషయాలను సదరు అధికారి చూసుకోవాలి. అభ్యర్థులను గురువారం అమరావతికి తరలించేందుకు 43 ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేశారు. ప్రతి బస్సుకు ఒక ఎంఈవో, హెచ్‌ఎం ఇన్‌చార్జిగా వ్యవహరిస్తారు. వీరికి సహాయ పడేందుకు పీడీలను

మిగతా 6వ పేజీలో


రెండో సొరంగం లోపలి భాగంలో చేస్తున్న లైనింగ్ పనులు

వెలిగొండ పనుల్లో వేగం

- రెండో సొరంగం లైనింగ్‌కు ఏర్పాట్లు
- ఎదురవుతున్న సాంకేతిక సమస్యలు
- గత నెలలో విరిగిపడిన పెచ్చులు
- ఆ 300 మీటర్లు వదిలి మిగతా కొనసాగింపు
- మొదటి టన్నెల్ ద్వారా నీటి విడుదలకు యత్నాలు

వివరాలు మెయిన్‌లో..

కారుమంచి మేజర్‌ను నిర్మించాలి

కలెక్టరేట్ ఎదుట ఆయకట్టు రైతుల ఆందోళన

- గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో రోడ్డున పడ్డామని ఆవేదన
- ఎమ్మెల్యే బీఎన్ చొరవతో రూ.2.63కోట్లు మంజూరు
- పనులను గ్రానైట్ కంపెనీ వారు అడ్డుకుంటున్నారని ఆరోపణ
- వెంటనే ప్రారంభించాలని డిమాండ్


ఒంగోలులోని కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న కారుమంచి మేజర్ ఆయకట్టు రైతులు

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : చీమకుర్తి, సంతనూతలపాడు మండలాలకు సాగు, తాగునీటిని అందించే కారుమంచి మేజర్ కాలువను వెంటనే నిర్మించే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మధుకాన్ గ్రానైట్ క్వారీ వద్ద కాలువ తెగిపోయినా పట్టించుకోలేదని వాపోయారు. కారుమంచి మేజర్ పరిధిలోని గ్రామాల రైతులు మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. టీడీపీ చీమకుర్తి రూరల్ మండల అధ్యక్షుడు జి.రాఘవరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మన్నం ప్రసాద్, మాజీ డీసీ కాట్రగడ్డ రమణయ్య, చీమకుర్తి, కారుమంచి

మిగతా 6వ పేజీలో





అమ్మ పరమేశ్వరి.. అఖిలాండేశ్వరి..

శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆలయాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. అమ్మవార్లు రోజుకో అలంకారంలో దర్శనమిస్తున్నారు. ఉత్సవాల్లో రెండోరోజైన మంగళవారం త్రిపురాంతకంలోని బాలా త్రిపురసుందరీదేవి బ్రహ్మచారిణిదేవిగా హంస వాహనంపై కొలువుదీరారు. ఒంగోలు కొత్తపట్నం బస్టాండ్‌లోని రాజరాజేశ్వరి అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

వివరాలు లోపలి పేజీల్లో..

నల్లమలలో 87 పెద్దపులులు

- ట్రాప్ కెమెరాల ద్వారా గుర్తింపు
- వన్యప్రాణుల సంరక్షణకు సమగ్ర చర్యలు
- ప్రాజెక్టు టైగర్ డీడీ అబ్దుల్ రవూఫ్



వివరాలు మెయిన్‌లో..

అసెంబ్లీలో గళమెత్తిన ఎమ్మెల్యేలు

- ప్రభుత్వ ఆసుపత్రుల్లో సమస్యలను ప్రస్తావించిన ఉగ్ర, ముత్తుముల, కందుల
- వైద్య సేవలను మరింత మెరుగుపర్చాలని విజ్ఞప్తి

7

మందకొడిగా..

- జిల్లాలో కదలని స్వామిత్వ సర్వే
- 2.93లక్షల పీపీఎంలకు 1.12లక్షలు మాత్రమే పూర్తి
- పెండింగ్‌లో 1.81 లక్షల గృహాలు
- ఈ నెలాఖరుకు ముగియనున్న సర్వే
- రాష్ట్రస్థాయిలో 9వ స్థానంలో జిల్లా


సంతనూతలపాడులో స్వామిత్వ సర్వేను పరిశీలిస్తున్న డీపీవో వెంకటేశ్వరరావు

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంత ప్రజల ఆస్తులకు హక్కులు కల్పించేందుకు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వామిత్వ సర్వే జిల్లాలో మందకొడిగా సాగుతోంది. ఇప్పటివరకు గ్రామీణ ప్రాంతాల్లో నివాసముంటున్న ప్రజలు తమ గృహాలు, స్థలాలకు పంచాయతీలకు ఇంటి పన్నులు చెల్లిస్తున్నా ఎలాంటి హక్కులూ లేవు. దీంతో ఆ ఆస్తుల ద్వారా బ్యాంకు రుణాలు పొందలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వాలు ప్రజల ఆస్తులకు హక్కు కల్పించేందుకు శ్రీకారం చుట్టాయి. అందులోభాగంగా జిల్లాలోని 297 గ్రామ పంచాయతీల్లో మొదటి విడత స్వామిత్వ సర్వేను ప్రారంభించారు. పంచాయతీ కార్యదర్శి, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్, ఇంజనీరింగ్ అసిస్టెంట్, గ్రామ సర్వేయర్లు ఆయా గ్రామాల్లో గృహాలు, స్థలాలను సందర్శించి కొలతలు వేయాల్సి ఉంది. ప్రాపర్టీ పార్సిల్ మ్యాపింగ్ (పీపీఎం)ల ద్వారా కొలతలు వేసి హద్దులు నిర్ణయించాల్సి ఉంటుంది. ఆ కొలతలను కూడా ఇంటికి, స్థలానికి వేర్వేరుగా వేయాలి. ఆ విధంగా ప్రస్తుతం జిల్లాలో జరుగుతున్న పీపీపీ సర్వేలో 2,93,667 గృహాలను సర్వే చేయాల్సి ఉండగా 2.63 లక్షలకే కొలతలు పూర్తి చేశారు. పూర్తయిన వాటిని క్యూజీఐఎస్ సాఫ్ట్‌వేర్‌లో ఆన్‌లైన్ చేయాల్సి ఉంది. ప్రస్తుతం జిల్లాలో 1.12 లక్షల గృహాలను మాత్రమే ఆన్‌లైన్ చేయగా మరో 1.81 లక్షల గృహాలను పీపీఎం చేసి ఆన్‌లైన్ చేయాల్సి ఉంది. ప్రభుత్వం మొదటి విడత సర్వేను ఈ నెలాఖరులోపు పూర్తిచేయాలని

మిగతా 6వ పేజీలో


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శిశువు

అయ్యో పాపం

- పుట్టిన బిడ్డను మరుగుదొడ్డిలో వదిలి వెళ్లిన తల్లి
- శిశువు క్షేమం.. ఆమె కోసం గాలింపు

గిద్దలూరు టౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : నవమాసాలు మోసి కన్న బిడ్డ ఆ తల్లికి బరువైంది. శిశువుకు జన్మనిచ్చి అక్కడే వదిలేసి వెళ్లిపోయింది. వివరాల్లోకి వెళితే.. పట్టణంలోని ఒక ప్రైవేటు నర్సింగ్ హోంకు సోమవారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో నిండు గర్భిణి వచ్చింది. డాక్టర్ లేకపోవడంతో మరుగుదొడ్డిలోకి వెళ్లి మగబిడ్డకు జన్మనిచ్చింది. అక్కడే పసికందును విడిచి వెళ్లిపోయింది. అయితే గర్భిణి

మిగతా 6వ పేజీలో

ధర మాయ

(5వ పేజీ తరువాయి)

రకం పొగాకును అసలు కొనుగోలు చేయలేదు. మేలు రకానికి ప్రారంభ ధర కొద్దిరోజులు కొనసాగింది. మీడియం, లోగ్రేడ్‌లను కనీసం కిలో రూ.250 చొప్పున అయినా కొనుగోలు చేస్తారని రైతులు ఆశించారు. అయితే మేలు రకాన్ని నాలుగు నెలలపాటు కిలో రూ.240 నుంచి రూ.280 మధ్య వ్యాపారులు కొనుగోలు చేశారు. రైతులకు కిలోకు సరాసరి రూ.250 లభించింది. ఒక దశలో కిలోకు ఒకటి, రెండు రూపాయలు కొన్ని కంపెనీలు పెంచినప్పటికీ వ్యాపారులు సిండికేట్ అయి ధర పెంచిన కంపెనీ బయ్యర్‌లపై ఒత్తిడి చేసి తిరిగి తగ్గించేలా చేశారు. మీడియం, లోగ్రేడ్ ధరలు కిలో రూ.240 నుంచి క్రమంగా దిగజారాయి. ప్రస్తుతం కిలో రూ.80 నుంచి రూ.120 మధ్య నడుస్తున్నాయి. మూడు నెలల క్రితం లోగ్రేడ్ రకం పొగాకును రైతులు వేలం కేంద్రానికి తీసుకురావడం, వ్యాపారులు కొనుగోలు చేయకపోవడంతో తిరిగి ఇళ్లకు తీసుకెళ్లడం చేశారు. దీంతో విసుగు చెంది పలు వేలం కేంద్రాల ఎదుట రోడ్డుపై బైఠాయించి నిరసనలు కూడా తెలిపారు. అయినా వ్యాపారులు కొనుగోలు చేయకపోగా లోగ్రేడ్ ధరలను మరింత దిగ్గోశారు.

పొగాకు సాగు తగ్గింపు దిశగా రైతులు

పండించిన పొగాకుకు గిట్టుబాటు ధరలు లేక నష్టపోవడంతో రైతులు రానున్న సీజన్‌లో సాగును తగ్గించాలన్న నిర్ణయానికి వచ్చారు. బోర్డు అధికారులు కూడా రాబోయే పంట కాలంలో రైతులు సాగు తగ్గించుకోవాలని సూచనలు చేశారు. ఈక్రమంలో పొలాల కౌలు ధరలు, బ్యారన్‌ల అద్దె రేట్లు సగానికిపైగా పడిపోయాయి. ఈదశలో పొగాకు వ్యాపారులు రైతుల్లో కొత్త ఆశలు రేకెత్తించే ప్రయత్నాలను ప్రారంభించారు.

మందకొడిగా..

(5వ పేజీ తరువాయి)

ఆదేశించింది. దీంతో అధికారులు ఆగస్టులో ఈ సర్వేను ప్రారంభించినా జిల్లాలో మందకొడిగా సాగుతోంది. మరోవైపు పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ కూడా ప్రతి రోజూ టెలీకాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తూ అధికారులను అప్రమత్తం చేస్తున్నారు. అత్యాధునిక సాంకేతిక పరికరాలతో సర్వే చేసి ప్రజల ఆస్తులకు సంబంధించి ధ్రువీకరణ పత్రాలు అందించాలన్న లక్ష్యంతో ఈ ప్రక్రియను చేపట్టారు. అయితే ప్రభుత్వ లక్ష్యానికి, క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనికి పొంతన లేకుండా పోయింది. 50 రోజుల్లో కేవలం 1.12 లక్షల గృహాలను మాత్రమే ఆన్‌లైన్ చేసిన క్షేత్రస్థాయి అధికారులు మరో ఏడెమిది రోజుల్లో మిగిలిన లక్ష్యాలను పూర్తి చేయడం సాధ్యమయ్యే పరిస్థితి కాదు. ప్రస్తుతం రాష్ట్రస్థాయిలో జిల్లా 9వ స్థానంలో ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు జోక్యం చేసుకొని స్వామిత్వ సర్వేను వేగవంతం చేసి ప్రజల ఆస్తులకు హక్కులు కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రభుత్వ లక్ష్యాన్ని పూర్తిచేసే విధంగా చర్యలు

ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ఆయా శాఖల అధికారులతో కలిసి స్వామిత్వ సర్వేను సకాలంలో పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. మండల స్థాయిలో డిప్యూటీ ఎంపీడీవోలు, డీఎల్‌పీవోల పర్యవేక్షణలో సర్వేను పూర్తిచేసే విధంగా ప్రయత్నాలు చేపట్టాం. ఈ నెలాఖరులోపు లక్ష్యాలను పూర్తిచేసే విధంగా అవసరమైన ఏర్పాట్లు చేశాం.

- ఎం.వెంకటేశ్వరరావు, జిల్లా పంచాయతీ అధికారి

కారుమంచి మేజర్‌ను నిర్మించాలి

(5వ పేజీ తరువాయి)

డీసీ అధ్యక్షుడు పాలడుగు వెంకటనారాయణ, మండల ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు తదితరులు మాట్లాడారు. కారుమంచి కాలువ ద్వారా 20 గ్రామాలకు 30ఏళ్ల నుంచి సాగు, తాగునీరు అందుతుందన్నారు. రామతీర్థం జలాశయం నిర్మించిన తర్వాత ఆప్రాంత రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. అయితే 2019లో కాలువ కట్ట మధుకాన్ గ్రానైట్ వద్ద తెగిపోయిందని తెలిపారు. దాని పక్కన తాత్కాలిక కాలువ నిర్మాణం చేశారన్నారు. ఆ కాలువ పరిధిలో 18వేల ఎకరాల ఆయకట్టు ఉండగా 130 క్యూసెక్కుల నీరు ఇవ్వాల్సి ఉందన్నారు. అయితే తాత్కాలిక కాలువ ద్వారా కేవలం 40 క్యూసెక్కుల నీరు మాత్రమే సరఫరా అవుతుండటంతో చివరి భూములు, గ్రామాలకు నీరు అందని పరిస్థితి ఏర్పడిందన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో అసలు పట్టించుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యే బీఎన్.విజయకుమార్ ఏపీడీఎంఎఫ్ నుంచి రూ.2.63 కోట్లను మంజూరు చేయించారన్నారు. కానీ ఆ కాలువ నిర్మాణాన్ని మధుకాన్ గ్రానైట్ యాజమాన్యం అడ్డుకుంటున్నదని ఆరోపించారు. కాలువ కింద ఉన్న రాళ్ల కోసం ఆ స్థలాన్ని తమకు కేటాయిస్తే కాలువ నిర్మాణం ల్యాండ్ రిక్రూట్‌మెంట్ ద్వారా కొంచెం ముందు నుంచి తీస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. పాత డిజైన్ ప్రకారమే కాలువ నిర్మిస్తేనే ఆయా గ్రామాలకు నీళ్లు అందుతాయన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే కాలువ నిర్మాణ పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కారుమంచి మేజర్ కర్షకుల కడగండ్లు కథనాన్ని రైతులు ధర్నాలో ప్రదర్శించారు. కార్యక్రమంలో ఆ ప్రాంత రైతులు కూనంనేని శ్రీను, కొల్లూరి వెంకటేశ్వర్లు, బెజవాడ శ్రీను, మద్దులూరి వీరయ్య, బొల్లినేని రామచంద్రరావు, బి.పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

అయ్యో పాపం!

(5వ పేజీ తరువాయి)

వేరే ఆసుపత్రికి వెళ్లిందేమోనని సిబ్బంది అనుకున్నారు. మంగళవారం తెల్లవారుజామున మరుగుదొడ్డి నుంచి బిడ్డ ఏడుపు వినిపిస్తుండటంతో సిబ్బంది అప్రమత్తమై వెళ్లిచూడగా మరుగుదొడ్డిలోని బకెట్‌లో మగబిడ్డ కనిపించాడు. వెంటనే చిన్నపిల్లల వైద్యుడు చికిత్స అందించడంతో బాబు క్షేమంగా ఉన్నాడు. సిబ్బంది సమాచారంతో సీఐ సురేష్ రంగంలోకి దిగి ఆ మహిళ ఆచూకీ కోసం గాలింపు చర్యలు ప్రారంభించారు. ఐసీడీఎస్ అధికారులకు సమాచారం అందించడంతో శిశువు ఆరోగ్యం బాగుపడగానే ఒంగోలులోని ప్రభుత్వ శిశువిహార్‌కు తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. ఏదిఏమైనా నవమాసాలు మోసి కని ఇలా తల్లి వదిలి వెళ్లడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మేము పెంచుకుంటాం

ఒక ప్రైవేటు ఆసుపత్రిలోని మరుగుదొడ్డిలో మగశిశువు దిక్కూమొక్కూ లేకుండా ఉండడాన్ని తెలుసుకున్న మెకానిక్ షేక్ హసీమ్, అతని భార్య రేష్మా స్పందించారు. వెంటనే సీఐ సురేష్‌ను ఈ దంపతులు కలిశారు. ఆ బిడ్డను తాము పెంచుకుంటామని ముందుకొచ్చారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం శిశువును ఒంగోలు శిశు విహార్‌కు తరలిస్తున్నామని, వారితో సంప్రదించి దత్తత తీసుకోవాలని సీఐ సూచించడంతో ఈ దంపతులు ఐసీడీఎస్ అధికారులను సంప్రదిస్తున్నారు.

డీఎస్సీ అభ్యర్థుల కోసం భారీ ఏర్పాట్లు

(5వ పేజీ తరువాయి)


నియమించారు. అభ్యర్థులను అమరావతికి తీసుకెళ్లి మళ్లీ క్షేమంగా ఒంగోలుకు చేర్చే బాధ్యత వారిదే. అభ్యర్థులకు రాత్రికి బసతోపాటు భోజన ఏర్పాట్లు చేశారు. అభ్యర్థులు, వారి కుటుంబ సభ్యులు బుధవారం మధ్యాహ్నానికి ఒంగోలులో వారికి కేటాయించిన వసతి కేంద్రానికి చేరుకోవాలి. మహిళా అభ్యర్థులు, వారి తల్లిదండ్రులను క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో చేర్చేందుకు ఆరు స్కూలు బస్సులను కేటాయించారు. అమరావతిలో నియామకపత్రాలు అందుకునేందుకు వెళ్తున్న అభ్యర్థులకు నియోజకవర్గాల వారీగా ప్రత్యేకంగా బస్సులు ఏర్పాటు చేశారు. అమరావతిలో జరిగే సీఎం సభలో కూడా వీరికి నియోజకవర్గాల వారీగా సీటింగ్ ఏర్పాటు చేసి అభ్యర్థులు వారి కుటుంబ సభ్యులకు ప్రత్యేకంగా నెంబర్లు కేటాయించారు.

డీఈవో సమీక్ష

డీఎస్సీ అభ్యర్థులకు జిల్లాలో చేస్తున్న ఏర్పాట్లను డీఈవో కిరణ్‌కుమార్ మంగళవారం స్థానిక డీఆర్ఆర్ఎం హైస్కూలులో సమీక్షించారు. వసతి కేంద్రాల ఇన్‌చార్జిలు, బస్సు ఇన్‌చార్జిలతో ఆయన మాట్లాడారు. అభ్యర్థులందరికీ ఫోన్ చేసి అమరావతికి హాజరయ్యేలా చూడాలన్నారు. ఎవరికి ఏ ఇబ్బంది లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.

గాయత్రీ మాతా కరుణించమ్మా

- రెండో రోజు గాయత్రీ దేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు
- పలుచోట్ల కుంకుమార్చనలు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



గాయత్రీదేవి అలంకరణలో కన్యకాపరమేశ్వరి



మంగమూరుడొంకలోని అచలనందాశ్రమంలో..

ఒంగోలు కల్చరల్, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి): దసర శరన్నవరాత్రి ఉత్సవాలు జిల్లావ్యాప్తంగా వైభవంగా జరుగుతున్నాయి. రెండవ రోజైన మంగళవారం అమ్మవారు వేదమాత గాయత్రీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా పలు దేవాలయాల్లో మహిళలు లలితా సహస్రనామ పారాయణ చేయగా, ప్రత్యేక కుంకుమార్చనలు జరిగాయి. ఒంగోలు నగరంలోని కేశవస్వామిపేట విజయదుర్గాదేవి దేవస్థానం, ప్రసన్న చెన్నకేశవ స్వామి దేవస్థానం, గంటాపాలెం పార్వతీ దేవస్థానం, బాలాజీరావుపేట పోలేరమ్మ, మహాలక్ష్మి దేవస్థానం, గద్దలగుంట రాజరాజేశ్వరి దేవి త్రిశక్తిపీఠం, మంగమూరు రోడ్డు అచలానంద ఆశ్రమం, కొత్తపట్నం రోడ్డు లక్ష్మీనారసింహ స్వామి బాలా త్రిపురసుందరి దేవి ఆలయం, అమలనాధుని వారి వీధి వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్తానం, సంతపేట, లాయర్‌పేట సాయిబాబా మందిరాలు మొదలైన పలు దేవాలయాలలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు, విశేష కుంకుమార్చనలు జరిగాయి.



గంటాపాలెంలో పార్వతమ్మ గుడిలో



లాయర్‌పేట సాయిబాబా గుడి రాజరాజేశ్వరి ఆలయంలో గాయిత్రీ దేవి అలంకరణ

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ఇక దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా వివిధ దేవాలయాలలో ఏర్పాచేసిన భక్తిభరిత సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా అలరించాయి. స్థానిక లాయర్‌పేట సాయిబాబా మందిరంలో ప్రముఖ సంగీత విధ్వాంసులు ఇనమనమెళ్లూరి మురళీకృష్ణచే అన్నమాచార్య సంకీర్తనా విభావరి జరిగింది. ఇందులో ఆయన అన్నమయ్య జీవితచరిత్రను క్లుప్తంగా వివరిస్తూ అందుకు తగినవిధంగా సంకీర్తనలు గానం చేసిన విధానం భక్తులను మంత్రముగ్ధులను చేసింది. ఆయనకు కీబోర్డుపై ఎస్.కె.బాబు, తబలాపై నల్లమల్లి పాండురంగనాథంలు వాద్య సహకారాన్ని అందజేశారు. అటు స్థానిక కేశవస్వామిపేట లలితాశ్రమంలో ఆధ్యాత్మిక ప్రవచకులు పొన్నూరి వేంకట శ్రీనివాసులుచే ఆధ్యాత్మిక ఉపన్యాసం జరిగింది.

దొంగలు దొరికితేనే కేసు

- 20 మోటార్ సైకిళ్లు రికవరీ.. పోలీసులు అదుపులో నిందితులు
- ఆరు నెలలుగా ఒంగోలు పరిసరాల్లో బైకుల చోరీ
- దొంగిలించిన కేటీఎం మోటార్ సైకిల్‌పై హల్‌చల్

ఒంగోలుక్రైం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): 'సార్ నా బైక్ దొంగిలించారు' అంటూ పోలీసుస్టేషన్‌కు వెళితే అక్కడ నుంచి వచ్చే సమాధానం ఏంటో తెలుసా? 'మీ బైక్ ఎక్కడ దొరికినా మన పోలీసుస్టేషన్‌కు సమాచారం వస్తుంది. దొరికిన వెంటనే మీకు తెలియజేస్తాం. కేసు నమోదు చేస్తే మీ వాహనం వెంటనే ఇవ్వడం కష్టం. కోర్టు ద్వారా తీసుకోవాల్సి ఉంటుంది' అంటూ పోలీసుల సమాధానం చెప్పి పంపడం పరిపాటిగా మారింది. దీంతో బైక్‌లు పోగొట్టుకున్నావారు పోలీసుస్టేషన్‌ల చుట్టూ తిరగక తప్పడం లేదు.

దొంగలించిన బైక్‌పైనే దొంగల్ హల్‌చల్

ముగ్గురు యువకులు కేటీఎం బైక్‌ను దొంగిలించి ఆరు నెలలుగా అదే దానిపైనే తిరుగుతూ ఒంగోలుతో పాటుగా పరిసర ప్రాంతాల్లో మోటార్ సైకిళ్ల దొంగతనం చేస్తున్నారు. సీసీఎస్ పోలీసులకు దొరికిన క్లూ ఆధారంగా ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకొని ఇప్పటికి 20 మోటార్ బైక్‌లు రికవరీ చేశారు. దొంగలను పట్టుకున్న తరువాత బైక్ యజమానులను పిలిపించుకొని ఆయా పోలీసుస్టేషన్‌లలో మూడు రోజులుగా కేసులు నమోదు చేస్తున్నారు. మోటార్ సైకిల్ దొంగతనం జరిగిన రోజు కేసు నమోదు చేసి విచారణ చేపడితే దొంగలు ముందుగా దొరికే అవకాశం ఉండేది. 20 బైక్ చోరీలు జరిగేవి కావు. ఆరు నెలల క్రితం బాపూజీ కాంప్లెక్స్‌లో బైక్ పోయిందని ఫిర్యాదు ఇస్తే అదే సమయంలో సీసీఫుటేజీ సక్రమంగా పరిశీలించినట్లు అయితే అప్పుడే దొంగలు దొరికేవారు. ఇప్పుడు దొంగలను పట్టుకున్నది కూడా అదే క్లూతో కావడం గమనార్హం.

దొంగ దొరికితేనే కేసు

మోటార్ బైక్ దొంగతనం జరిగితే కేసులు నమోదు చేయకుండా కాలయాపన చేయడం పోలీసులకు పరిపాటిగా మారింది. ఎక్కడైనా దొంగలు దొరికాక మోటార్ బైక్ రికవరీ చేసిన తరువాత ఆయా పోలీసుస్టేషన్‌లో కేసులు నమోదు చేస్తున్నారు. ఒంగోలు, పరిసర ప్రాంతాల్లోని పోలీసుస్టేషన్‌లలో ఇటీవల నమోదు చేసిన కేసులే ఉదాహరణ. బైక్ పోయిన వెంటనే సంబంధిత పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసి విచారణ చేపట్టి, సీసీఫుటేజీని పరిశీలిస్తే వెంటనే దొంగలు దొరికిపోతారు. కానీ మోటార్ సైకిళ్ల దొంగలను పట్టుకోవడంలో పోలీసులు ఉదాసీనంగా వ్యవహరించడం సర్వత్ర చర్చనీయాశం అయింది.

అద్దంకిటౌన్ హాల్ నిర్మాణానికి సన్నాహాలు

రూ.3.30 కోట్లు ఇచ్చేందుకు ముందుకు వచ్చిన అదానీ సంస్థ

అద్దంకి, సెప్టెంబరు23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో టౌన్ హాల్ నిర్మించేందుకు ఆదానీ సంస్థ ముందుకు వచ్చింది. పట్టణంలోని భవానిసెంటర్‌లో 16 సెంట్ల స్థలంలో అద్దంకి టౌన్‌హాల్ నిర్మాణం చేయాలని పలువురు మంత్రి రవికుమార్ దృష్టికి తీసుకుపోయారు. ఈ నేపథ్యంలో రెండు అంతస్తులతో రూ.3.30 కోట్లతో ఆదాని సంస్థ సామాజిక బాధ్యతగా టౌన్‌హాల్ నిర్మించేందుకు ముందుకు వచ్చింది. ఈ నేపథ్యంలో ఇటీవల ఆదాని సంస్థల ప్రతినిధులు స్థల పరిశీలన చేశారు. అద్దంకి టౌన్ హాల్ నిర్మాణానికి రూ.3.30 కోట్లు మంజూరు చేసేందుకు ఆ సంస్థ ఉన్నత స్థాయి అధికారులు అంగీకరించినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో త్వరలో పనులు కూడా ప్రారంభం కాను న్నాయి. గ్రౌండ్ ఫ్లోర్ లో ముందు వైపు పార్కింగ్‌కు వదిలి, డైనింగ్‌హాల్ నిర్మాణం చేయనున్నారు. మొద టి అంతస్తు లో 180 మంది కూర్చొనే విధంగా సీటింగ్ తో హాల్ నిర్మాణం చేయనున్నారు. నిర్మాణం పూర్తయిన తరువాత అద్దంకి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహించే విధంగా ఏర్పాటు చేయనున్నారు. దీంతో పేద, మధ్య తరగతి కుటుంబాలు తక్కువ ఖర్చుతో వేడుకలు చేసుకునే అవకాశం ఏర్పడుతుంది. ఎన్నో ఏళ్ళు గా ఎదురు చూస్తున్న అద్దంకి టౌన్ హాల్ నిర్మాణం ఎట్టకేలకు నెరవేరనుంది.



పట్టణంలోని భవానిసెంటర్‌లో టౌన్‌హాల్ నిర్మించనున్న స్థలం

క్రీడలతో రెవెన్యూ ఉద్యోగులకు ఆటవిడుపు

రెవెన్యూ క్రీడాకరపత్రాలు ఆవిష్కరించిన ఆర్డీవో

చీరాల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : నిత్యం ప్రజాసేవలో ఉండే రెవెన్యూ ఉద్యో గులకు ఆటలు మానసిక ఉల్లాసాన్ని అందిస్తా యని ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు పేర్కొ న్నారు. రెవెన్యూ ఉద్యోగులకు అక్టోబరు 10, 11 తేదీలలో జిల్లా రెవెన్యూ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడలు నిర్వహిస్తున్నారు. అందుకు సంబంధించిన కరపత్రాలను మంగళవారం తహసీల్దార్ గోపీకృష్ణతో కలిసి ఆర్డీవో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు క్రీడలు, సాంస్కృతిక ఉత్సవాల్లో ఉత్సాహంగా పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సీహెచ్ సురేష్, డివిజన్ కార్య దర్శి పి.సురేష్, క్రీడల కార్యదర్శి అర్జున్, సత్య నారాయణ, శ్రీనివాసు లు, ఆదినారాయణ, తేజ, రమేష్, నారాయణమ్మ, కృష్ణవేణి, వీఆర్వోలు, వీఆర్ఏ లు పాల్గొన్నారు.

ఆర్‌డీవోను కలిసిన తహసీల్దార్

వేటపాలెం(చీరాల) : చీరాల ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడును వేటపాలెం తహసీల్దార్ గీతారాణి మర్యాదపూర్వకంగా కలిశారు. సివిల్ సప్లయి డీటీగా పనిచేసిన ఆమె ఉద్యోగోన్నతిలో భాగంగా ఉన్నతాధి కారులు వేటపాలెం తహసీల్దార్‌గా నియమించారు. ఈక్రమంలో మంగళవారం బాధ్యతలు చేపట్టిన ఆమె ఆర్డీవోను కలిశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో పారదర్శకతతో పనిచేయాలని ఆర్డీవో సూచించారు.



క్రీడాకరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

ఆయిల్‌ఫామ్ సాగుపై రైతులకు అవగాహన

మార్టూరు, సెప్టెంబరు23 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆయిల్‌ఫామ్ సాగుపై ఉద్యానశాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఆసక్తి గలిగిన రైతులను అధికారులు ఒక రోజు పర్యటనకు తీసుకువెళ్లారు. ఉద్యానశాఖ అధికారి బి హనుమంతనాయక్ ఆధ్వర్యంలో రైతులను ఏలూరు సమీపంలోని పెదవేగి గ్రామంలో ఉన్న ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆయిల్‌ఫాం రీసర్చ్‌స్టేషన్‌కు తీసుకువెళ్లారు. అనంతరం అక్కడ విజయ్‌రాయ్ అనే గ్రామంలో ఉన్న ఉద్యాన పరిశోధనా స్థానంలో ఆయిల్‌ఫామ్ సాగుకు సంబంధించిన వివరాలను ఉద్యాన శాస్త్రవేత్తలు డాక్టరు సుశీల, డాక్టరు మాధవీలతలు రైతులకు వివరించారు. తరువాత దిబ్బగూడెం గ్రామంలో ఆయిల్‌ఫామ్,వక్క, పసుపు తోటలను రైతులు సందర్శించారు. వీటి సాగుపై వాటి యజమాని ఉప్పలపాటి చక్రపాణి రైతులకు అవగాహన కలిగించారు. కార్యక్రమానికి మండలంలోని బొబ్బేపల్లి, ద్రోణాదుల, నాగరాజుపల్లి, కోలలపూడి, వలపర్ల గ్రామాలకు చెందిన రైతులు తరలివెళ్లారు.

స్వర్ణకారుడిపై కేసు నమోదు

- బంగారం వస్తువులు చేస్తానని రూ.30 లక్షలకు టోకరా

ఈపూరుపాలెం(చీరాల), సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : బంగారు వస్తువులు చేసిస్తానని పలువురిని మభ్యపెట్టి ఈపూరుపాలెంకు చెందిన స్వర్ణకారుడు బూదాటి మల్లికార్జునరావు సుమారు రూ.30 లక్షలు నగదుతో ఉడాయించాడు. ఈపూరుపాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.., గ్రామానికి చెందిన ఆయన కొంత కొంతకాలంగా విడతల వారీగా ప్రజల నుండి నగదు వసూలు చేశాడు. అయితే రోజులు గడుస్తున్నా తిరిగి నగదు కానీ, వస్తువులు కానీ ఇవ్వకపోడంతో ప్రజలు అతడిని నిలదీస్తూ వచ్చారు. అకస్మాత్తుగా అతను ఇంటి నుండి పరారయ్యాడు. మోసపోయినట్లు తెలుసుకున్నా బాధితులు పోలీసులను ఆశ్రయించారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే బాధితుల సంఖ్య పెరిగే అవకాశం కూడా ఉందని పోలీసులు భావిస్తున్నారు.

ఇంకొల్లులో డ్రోన్ పైలెట్ శిక్షణ కేంద్రం

ఇంకొల్లు, సెప్టెంబరు 23,(ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వ పౌరవిమాశాఖ ఆధ్వర్యంలో బాపట్ల జిల్లా ఇంకొల్లులో డ్రోన్ శిక్షణా కేంద్రం ఏర్పాటు చేయడాకి అనుమతి లభించినట్లు మారుతీ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ కారుమూడి శ్రీనివాసరావు తెలిపారు. ఇంకొల్లు మారుతీ ఐటీఐ, డ్రోన్ లాబ్ టెక్నాలజిస్ ప్రై లిమిటెడ్, అహ్మదాబాద్ వారు సంయుక్తంగా ఈ శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఈ శిక్షణా కేంద్రంలో డ్రోన్ ఆపరేట్ చేయడం, నిర్వాహణ గురించి శిక్షణ ఇచ్చి పరీక్ష అనంతరం కేంద్ర పౌర విమానయాన శాఖ వారు రిక్రూట్ పైలెట్ లైసెన్స్‌ను మంజూరు చేస్తారని శ్రీనివాసరావు తెలిపారు. రైతులు, సివిల్ ఇంజనీర్లు, మైనింగు ఇంజనీర్లు, డ్రోన్ ద్వారా ఉపాధి పొందాలనుకొనే యువత డ్రోన్ ఆపరేట్ చేయడానికి ఈ శిక్షణకు అందిపుచ్చుకోవాలన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులకు గ్రామీణ ప్రాంతంలో అధునాతన టెక్నాలజీని అందిపుచ్చుకోవడానికి ఈ శిక్షణా కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పటికీ రాష్ట్రంలో ఇటువంటివి 3 శిక్షణా కేంద్రాలు ఉన్నాయని 4వ కేంద్రం ఇంకొల్లులో ఏర్పాటు చేసుకునేందుకు అనుమతులు పొందినట్లు తెలిపారు. ఈ శిక్షణా కేంద్రాన్ని ఈ నెల 29న పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రారంభించనున్నట్లు తెలిపారు.



పాలుట్లలో రోగులను పరిక్షీస్తున్న డాక్టర్

200 మందికి వైద్య పరీక్షలు

ఎర్రగొండపాలెం రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లమల అటవీ ప్రాంతమైన పాలుట్లలో డాక్టర్ కోటా నాయక్ ఆధ్వర్యంలో 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. 'స్వస్థ్ నారీ-సశక్త్ పరివార్'లో భాగంగా గూడెంలో ఆరోగ్య శిబిరం నిర్వహించి 200 మందికి పరీక్షించి అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎం జ్యోతి రాణి, స్టాఫ్‌నర్స్ అరుణ, ల్యాబ్‌టెక్నీషియన్ జానారెడ్డి, డీ జాస్మిన్, త్రివేణి, వెంకట రామయ్య సిబ్బంది పాల్గొన్నారు.

సమతుల ఆహారంతో ఆరోగ్యం

కొండపి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : సమతుల ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విక్టోరియారాణి తెలిపారు. పోషణ మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం మండలంలోని చోడవరం, కట్టుబడివారిపాలెం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. అనంతరం పోషకాహారాన్ని ప్రదర్శించారు.

మహిళ ఆరోగ్యమే కుటుంబానికి బలం

- డిప్యూటీ డీఎంహెచ్‌వో వాణిశ్రీ

సింగరాయకొండ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మహిళ ఆరోగ్యంగా ఉంటే ఆ కుటుంబం బలంగా ఉంటుందని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ వాణిశ్రీ అన్నారు. మండలంలోని మూలగుంటపాడు విలేజ్ క్లినిక్‌లో మంగళవారం నిర్వహించిన స్వస్థనారి-సశక్త్ పరివార్ కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం గర్భిణులు, బాలింతలు, పౌష్టికాహార లోపం ఉన్నవారిని గుర్తించి వైద్య పరీక్షలు నిర్వహించారు. తదుపరి సింగరాయకొండ పీహెచ్‌సీని సందర్శించారు. రికార్డులను పరిశీలించి వైద్యులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు షేక్ అయేషా, ధీరేందర్, వంశీధర్, సిబ్బంది పాల్గొన్నారు.

137 మంది మహిళలకు వైద్యపరీక్షలు

కొండపి : స్వస్థనారీ-సశక్త్ పరివార్ కార్యక్రమంలో భాగంగా కె.ఉప్పలపాడు గ్రామంలో మంగళవారం 137 మంది మహిళలకు పరీక్షలు చేశారు. వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈసందర్భంగా గ్రామస్థులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పెట్లూరు పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రియాంక, టీడీపీ గ్రామ నాయకుడు గుండపనేని రామ్మూర్తి నాయుడు, వైద్యారోగ్యశాఖ, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

గాయత్రీదేవిగా జాలమ్మతల్లి

సింగరాయకొండ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : సింగరాయకొండలోని జాలమ్మతల్లి దేవస్థానంలో శరన్నవరాత్రులు వైభవంగా నిర్వహిస్తున్నారు. రెండోరోజైన మంగళవారం అమ్మవారు గాయత్రీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి దర్శించుకున్నారు. అర్చకులు తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త దాసరి యానాదిరావు పాల్గొన్నారు.

గాయత్రీదేవిగా పోలేరమ్మ

జరుగుమల్లి (కొండపి), సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : దసరా నవరాత్రుల్లో రెండో రోజైన మంగళవారం కామేపల్లిలోని పోలేరమ్మ గాయత్రీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమాన్ని ఆలయ ఈవో బైరాగి చౌదరి పర్యవేక్షించారు.

టీడీపీ అనుబంధ సంఘాల ఏర్పాటుపై అభిప్రాయ సేకరణ

అద్దంకి, సెప్టెంబరు23 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అద్దంకి మండల శాఖ, అనుబంధ సంఘాల నియామకానికి సంబంధించి మండల నేతలు మంగళవారం స్థానిక కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మండల కమిటీ, అనుబంధ సంఘాలలో ఉత్సాహంగా పనిచేసే నాయకుల పేర్లను ఆయా గ్రామాల నేతల నుంచి సేకరించారు.

డబుల్ ధమాకా..!



- జీఎస్టీ తగ్గింపు.. దసరా ఆఫర్స్
- కొనుగోలుదారులతో దుకాణాల్లో సందడి
- కార్లు.. బైక్‌లు.. గృహోపకరణాలపైనే ఆసక్తి
- డిస్కౌంట్‌లు... స్ర్కాచ్ కార్డులతో ఊపందుకున్న వ్యాపారాలు

దసరా. తెలుగు ప్రజలకు సంక్రాంతి తరువాత పెద్ద పండుగ ఇదే. కొత్త వస్తువుల కొనుగోళ్లకు జనం ఆసక్తి చూపుతుంటారు. దానికనుగుణంగానే వ్యాపార సంస్థలు కూడా ఆఫర్లతో ఆకట్టుకుంటుంటాయి. ఇది ఏటా ఉండే తంతే. కానీ ఈ ఏడాది ప్రజలకు డబుల్ ధమాకా దక్కింది. పండుగ ఆఫర్లతోపాటు కేంద్ర ప్రభుత్వం జీఎస్‌టీ తగ్గించడంతో కొనుగోళ్లు ఊపందుకున్నాయి. గృహోపకరణాల దగ్గర నుంచి కార్ల వరకూ ధరలు భారీగా తగ్గడంతో కొనుగోలుదారులతో దుకాణాలు, వ్యాపార సముదాయాలు కళకళలాడుతున్నాయి.

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఈ దసరా ధమాకా మోగిస్తోంది. ఒకవైపు కార్లు, ఎలక్ట్రిక్ వాహనాలు, ఎలక్ట్రానిక్ గృహోపకరణాలపై కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించడంతో కొనుగోళ్లు ఊపందుకున్నాయి. ఏసీలు, ఫ్రిజ్‌లు, వాషింగ్ మెషిన్‌లపైనా జీఎస్టీ తగ్గడంతోపాటు, ప్రతి కొనుగోలుపై స్ర్కాచ్ కార్డు ద్వారా రూ.2 వేల వరకు తగ్గింపు లభించడంతో కొనుగోళ్ల జోరు సాగుతోంది. కేవలం షోరూమ్‌లలోనే కాకుండా ప్రధాన సెంటర్లలో మెగా లోన్స్ ఎక్స్చేంజ్ మేళాలు నిర్వహిస్తున్నారు. అయితే ఈ సారి దసరా పండుగకు వివిధ రకాల ఆఫర్లు మరింత కలిసి రావడంతో వ్యాపారాలు ఊపందుకున్నాయని వ్యాపార వర్గాల వారు వెల్లడిస్తున్నారు. మోటారు వాహనాలపై గతంలో 28 శాతం ఉన్న జీఎస్టీ ప్రస్తుతం 18 శాతానికి తగ్గించడంతో ఒక్కో కంపెనీ, ఒక్కో మోడల్‌పై రూ.40 వేల నుంచి, రూ.లక్ష 40 వేల వరకు తగ్గించింది. నెల వారీ చెల్లింపుల ఈఎంఐలు కూడా మరింత సులభతరం అయ్యాయి. దీంతో మధ్య తరగతి వర్గాలు కూడా కార్లవైపు ఆసక్తి చూపుతున్నారు. మరికొన్ని ఫైనాన్స్ కంపెనీలు జీరో వడ్డీ ఆఫర్లు ఇవ్వడంతో ఇక కార్లు, బైక్‌లు కొనుగోలుదారులతో షోరూములన్నీ కిటకిటలాడుతున్నాయి.

కార్లు కొనేవారి సంఖ్య పెరుగుతోంది

కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన జీఎస్టీ తగ్గింపుతో మధ్య తరగతి ప్రజలు కూడా కార్లు కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. గత పది రోజుల నుంచి రోజుకు 4 నుంచి 5 కార్లు మాత్రమే అమ్మకాలు జరుగుతుండగా, జీఎస్టీ 28 నుంచి 18 శాతానికి తగ్గింపుతో 15 నుంచి 20 వరకు కార్లు అమ్మే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే పలువురు షోరూమ్‌కు విచ్చేసి ధరలు తగ్గింపు, ఇతరత్రా ఫైనాన్స్, ఈఎంఐ తదితరల వివరాలు తెలుసుకుంటున్నారు. గతంతో పోల్చుకుంటే జీఎస్టీ తగ్గింపుతో మధ్య తరగతి వర్గాల వారు కూడా కారు కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నాయి.

- ప్రదీక్, జనరల్ మేనేజర్, జయలక్ష్మి ఆటోమోటివ్స్, ఒంగోలు

కొనుగోలుదారుల్లో కొత్త ఉత్సాహం

బైక్‌లపై గతంలో 28 శాతం ఉన్న జీఎస్టీని 18 శాతానికి తగ్గించారు. ఆ మేరకు ఒక బైక్‌పై సుమారు రూ.10వేల వరకు తగ్గింపు లభించగా, కార్లపైనా కూడా రూ.40వేల నుంచి రూ.1.90లక్షల వరకు ధరలు తగ్గినట్లు వ్యాపార వర్గాలు చెబుతున్నారు. ఇకపోతే టీవీలు, వాషింగ్ మెషీన్‌లు, ఇతర సామగ్రిపై 28 శాతం ఉన్న జీఎస్టీని 18 శాతానికి తగ్గించడంతో ఆయా కంపెనీలు, షాపింగ్ మాల్స్, షోరూమ్‌లలో దసరా ఆఫర్స్ మరింత ఆకట్టుకుంటున్నాయి. దీంతో ఈ వారం రోజులలో టీవీలు, ఫ్రిడ్జ్‌లు, వాషింగ్ మెషీన్‌లు, ఏసీలు, వంటగదికి సంబంధించిన వస్తువులు కొనుగోలుకు పేద, మధ్య తరగతి కుటుంబాలు ఆసక్తి చూపుతున్నాయి.

ప్రభుత్వాసుపత్రికి నిధులివ్వండి

- అసెంబ్లీలో కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి



కనిగిరి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గత పాలకుల నిర్లక్ష్యం కనిగిరి ప్రభుత్వాసుపత్రిని వెంటాడుతోందని కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. ప్రత్యేక నిధులు, డాక్టర్ నియామకం చేపట్టి అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు. మంగళవారం జరిగిన అసెంబ్లీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో వంద పడకల ఆసుపత్రిగా మారినప్పటికీ గత పాలకుల నిర్లక్ష్యంతో తిరిగి 50 పడకల ఆసుపత్రిగా మార్చారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక తిరిగి దానిని దాతల సహకారంతో అభివృద్ధి చేశామన్నారు. తిరిగి వంద పడకల ఆసుపత్రిగా పూర్తిస్థాయిలో నిర్మించటానికి అవసరమైన నిధులిచ్చి సహకరించాలని కోరారు. కనిగిరి ప్రాంతాన్ని ఇంకా ఫ్లోరైడ్ సమస్య వెంటాడుతోందని డాక్టర్ ఉగ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కాలంలో ఫ్లోరైడ్ సమస్యతో దాదాపు 70 మంది వరకు మృతి చెందినట్లు వివరించారు. ప్రభుత్వాసుపత్రిలోని డయాలసిస్ కేంద్రంలో ప్రతిరోజూ 130 మంది వరకు డయాలసిస్ చేయించుకుంటున్నట్లు చెప్పారు. కనిగిరి ప్రాంతంలో వివిధ వర్గాలకు చెందిన ఎంతో మంది దాతలు ముందుకు వచ్చి రూ.60 లక్షలు ఆసుపత్రి అభివృద్ధికి ఇచ్చినట్లు చెప్పారు. వాటితో అత్యాధునికంగా ఆపరేషన్, డెలివరీ థియేటర్‌లు ఏర్పాటుచేసినట్లు చెప్పారు. గత పదేళ్ళుగా జరగని ఆపరేషన్స్ తిరిగి కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక మూడు నెలల్లో 190 ఆపరేషన్లు జరినట్లు వివరించారు. సాధారణ డెలివరీలు 150 వరకు జరగగా, ఆపరేషన్ ద్వారా 40 మంది గర్భిణులు బిడ్డలకు జన్మనివ్వటం జరిగిందన్నారు. ఈ సమయంలో అసెంబ్లీ హాలులో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అభినందిస్తూ హర్షధ్వానాలతో సమావేశపు హాలు మారుమోగింది. దాతల సహకారంతో ఎంతోమందికి మేలు చేకూరిందని డాక్టర్ ఉగ్ర పేర్కొన్నారు. వీరంతా ప్రవేటు ఆసుపత్రులకు వెళ్లి ఉంటే ప్రతిఒక్కరికీ ఆపరేషన్‌ల పేరుతో రూ.50 వేలు వరకూ వసూలు చేసేవారన్నారు.

వైద్యశాఖామంత్రి అనుమతితో ప్రభుత్వాసుపత్రిలో కంగారు మదర్‌కేర్ విభాగాన్ని అత్యాధునికంగా నిర్మించి రాష్ట్రంలోనే మొదటిగా కనిగిరికి తీసుకువచ్చినట్లు ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. ఇవన్నీ దాతలు ఇచ్చిన సహకారంతోనే చేసినట్లు చెప్పారు. ఆసుపత్రిని అత్యాధునికంగా తయారు చేసుకున్నా వైద్యులు, సిబ్బంది కొరత వెంటాడుతుందన్నారు. డాక్టర్ సునీతను డిప్యుటేషన్‌పై తీసుకు రావటంతో ఆసుపత్రిలో ఆపరేషన్లు చేసినట్లు వివరించారు. ప్రస్తుతం కనిగిరిలోని ప్రభుత్వాసుపత్రిలో జనరల్ మెడిసిన్, సర్జన్ పోస్టులు ఖాళాగా ఉన్నాయన్నారు. గైనకాలజిస్టులు ఇద్దరు ఉన్నా వారు సెలవుల్లో ఉన్నారని తెలిపారు. మత్తు డాక్టర్ కూడా లేరని, పీహెచ్‌సీలలో మెడికల్ ఆఫీసర్లు లేక ఇబ్బందికరంగా మారిందన్నారు. ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి డాక్టర్‌లను, సిబ్బందిని నియమించి కనిగిరి ప్రాంత ప్రజలను ఆదుకోవాలని డాక్టర్ ఉగ్ర కోరారు.

జీజీహెచ్‌లో వైద్య సేవలు పెంచాలి

- మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి



మార్కాపురం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : వెనుకబడిన పశ్చిమ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలంటే ప్రభుత్వ సర్వజన వైద్యశాల (జీజీహెచ్)ను అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. మార్కాపురంలో డివిజన్‌లో అందుతున్న అరకొర వైద్య సేవలను మంగళవారం అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యే నారాయణరెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఈ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యసేవల కోసం వందల కిలోమీటర్ల దూరంలోని ఒంగోలు, నరసరావుపేట, గుంటూరు, విజయవాడ, కర్నూలు, హైదరాబాద్‌కు వెళ్లాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఈ క్రమంలో కొందరు మధ్యలో మృత్యువాత పడుతున్న ఘటనలు ఉన్నాయన్నారు. మార్కాపురం పెద్దాసుపత్రికి అన్ని సౌకర్యాలు కల్పిస్తే ప్రజలకు మెరుగైన వైద్య సేవలందుతాయని తెలిపారు. 2014-19 మధ్యకాలంలో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో జిల్లా వైద్యశాలగా అభివృద్ధి చేశామన్నారు. నేడు జీజీహెచ్‌గా కొనసాగుతున్నా వైద్యులు, సౌకర్యాల కొరత ఉందన్నారు. మొత్తం 113 మంది వైద్యులకుగాను 23 మంది మాత్రమే ఉన్నారన్నారు. 453 మంది కిందిస్థాయి సిబ్బందికి గాను 113 మంది మాత్రమే పనిచేస్తున్నారన్నారు. అంబులెన్స్‌లు, ఆర్‌వో, ఆక్సిజన్ ప్లాంట్‌లు మరమ్మతులకు గురయ్యాయని అన్నారు. కిడ్నీ వ్యాధిగ్రస్థులకు డయాలసిస్ కేంద్రం ఉన్నా రెగ్యులర్ వైద్యులు లేక బయట నుంచి నెలకు రెండుసార్లు వచ్చి వెళ్తున్నారన్నారు. దాతల సహకారంతో ఐసీయూ ఏర్పాటు చేసినా డాక్టర్‌ల కొరతతో పూర్తి స్థాయిలో వైద్యసేవలందించలేని దుస్థితి ఏర్పడిందన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ఆసుపత్రిని అభివృద్ధి చేయాలని కందుల కోరారు.

గత వైసీపీ పాలకులు వైద్య రంగాన్ని భ్రష్టుపట్టించారని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. గత ప్రభుత్వంలో నాబార్డ్ నుంచి రూ.6,800 కోట్లు రుణం పొంది మెడికల్ కాలేజీల నిర్మాణానికి కేవలం రూ.1,360కోట్లు మాత్రమే ఖర్చు చేశారన్నారు. మిగిలిన రుణం ఎక్కడికి పోయిందని వైసీపీని నిలదీశారు.

సైబర్ మోసంలో ఇరుక్కున్న యువకుడు

ముండ్లమూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కెల్లంపల్లి పంచాయతీ శ్రీనివాసనగర్ గ్రామానికి చెందిన అతిరాచ యాదగిరి సైబర్ నేరగాళ్ల చేతిలో రూ.1,98,999 పోగొట్టుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. యాదగిరి తన భార్య, పిల్లలతో కలసి ఈనెల 19న తిరుపతి వెళ్లాడు. అక్కడ తన సెల్‌ను పోగొట్టుకున్నాడు. దైవదర్శనం అనంతరం ఈనెల 21న స్వగ్రామానికి వచ్చిన వెంటనే తన మరో సెల్‌కు సిమ్ కార్డు వేసుకోగా మెసేజ్‌లు రావటంతో అనుమానం వచ్చింది. 19వ తేదీ మధ్యాహ్నం రూ.50వేలు, అదే రోజు సాయంత్రం రూ.49వేలు, 20న రూ.99,999 నగదు డ్రా చేసినట్టు మెసేజ్ వచ్చింది. కంగారు పడిన యాదగిరి వెంటనే తన అకౌంట్ ఉన్న ఇండియన్ బ్యాంకుకు వెళ్ళి చూడగా మూడు దఫాలుగా డబ్బులు డ్రా చేసినట్టు ఉంది. వెంటనే సైబర్ క్రైం కింద ఫిర్యాదు చేశారు. ఇటీవల ముండ్లమూరు మండలంలో సైబర్ నేరగాళ్ల చేతిలో మోస పోయిన బాధితుల సంఖ్య ఎక్కువగా ఉంది.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఎర్రగొండపాలెం రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : సీజనల్ వ్యాధులపై గూడెం ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ టి.రవి అన్నారు. డీఎంహెచ్‌వో డాక్టర్ టి.రవి అన్నారు. మంగళవారం మండలంలోని పొతురాజు పెంట గూడెంలోని చెంచు కుటుంబాలతో అసిస్ట్ సంస్థ, ఐటీడీఏ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాలు పడుతున్న క్రమంలో నీటిని వృథా చేయకుండా ఉండేందుకు తీసుకోవల్సిన చర్యలను తెలిపారు. వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఏపీఐవో పీఎంయూ శ్రీశైలం టి.మధుసూదన్‌రావు, అసిస్ట్ సంస్థ ఏరియా కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, ఐటీడీఏ ప్రత్యేకాధికారి కే నాగేశ్వరరావు, టాటా ట్రస్టు ప్రాజెక్టు అధికారి ఎం.శ్రీనివాసరావు, వెంకట్రావు, కామ్లానాయక్, బాల లక్ష్మీబాయ్, వెంకటేశం, లక్ష్మీబాయ్, సిబ్బంది పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపదకు చీమకుర్తిలో శ్రీకారం

చీమకుర్తి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి) : చెత్త నుంచి సంపద సృష్టించే కార్యక్రమానికి మంగళవారం చీమకుర్తిలో శ్రీకారం చుట్టారు. పట్టణంలోని గంగవరం రోడ్డు సమీపంలో ఉన్న పాత డంపింగ్ యార్డ్‌లో ఉన్న దాదాపు 14,459 మెట్రిక్ టన్నుల లెగసీ వేస్ట్‌ను ప్రాసెస్ చేసేందుకు తరుణ్ అసోసియేట్స్‌కు అనుమతినివ్వటంతో దీనికి సంబంధించిన యూనిట్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమలో చైర్మన్ జీ రాజ్యలక్ష్మి, కౌన్సిలర్లు గొల్లపూడి రమాదేవి, గోరంట్ల అంజలి, నాయకులు మన్నం ప్రసాద్, కాట్రగడ్డ రమణయ్య, రావిపాటి రాంబాబు, యడ్లపల్లి రామబ్రహ్మం, గొల్లపూడి కోటేశ్వరరావు, గొల్లపూడి సుబ్బారావు, గోగినేని శ్రీను, అవనిగడ్డ శేషారావు, కమిషనర్ రామకృష్ణయ్య పాల్గొన్నారు.

క్విస్‌లో స్మార్ట్ ఇండియా ఇంటర్నల్ హ్యాక్‌థాన్

ఒంగోలు విద్య, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : స్థానిక క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో సీఎస్‌సీడీఈ ఆధ్వర్యంలో సోమ, మంగళవారాల్లో స్మార్ట్ ఇండియా ఇంటర్నల్ హ్యాక్‌థాన్‌ను నిర్వహించారు. ఇందులో 167 టీంలు తమ ప్రాజెక్టులను ప్రదర్శించాయి. స్మార్ట్ ఇండియా హ్యాక్‌థాన్ వెబ్‌సైట్‌లో ఇచ్చిన వివిధ సమస్యలపై పరిశోధన చేసి వాటికి పరిష్కారం తెలుపుతూ రూపొందించిన ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా క్విస్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్యకళ్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ విద్యార్థుల్లోని ప్రతిభను, వ్యవస్థాపక సాంకేతికతను, ఆలోచనలను ప్రదర్శించేందుకు ఇటువంటి కార్యక్రమాలు శక్తివంతమైన వేదికలను అందిస్తాయన్నారు. ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ డాక్టర్ గాయత్రీ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో విద్యార్థులు రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వైవీ హనుమంతరావు, డాక్టర్ సుబ్బారావు, భార్గవి పాల్గొన్నారు.

ఒంగోలు ఇన్‌చార్జి ఆర్డీవోగా కళావతి

- నెలరోజులు సెలవు పెట్టిన లక్ష్మీప్రసన్న

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు రెవెన్యూ డివిజనల్ అధికారి లక్ష్మీప్రసన్న అనారోగ్య సమస్యతో నెలరోజులు సెలవు పెట్టడంతో ఇన్‌చార్జి ఆర్డీవోగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎ.కళావతిని నియమిస్తూ కలెక్టర్ రాజాబాబు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. మంగళవారం నుంచి వచ్చేనెల 22వ తేదీ వరకు లక్ష్మీపసన్న ఆరోగ్య సమస్యలతో సెలవు పెట్టారు. దీంతో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కళావతికి పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఎరువుల దుకాణాల్లో సోదాలు

కంభం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో మంగళవారం ఎరువుల దుకాణాలను సీఐ మల్లికార్జున, ఎస్‌ఐ నరసింహారావు సోదాలు చేశారు. ఎరువుల స్టాక్ రికార్డులను, యూరియా నిల్వలను పరిశీలించారు. యజమానులు యూరియా కృత్రిమ కొరత సృష్టించి బ్లాకులో అమ్మితే శిక్ష తప్పదని వారు హెచ్చరించారు.

ఎరువులను అధిక రేట్లకు విక్రయిస్తే కఠిన చర్యలు

ముండ్లమూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎరువుల దుకాణదారులు ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే అధికంగా అమ్మితే కఠినచర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ కె.కమలాకర్ అన్నారు. మంగళవారం సాయంత్రం మారెళ్ళలో ఎరువుల దుకాణాలను సందర్శించారు.

వైద్య సేవలను మెరుగుపర్చాలి

- అసెంబ్లీలో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి



గిద్దలూరు టౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో వైద్య సేవలను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. మంగళవారం అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో అశోక్‌రెడ్డి మాట్లాడుతూ పశ్చిమ ప్రకాశంలోని గిద్దలూరు, మార్కాపురం, ఎర్రగొండపాలెం నియోజకవర్గాల్లోని నల్లమల అటవీ ప్రాంతాల్లో చెంచులు, గిరిజనులు ఎక్కువగా నివాసం ఉంటారని, వారికి దగ్గరలో ప్రసూతి కేంద్రాలు లేకపోవడంతో పట్టణాలకు రావాలంటే ప్రయాణ కష్టాలు పడుతున్నారన్నారు. చెంచుకాలనీలకు, గిరిజన తాండాలకు దగ్గరలో ప్రసూతి కేంద్రాలను ఏర్పాటు చేసి దగ్గరలోని మెడికల్ ఆఫీసర్ పర్యవేక్షణలో శిక్షణ పొందిన నర్సులతో 24 గంటలు వైద్యసేవలు అందిస్తే ప్రసూతి మరణాల రేటు తగ్గించవచ్చని అన్నారు. గిద్దలూరు పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాల 2014-19 టీడీపీ పాలనలో 100 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేస్తే వైసీపీ హయాంలో 40 పడకల ఆసుపత్రిగా కొనసాగించారన్నారు. ప్రస్తుతం ప్రజల ఆరోగ్యాల నిమిత్తం గిద్దలూరు ప్రభుత్వ ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరు చేయాలని స్పీకర్ దృష్టికి తీసుకెళ్లారు.

15శాతం వృద్ధి రేటే లక్ష్యంగా పనిచేయాలి

- కలెక్టర్ రాజాబాబు ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయాన్ని రైతుకు లాభసాటిగా చేయడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని కలెక్టర్ రాజాబాబు ఆదేశించారు. అందుకోసం జిల్లా సమగ్రాభివృద్ధిలో భాగంగా ఈ ఏడాది 15శాతం వృద్ధిరేటు లక్ష్యంగా వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు కృషి చేయాలన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ సమావేశపు హాలులో మంగళవారం జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయాశాఖల ద్వారా అమలు జరుగుతున్న కార్యక్రమాల అమలు తీరును తెలుసుకున్నారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయ, అనుబంధ రంగాల్లో 15శాతం వృద్ధి రేటు సాధించేలా ప్రణాళికలు రూపొందించుకొని అమలు చేయాలన్నారు. ప్రతి రైతు తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం పొందేలా చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయరంగంలో యాంత్రీకరణను ప్రోత్సహించాలన్నారు. డ్రోన్ వినియోగాన్ని పెంచాలన్నారు. జిల్లాలోని మూడు మండలాలను పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసి మంచి ఫలితాలు సాధించాలన్నారు. సూక్ష్మసేద్యాన్ని మరింత ప్రోత్సహించాలన్నారు. రానున్న రెండు, మూడేళ్లలో లక్ష హెక్టార్లలో సూక్ష్మ సేద్యాన్ని అమలు చేసేలా రైతుల్లో అవగాహన పెంచాలన్నారు. అనంతరం మత్స్యశాఖ, పశుసంవర్ధకశాఖలపై సమీక్షించారు. సమావేశంలో అధికారులు శ్రీనివాసరావు, రవికుమార్, సుభాషిణి, శ్రీహరి, సుజయ్, గోపీచంద్ పాల్గొన్నారు.

ప్రభుత్వానికి చెడ్డపేరు వచ్చేలా ప్రవర్తిస్తే ఊరుకోను



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : సమస్యల పరిష్కారం కోసం వచ్చే అర్జీదారులతో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దనీ, ప్రభుత్వానికి చెడ్డపేరు వచ్చేలా ప్రవర్తిస్తే ఊరుకోనని కలెక్టర్ రాజాబాబు హెచ్చరించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణతో కలిసి మండల స్థాయి అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఉద్యోగులు కోరుకున్న చోటనే పోస్టింగ్ వచ్చిందని, ఇక పర్వాలేదులే అనుకొని ప్రజలతో ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదన్నారు. సమస్యలు పరిష్కారం అవుతాయనే ఆశతో వస్తున్న ప్రజల పట్ల మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలన్నారు. 'మీకోసం' కార్యక్రమానికి వస్తున్న అర్జీలలో రెవెన్యూ సంబంధిత అంశాలే అధికంగా ఉన్నాయన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్నందున జిల్లాలోని అధికార యంత్రాంగం కూడా అదే దృక్పథంతో వ్యవహరించాలన్నారు. ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్న టాప్ 10 అంశాలకు సంబంధించిన వివరాలు ఎప్పుడూ అధికారుల టేబుల్‌పై ఉంచుకొని వాటికి సంబంధించిన పురోగతిని నిరంతరం పరిశీలించాలన్నారు. ప్రజలు ప్రస్తావించిన, మీడియాలో వస్తున్న సమస్యలపై తక్షణమే స్పందించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.



మాట్లాడుతున్న ఏవో కాశీవిశ్వనాథ్ (ఇన్‌సెట్‌లో) పాల్గొన్న అధికారులు

యూరియా కొరత లేదు!

- అవసరం లేకుండా రైతులు వినియోగించొద్దు
- ఆ దిశగా ప్రజాప్రతినిధులూ అవగాహన కల్పించాలి
- మండల సమావేశంలో ఏవో విజ్ఞప్తి

జరుగుమల్లి (కొండపి), సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలో యూరియాకు ఎలాంటి కొరత లేదని వ్యవసాయాధికారి కాశీవిశ్వనాథ్ తెలిపారు. రైతులు అవసరం లేకుండా వినియోగించవద్దని సూచించారు. అతిగా రసాయన ఎరువులు వాడటం వలన కలిగే నష్టాలపై ప్రజాప్రతినిధులు కూడా రైతులకు అవగాహన కల్పించాలని ఆయన కోరారు. మంగళవారం ఎంపీపీ బెల్లం నిర్మల అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే రైతు సేవా కేంద్రాల ద్వారా 70 మెట్రిక్ టన్నుల యూరియా, 40 మెట్రిక్ టన్నుల 20:20, 45 మెట్రిక్ టన్నుల డీఏపీ రైతులకు అందించామని తెలిపారు. పైడిపాడు, రెడ్డిపాలెం, అక్కచెరువుపాలెం గ్రామాలకు యూరియా రాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని పైడిపాడు సర్పంచ్ నాగినేని భాస్కర్‌చౌదరి సమావేశం దృష్టికి తెచ్చారు. దీనిపై ఏవో వివరణ ఇస్తూ ఈ గ్రామాలకు రైతు సేవా కేంద్రాల ద్వారా అందించేందుకు ప్రతిపాదనలు పంపామని, రాగానే అందజేస్తామని చెప్పారు. జరుగుమల్లి వైద్యాధికారి కావ్యశ్రీ మాట్లాడుతూ స్వస్థనారీ-సశక్త్ పరివార్ కార్యక్రమంలో మహిళల ఆరోగ్యాన్ని పరీక్షించి సూచనలు, సలహాలు అందిస్తున్నామని చెప్పారు. సమావేశంలో తహసీల్దార్ పి.మురళి, ఇన్‌చార్జి ఎంపీడీవో నరసింహమూర్తి, ఈవోఆర్డీ కామేశ్వరరావు, పీఆర్ ఏఈ శేషగిరి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పౌలురాజు, వెలుగు ఏపీఎం జయరాజు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో ఎం.జ్యోత్స్న, పశువైద్యాధికారి శ్రావణి, ఎంఈవో-2 డోలా శ్రీనివాసరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు భారతి, ఎల్.విజయ, కామేపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి నాగరాజు పాల్గొన్నారు.

అమ్మనబ్రోలులో ఇరు గ్రూపులపై బైండోవర్

నాగులుప్పలపాడు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అమ్మనబ్రోలు గ్రామంలో శ్రీ చెన్నమల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఏటా దసరా సందర్భంగా ఉభయదాతలు నిర్వహించే పూజా కార్యక్రమాల విషయంలో ఇరువర్గాల మధ్య వివాదం చోటుచేసుకుంటుంది. ఈ ఏడాది ఆ రోజున ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, పండుగ ప్రశాంతంగా జరిగేలా ఇరువర్గాలకు చెందిన 20 మందికి సీఐ ఎన్.శ్రీకాంత్‌బాబు, రజియాసుల్తానా కౌన్సెలింగ్ నిర్వహించి తహసీల్దార్ కె.ప్రవీణ్‌కుమార్ వద్ద మంగళవారం బైండోవర్ చేశారు. సీఐ గ్రామంలో పర్యటించి పలు వీధులు, ముఖ్యమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించారు. చెన్నమల్లేశ్వరస్వామి దేవాలయం, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద పికెట్ ఏర్పాటు చేశారు. డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు మంగళవారం రాత్రి అమ్మనబ్రోలు గ్రామంలోని చెన్నమల్లేశ్వరస్వామి దేవస్థానం, పోలీస్ పికెట్‌లను పరిశీలించారు.

పల్లామల్లి సొసైటీ సీఈవోపై చర్యలకు సిఫార్సు

ఒంగోలు విద్య, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : చీమకుర్తి మండలం పల్లామల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(సొసైటీ) సీఈవో రమణయ్యపై క్రమశిక్షణా చర్యలకు ఒంగోలు డివిజనల్ సహకారాధికారి డి.శ్రీనివాసరావు సిఫార్సు చేశారు. ఈ మేరకు ఆయన సొసైటీ పాలకవర్గానికి ఉత్తర్వులు జారీ చేశారు. పల్లామల్లి సొసైటీలో భారీఎత్తున ఆర్థిక అవకతవకలు, పరిపాలనాపరమైన అక్రమాలు జరిగినట్లు విచారణలో తెలింది. సొసైటీలో సుమారు 62 లక్షలు గోల్‌మాల్ జరిగినట్లు విచారణలో తేలింది. సొసైటీలో రైతులు చెల్లించిన బకాయి బ్యాంకుకు జమ చేయకుండా సొసైటీ సిబ్బంది మింగేశారు. రైతుల ఖాతాల్లోని డబ్బులు వారికి తెలియకుండా లాగేసుకున్నారు. డిపాజిట్లపై తీసుకున్న రుణాలకు పూర్తిస్థాయిలో వడ్డీ వసూలు చేయకుండా క్లోజ్ చేసినందున సొసైటీకి రూ.10 లక్షలు నష్టం వచ్చింది. ఈ నేపథ్యంలో సొసైటీ స్టాఫ్ అసిస్టెంట్ షేక్ ఇమామ్ సాహెబ్‌ను గతంలోనే సస్పెండ్ చేశారు. ప్రస్తుతం సీఈవోపై చర్యలు తీసుకోవాలని సొసైటీ పాలకవర్గానికి ఒంగోలు డివిజనల్ సహకారాధికారి సిఫార్సు చేశారు.

పార్క్.. రిమార్క్..!





దసరా సెలవులు వచ్చేశాయి.. పాఠశాలలకు సెలవులు ఇవ్వడంతో విద్యార్థుల ఆటలకు వేళైంది.. ఒంగోలులోని రాజీవ్ గృహకల్ప పార్కులో ప్రారంభానికి ముందే పిల్లలకు కష్టాలు మొదలయ్యాయి. ఆట వస్తువులు క్రమక్రమంగా పనికిరాకుండా పోతున్నాయి. అంతేగాక ఇటీవల తరచూ కురుస్తున్న వర్షాలకు పార్కులో నీరు నిలిచి చెరువులా మారింది. మొత్తం బురదమయంగా మారడంతో ఆ సమీప ప్రాంతాలకు చెందిన పిల్లలు బురదలోనే తమ ఆనందాలను తీర్చుకుంటున్నారు. పార్క్ పర్యవేక్షణకు వాచ్‌మన్ కూడా లేకపోవడంతో రాత్రి వేళ కొందరు యువకులకు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. ఇప్పటికైనా ప్రజా ప్రయోజనార్థం పార్క్‌ను వినియోగంలోకి తీసుకురావాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

- ఒంగోలు కార్పొరేషన్ (ఆంధ్రజ్యోతి)

నేడు ఒంగోలులో విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఒంగోలు క్రైం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి) : నగరంలో కొన్ని ప్రాంతాలలో విద్యుత్ మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 7 నుంచి 11 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు ఆ శాఖ డీఈ కేవీ పాండురంగారావు తెలిపారు. నిర్మల్‌నగర్ ఫీడర్ 11 కేవీ లైన్‌కు అడ్డుగా ఉన్న చెట్టుకొమ్మలను తొలగించనున్నట్లు పేర్కొన్నారు. చెన్నుపాటి కాంప్లెక్స్, ఐశ్వర నగర్ పార్కు, అయప్ప స్వామి టెంపుల్, ఖద్దర్ ఆఫీస్ రోడ్, స్వాతి రెసిడెన్సీ ఏరియాలో విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు.

25న బహిరంగ సభను విజయవంతం చేయాలి

ఒంగోలు విద్య, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల ఆర్థిక, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 25న విజయవాడలో జరగనున్న రణభేరి బహిరంగ సభను విజయవంతం చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ అబ్దుల్ హై, డి.వీరాంజనేయులు ఒక సంయుక్త ప్రకటనలో కోరారు. జిల్లా నుంచి వేలాది మంది టీచర్లు పాల్గొనాలని కోరారు.

ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవడంతో పాటు కార్మికులకు 13 గంటల పనిభారాన్ని రద్దు చేయాలని ఐఎల్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి సుందరం డిమాండ్ చేశారు. మంగళవారం గాంధీనగర్‌లోని మూడుబొమ్మల సెంటర్ వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఎస్కే సర్దార్, కే కార్తీక్, దాసరి సంగీతరావు, ఐ.వెంకటేశ్వర్లు, యలమంద, బ్రహ్మజి, ఏసురత్నం, సుబ్బారావు, రామకృష్ణ ఉన్నారు.

బాధితులకు పౌష్టికాహారం అందజేత

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : లక్ష్మీకోటయ్య మెమోరియల్ సొసైటీ ఆధ్వర్యంలో హెచ్‌ఐవీతో బాధపడుతున్న బాధితులకు పౌష్టికాహారాన్ని అందజేశారు. స్థానిక సంతపేటలోని విహాన్ కార్యాలయంలో మంగళవారం పదిమంది బాధితులకు సొసైటీ అధ్యక్షుడు సీహెచ్ శ్రీనుబాబు అందజేశారు. హెచ్‌ఐవీతో బాధపడుతున్న బాధితులకు ప్రతినెల పౌష్టికాహారాన్ని అందజేస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో సీహెచ్‌వీ రాఘవ, నాగరాజు, ఎస్కే పీరుబాషా తదితరులు ఉన్నారు.

అవీఇవీ

పారిశుధ్య పనుల్లో అలసత్వం వహించరాదు : ఇన్చార్జి డీపీవో



చేకూరపాడులో పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న డీపీవో వెంకటేశ్వరరావు

నాగులుప్పలపాడు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పారిశుధ్య పనుల నిర్వహణలో అధికారులు, పంచాయతీ సిబ్బంది అలసత్వం వహించరాదని ఇన్చార్జి డీపీవో ఎం.వెంకటేశ్వరరావు సూచించారు. చేకూరపాడు గ్రామంలో పారిశుధ్య పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. ఇంటింటి చెత్త సేకరణపై గ్రామస్థులను అడిగి తెలుసుకొన్నారు. మురుగు కాలువల్లో నీరు నిలవకుండా ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. రోజూ క్రమంతప్పకుండా పారిశుధ్య కార్మికులు తడి, పొడి చెత్తను వేరుగా సేకరించాలని సూచించారు. ఆయా పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. అనంతరం తాగునీటి కేంద్రాన్ని పరిశీలించిన డీపీవో రెండు రోజులకోసారి ట్యాంక్‌లను పరిశుభ్రపరచాలని చెప్పారు. ఈ సందర్భంగా ఇంకుడు గుంతల పనులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో తేళ్ల రవికుమార్, సర్పంచ్ కొమ్మినేని రమేష్‌బాబు, కార్యదర్శి పద్మావతి పాల్గొన్నారు.

స్వామిత్వ సర్వే పరిశీలన

సంతనూతలపాడు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి) : సంతనూతలపాడులో జరుగుతున్న స్వామిత్వ సర్వేను మంగళవారం ఇన్‌చార్జి డీపీవో వెంకటేశ్వరరావు పరిశీలించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు, మండలపరిషత్ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే సంతనూతలపాడు మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయం సిబ్బందికి ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రసాద్ అధ్యక్షతన పీ4 బంగారుకుటుంబాలపై రిసోర్స్ పర్సన్‌లు రవికుమార్, వెంకటేశ్వరరావులు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు.

కలెక్టర్‌ను సత్కరించిన ఒడా చైర్మన్



కలెక్టర్‌కు బొకే ఇస్తున్న రియాజ్, రవిశంకర్

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన రాజాబాబును ఉమ్మడి ప్రకాశం జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు, ఒడా చైర్మన్ షేక్ రియజ్ శాలువతో సత్కరించి బొకే ఇచ్చి అభినందించారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో మంగళవారం కలెక్టర్ రాజాబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఒడాకు సంబంధించి పలు అంశాలపై కలెక్టర్‌తో చర్చించారు. అదే విధంగా రవిశంకర్ గ్రూపు అధినేత, జనసేన పార్టీ నాయకుడు కంది రవిశంకర్, ఒంగోలు వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ చిట్టెం ప్రసాద్‌లు కలెక్టర్‌కు బొకేలు ఇచ్చి అభినందించారు.

పురపాలక శాఖ పీఎస్ దృష్టికి పలు సమస్యలు



ప్రిన్సిపల్ సెక్రటరీకి వినతిపత్రం అందజేస్తున్న మేయర్

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు నగరపాలక సంస్థ నందు పలు సమస్యలను పట్టణాభివృద్ధి, పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్‌కు మేయర్ గంగాడ సుజాత విన్నవించారు. మంగళవారం అమరావతిలోని పీఎస్‌ను కలిసిన ఆమె స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలోని ఐడీఎస్ఎంటీ లే అవుట్, కార్పొరేషన్ కార్యాలయం నూతన భవన నిర్మాణం, దాంతోపాటు కార్యాలయంలో ఉద్యోగుల తదితర అంశాలను పరిష్కరించాలని కోరారు. మేయర్ వెంట 35వ డివిజన్ కార్పొరేటర్ ఆదిపూడి గిరిజా శాండిల్య పాల్గొన్నారు.

విద్య, వైద్యంపై దృష్టి పెట్టాలి

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పిల్లలకు మెరుగైన విద్యతో పాటు వారి ఆరోగ్యంపైనా ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ రాజాబాబు ఆదేశించారు. స్థానిక కలెక్టర్ చాంబర్‌లో మంగళవారం జిల్లా విద్యాశాఖాధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్య, వైద్యం, ప్రజలకు తాగునీటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. కేవలం రెగ్యులర్ విధులకే పరిమితం కాకుండా స్థానికంగా ఉన్న ఆయా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి మెరుగైన ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో వివిధ కేటగిరీల వారీగా ఉన్న పాఠశాలలు, కళాశాలల వివరాలను డీఈవో కిరణ్‌కుమార్, ఆర్‌ఐవో ఆంజనేయులు కలెక్టర్‌కు వివరించారు. సమావేశంలో డిప్యూటీ విద్యాధికారులు, ఏపీఈడబ్ల్యూఐడీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భాస్కర్‌బాబు, సమగ్రశిక్ష అభియాన్ అధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్‌తో వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగులు

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన పీ రాజాబాబును వాణిజ్యపన్నులశాఖ(ది కమర్షియల్ ట్యాక్సెస్) నాన్ గజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ నాయకులు సత్కరించారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో మంగళవారం అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పోలు సుధాకరరావు ఆధ్వర్యంలో కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజాబాబును శాలువతో సత్కరించి మొక్కలను అందజేశారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు డివిజన్ అధ్యక్షుడు సాధు నరసింహారావు, ఉపాధ్యక్షుడు శిరిగిరి శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీ దారా సుధాకరరావు ఉన్నారు.



కలెక్టర్‌కు మొక్క ఇస్తున్న అసోసియేషన్ నాయకులు

అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే సహించేది లేదు

ఇందిరమ్మ కాలనీ పరిసరాలలో డ్రోన్లతో నిఘా
ఎస్పీ హర్షవర్ధనరాజు

ఒంగోలు క్రైం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే సహించేది లేదని ఎస్పీ హర్షవర్ధన రాజు హెచ్చరించారు. మంగళవారం నగరంలోని స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ఇందిరమ్మ కాలనీ పరిసర ప్రాంతాలలో డ్రోన్లతో నిఘా ఏర్పాటు చేశారు. ఆ ప్రాంతంలో ఆకతాయిలతోపాటు బహిరంగంగా మద్యం సేవించే వారిపై నిఘా ఉంచినట్లు తెలిపారు. అనుమానాస్పదంగా తిరుగుతున్న యువకులను ప్రశ్నించి వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసులు వెళ్లలేని మూలప్రదేశాలకు డ్రోన్ల ద్వారా నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. శివారు ప్రాంతాలలో అసాంఘిక కార్యక్రమాలు నియంత్రించడానికి చర్యలు చేపట్టామన్నారు.

పురుగుమందుల దుకాణంలో సీఐ తనిఖీలు

నాగులుప్పలపాడు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు ఒంగోలు రూరల్ సీఐ ఎన్ శ్రీకాంత్‌బాబు ఉప్పుగుండూరు గ్రామంలోని మన గ్రోమోర్ దుకాణంలోని ఎరువులు, పురుగుమందుల నిల్వలను మంగళవారం తనిఖీ చేశారు. తయారీ తేదీ, అనుమతుల వివరాలను పరిశీలించారు. దుకాణంలోని యూరియా నిల్వలపై విచారణ చేశారు. ఆయన వెంట ఎస్ఐ రజియాసుల్తానా పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే లక్ష్యంగా పీ4 : కమిషనర్



అవగాహన కల్పిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : స్వర్ణాంధ్ర 2047లో భాగంగా రాష్ట్రంలోని పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వం పీ4 అమలుకు శ్రీకారం పలికిందని నగర కమిషనర్ కే వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. పీ4పై మండల స్థాయి, వార్డు స్థాయి, డివిజన్ స్థాకి సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం స్థానిక ఎన్టీఆర్ కళాక్షేత్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఆర్థికంగా స్థిరపడిన స్థితిమతులైన కుటుంబాలు మార్గదర్శకులుగా ఉంటూ అత్యంత పేదరికంలో దిగువన 20 శాతం ఉన్న బంగారు కుటుంబాలను దత్తత తీసుకుని, వారి కనీస అవసరాలు తీర్చాలన్నారు. అందులో భాగంగా మార్గదర్శ కుటుంబానికి సమన్వయకర్తగా సచివాల సిబ్బంది పనిచేయాలని సూచించారు. ఇందుకు సంబంధించి మొబైల్ అప్లికేషన్ ఏ విధంగా ఉపయోగించాలి, బంగారు కుటుంబానికి, మార్గదర్శికి మధ్య సమన్వయం ఏ విధంగా ఉండాలనే విషాయలను వివరించారు. అనంతరం ఫోటో, డాక్యుమెంట్ రూపకల్పనపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ రసూల్, గౌస్ బాషా, శ్రీధర్, శివశంకర్, భాగ్యలక్ష్మి, పీ4 అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి రవీంద్ర, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన మహిళలే బాసట

నాగులుప్పలపాడు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్యవంతమైన మహిళ కుటుంబానికి బలమైన పునాది అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సెగ్గం శ్రీనివాసరావు చెప్పారు. స్వస్త్ నారీ సశక్త్ పరివారం కార్యక్రమంలో భాగంగా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఉప్పుగుండూరు గ్రామంలోని పంచాయతీ కార్యాలయం వద్ద వైద్యశిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. నాయకులు అమర సింహం, లచ్చంశెట్టి టీగ్రా, రాధా కృష్ణ, కనగాల శ్రీనివాసరావు, పెంట్యాల శ్రీనివాసరావు, తల్లూరు రమేష్‌బాబు, హెల్త్‌సూపర్‌వైజర్ శౌరయ్య, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అన్నపూర్ణ పాల్గొన్నారు.

పురుగు మందుల దుకాణాలలో తనిఖీలు

ఒంగోలుక్రైం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ఎరువులు, పురుగుమందులు దుకాణాలలో మంగళవారం పోలీసు తనిఖీలు నిర్వహించారు. నిల్వలను పోలీసులు పరిశీలించారు. రికార్డులు తనిఖీలు చేశారు. ఒంగోలు బండ్లమిట్టలోని ఎరువులు దుకాణంలో సీఐ మేడా శ్రీనివాసరావు తనిఖీ చేశారు. అదే విధంగా కొత్తపట్నం మండలంలో కూడా ఎరువులు దుకాణాలు తనిఖీ చేసి యూరియ నిల్వల గురించి వాకబు చేశారు.

ఘనంగా నవదిన ప్రార్థనలు

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని పాత మార్కెట్ సెంటర్‌లో గల పునీత చిన తెరీసమ్మ చర్చి నవదిన జూబ్లీ వేడుకలు రెండో రోజు ఘనంగా జరిగాయి. మంగళవారం చర్చిలో జరిగిన కార్యక్రమంలో ఫాదర్ రాజారావు వాక్యోపదేశంచేశారు. ఫాదర్ డీఎస్ పాల్, అసిస్టెంట్ ఫాదర్ హృదయ్ రాజ్, ఫాదర్ జయన్న, నీలాయపాలెం సంఘ పెద్దలు కసుకుర్తి కోటమ్మ పాల్గొన్నారు.

అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

మద్దిపాడు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి) : నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ఏపీఎం కాకుమాను సుబ్బారావు చెప్పారు. మండల మహిళా సమాఖ్య వెలుగు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ఉల్లాస్ అక్షరాంధ్ర కార్యక్రమంపై వలంటీర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సూపర్ వైజర్ పోతురాజు, సీసీలు వెంకటసుబ్బయ్య, మోహన్ రావు, ప్రేమానందం, లక్ష్మి, అరుణ పాల్గొన్నారు.

నేడు చీమకుర్తిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

చీమకుర్తి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): చీమకుర్తి పట్టణంలో పలు ప్రాంతాల్లో పీఎంఐ పనులు నిర్వహిస్తున్నందున బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ చంద్రశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ఎన్ఎస్పీ కాలనీ, రాంనగర్, వడ్డెపాలెం, కుమ్మరిపాలెం, జవహర్ ఆసుపత్రి సెంటర్, గరికమెట్ట, గంగవరంరోడ్ ప్రాంతాల్లో ఉదయం తొమ్మిది నుంచి రెండు గంటలవరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు.

పేదరికం లేని సమాజమే ధ్యేయం

నాగులుప్పలపాడు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పేదరికం లేని సమాజం ధ్యేయంగా పనిచేద్దామని ఎంపీడీవో తేళ్ల రవికుమార్ సూచించారు. స్థానిక మండల పరిషత్‌కార్యాలయంలో సచివాలయ సిబ్బంది మొదటి బ్యాచ్‌కు పీ-4 పై మంగళవారం ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. శిక్షకులు మాలకొండయ్య, రీసోర్స్‌పర్సన్ చందు, రమణలు దృశ్యశ్రవణం ద్వారా శిక్షణనిచ్చారు.

నేటి నుంచి ఉత్సవాలు

సంతనూతలపాడు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడులోని త్రిపురాంతక స్వామి ఆలయంలో బుధవారం నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరగనున్నట్లు ఎండోమెంట్ ఈవో నారాయణరెడ్డి, చైర్మన్ ఉమామహేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు.

నేడు క్వారీ ఓనర్లకు అవగాహన సదస్సు

చీమకుర్తి,సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి) : సీనరేజి వసూళ్ల ప్రక్రియను ప్రైవేటీకరణ చేసిన నేపథ్యంలో గెలాక్సీ గ్రానైట్ ఓనర్లకు బుధవారం గనులశాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. సీనరేజి వసూళ్ల అధికారం పొందిన ఏఎంఆర్ సంస్థ ప్రతినిధులు, మైన్స్ శాఖాధికారులు పాల్గొననున్నారు.

నిల్వ ఉన్న నీరు తొలగింపు



నీటి తొలగింపు పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

రాచర్ల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆకవీడు గ్రామ ప్రధాన రహదారిలో నిల్వ ఉన్న వర్షపు నీటిని అధికారులు ఎట్టకేలకు తొలగించి సమస్యను పరిష్కరించారు. ప్రధాన రహదారిపై వాన నీటితో ఇబ్బందులు శీర్షికన ఆంధ్రజ్యోతిలో వచ్చిన వార్తపై ఎంపీడీవో ఎస్ వెంకటరామిరెడ్డి స్పందించి మంగళవారం గ్రామాన్ని సందర్శించారు. వెంటనే నీటి తొలగింపు చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు శివ రామకృష్ణ, బాలస్వామి, పంచాయతీ రాజ్ ఏఈ రంగస్వామిరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఇన్చార్జి ఏఈ నరేష్ రెడ్డి, స్థానిక నాయకులు లక్ష్మిరెడ్డి, జయచంద్రారెడ్డి, లింగన్న, ఎర్రపిచ్చయ్య పాల్గొన్నారు. సమస్య పరిష్కరించిన అధికారులకు గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

సీరత్ ఉన్ నబీ పోస్టర్ల ఆవిష్కరణ

గిద్దలూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని జామియా మసీద్ ఆవరణలో ఇమామ్‌లు సమావేశమై పోస్టర్లను ఆవిష్కరించారు. ఈనెల 29వ తేదీన జామియా మసీద్‌లో నిర్వహించే సీరత్ ఉన్ నబీ (జల్సా) కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించి, సమావేశానికి హాజరు కావాలని ఇమామ్‌ల సంఘం ప్రతినిధులు కోరారు.

వివిధ రూపాల్లో పూజలందుకున్న అమ్మవార్లు


మార్కాపురంలో బ్రహ్మచారిణిగా, గిద్దలూరులో పార్వతీదేవిగా

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : దసరా శరన్నవరాత్రులను పురస్కరించుకుని పట్టణంలోని వివిధ ఆలయాల్లో అమ్మవార్లు వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో ప్రధాన అర్చకుడు శ్రీపతి అప్పనాచార్యులు రాజ్యలక్ష్మి అమ్మవారి మూలవిరాట్ ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజ్యలక్ష్మి అమ్మవారు ఆదిలక్ష్మిగా దర్శనమిచ్చారు. ఈవో శ్రీనివాసరెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు. మార్కండేశ్వర స్వామి ఆలయంలో జగదాంబ బ్రహ్మచారిణిగా దర్శనమిచ్చారు. ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి సౌకర్యాలు కల్పించారు. వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో వాసవి మాత సావిత్రిగా, ఆమలక లక్ష్మీ నారాయణ స్వామి ఆలయంలో అమ్మవారు మహాలక్ష్మిగా దర్శనమిచ్చారు.

గిద్దలూరు : వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు పార్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. దేవస్థాన కమిటీ అధ్యక్షుడు వాడకట్టు రంగసత్యనారాయణ, కార్యదర్శి తుమ్మలపెంట సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా షరాఫ్ బజారులోని వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామి వారు మత్స్యావతార అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

త్రిపురాంతకం : ప్రసిద్ధ పుణ్యక్షేత్రం త్రిపురాంతకేశ్వరస్వామి శ్రీమత్ బాలాత్రిపురసుందరీదేవి అమ్మవారి దేవస్థానంలో దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా రెండో రోజు అమ్మవారు బ్రహ్మచారిణి అలంకారంలో దర్శనమిచ్చారు. అమ్మవారు హం సవాహనంపై దర్శనమిచ్చారు.

కంభం : దసరా ఉత్సవాలలో భాగంగా రెండవ రోజు మంగళవారం కోట సత్యమాంబ దేవి అమ్మవారు అంబా భవాని దేవి అలంకారంలో, వాసవీ మాత పరమేశ్వరి దేవిగా దర్శనమిచ్చారు. కంభం, అర్ధవీడు, బేస్తవారపేట మండలాల నుం చి భక్తులు వచ్చి అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆయా దేవాలయాల ఆవరణలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

పొదిలి : పార్వతీ సమేత నిర్మ మహేశ్వరస్వామి దేవాలయంలో పార్వతీదేవి అమ్మవారు గాయత్రీదేవిగా దర్శనమిచ్చారు. ప్రధాన అర్చకులు మూలంరాజు సు బ్బనరసయ్య గణపతి పూజ, కలశపూజ, అభిషేకం, కుంకుమార్చన, హోమం కార్యక్రమాలు నిర్వహించారు.

పెద్దదోర్నాల : వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం, పోలేరమ్మ అమ్మవారి దే వాలయం, సాయి మందిరం, తిమ్మాపురంలోని చౌడేశ్వరిదేవి ఆలయంలో గాయత్రీదేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.

రాచర్ల : పట్టాభి రామాలయంలో అమ్మవారు గాయత్రీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు సతీష్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేకం పూజలు చేశారు.

పోషకాహారంతో ఆరోగ్యం


పోషకారంపై వివరిస్తున్న అంగన్‌వాడీలు

మార్కాపురం రూరల్, సెప్టెంబరు23 (ఆంధ్రజ్యోతి) : పోషకాహారంతో అందరూ ఆరోగ్యంగా ఉండాలని ఐసీడీఎస్ మార్కాపురం క్లస్టర్ సీడీపీవో పద్మ కోరారు. ఎస్సీ, బీసీ కాలనీలోని డ్వాక్రా బజారులో జాతీయ పోషకాహర మాసోత్సవాల సందర్భంగా గర్భిణులు, తల్లులు వారి కుటుంబ సభ్యులకు పోషకాహారంపై అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ప్రత్యేక స్టాల్‌ను ఏర్పాటు చేసి ఆకుకూరలు, కూరగాయలు, చిరుధాన్యాలు, పండ్లతో అందే పోషకాలను వివరించారు. వెలుగు ఏపీఎం పిచ్చయ్య మాట్లాడుతూ మహిళలు తమ ఇంటి పరిసరాలలో ఎటువంటి రసాయనాలు వాడని కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు పెంచుకుని తింటే ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌లు, కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

పీ-4ని విజయవంతం చేద్దాం

రాచర్ల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : బాధ్యతతో పీ-4 కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని ఎంపీడీవో ఎస్ వెంకట రామిరెడ్డి అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం సచివాలయ సిబ్బందికి పీ-4పై అవగాహన కల్పించారు. గతంలో శిక్షణ పొందిన ఎంపీడీవోల ద్వారా శిక్షణ ఇచ్చారు. బంగారు కుటుంబాలను గుర్తించి ఆ కుటుంబాలకు ఆసరా కల్పించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో వెంకటేష్, పంచాయతీ కార్యదర్శులు, ఫంక్షనల్ సహాయకులు పాల్గొన్నారు.

పొదిలి : గ్రామ స్థాయిలో పీ-4 సమర్థవంతంగా అమలయ్యేలా చర్యలు చేపట్టాలని ఎంపీడీవో గుత్తా శోభన్‌బాబు అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి పీ4పై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో నగరపంచాయతీ కమిషనర్ కేఎల్‌ఎన్‌రెడ్డి, ట్రైనర్స్ పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం : నిరుపేద కుటుంబాలను సచివాలయ ఉద్యోగులు ప్రత్యేక శ్రద్ధతో గుర్తించి ఆదుకోవాలని ట్రైనర్ జీ ప్రవీణ్‌కుమార్ సూచించారు. ఎంపీడీవో కార్యాలయంలో పీ4 కార్యక్రమంపై సచివాలయ ఉద్యోగులకు మంగళవారం శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో కే లక్ష్మిశ్రీనివాసరావు, ట్రైనర్ రామారావునాయక్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

కాపు కుల సమస్యలను పరిష్కరించాలి

మార్కాపురం రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : కాపు కుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయంలో డీటీ శ్రీనివాసులుకు సం ం నాయకులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయలసీమ జిల్లాలో ఇతర సామాజిక వర్గంవారు దొంగ ధ్రువ పత్రాతో కార్పొరేషన్‌లో రుణాలు పొందుతున్నారన్నారు. బలిజ, కాపు, ఒంటరి, తెలగ కులాలను బీసీ జాబితాలో చేర్చాలని కోరారు.

కార్మికులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ కార్మికులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని కమిషనర్ డీవీఎస్ నారాయణరావు అ న్నారు. కోర్టు సెంటర్‌లోని అర్బన్ ఆరోగ్య కేంద్రంలో సఫాయి మిత్ర సురక్ష శివిర్ కార్యక్రమంలో భాగంగా కార్మికులకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు, ఏఎన్‌ఎంలు, ఆశా సిబ్బంది, సిబ్బంది పాల్గొన్నారు.

చిన్ని సంస్థ అధ్యక్షుడికి అవార్డ్

గిద్దలూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): చిన్ని సేవా సంస్థ అధ్యక్షుడు మాగులూరి శ్రీకాంత్ పీఎం మోడీ విజన్ ఆఫ్ భారత్ అవార్డుకు ఎంపికయ్యారు. కడప జిల్లా పొద్దుటూరుకు చెందిన మనం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు చక్రవర్తి వివిధ రంగాలలో చిన్ని సేవా సంస్థ శ్రీకాంత్ చేస్తున్న సేవలను గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు సమాచారం పంపారు.

ఒకేషనల్ విద్యపై అవగాహన

పెద్ద దోర్నాల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పదవ తరగతి విద్యార్థులకు ఒకేషనల్ విద్యపై మంగళవారం అవగాహన కల్పించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు ఐటీ, ఐటీఈఎస్, అగ్రికల్చర్, ఎలక్ట్రానిక్స్ తదితర విభాగాల్లో ఇంటర్న్‌షిప్ కార్యక్రమం నిర్వహించారు. ఈక్రమంలో విద్యార్థులు మీ సేవలో కంప్యూటర్‌తో పని చేసే విధానం, ఎరువుల దుకాణంలో సేల్స్‌పై అవగాహన కల్పించారు.

బడిబయట పిల్లలను గుర్తించాలి

ఎర్రగొండపాలెం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, సచివాలయ ఉద్యోగులు బంగారు బాల్యం కార్యక్రమంపై దృష్టి సారించాలని ఎంఈవో పీ అంజనేయులు అన్నారు. సార్డ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బడిబయట పిల్లలను గుర్తించి బడిలో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో లక్ష్మీశ్రీనివాసరావు, ఎంఈవో 2 మల్లునాయక్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, సార్డు సంస్థ మేనేజర్ మహాలక్ష్మి, కోఆర్డినేటరు మరియబాబు, అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్త్ వర్కర్లు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి

గిద్దలూరు టౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నల్లమల అటవీ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గిద్దలూరు మండల పరిసరాలలో చెరువులు, కుంటలకు వర్షం నీరు భారీగా చేరుతున్నది. దీంతో వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయని, పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తలు పాటించాలని అర్బన్ సీఐ కె.సురేష్ ఒక ప్రకటనలో తెలిపారు. దసరా సెలవులు ప్రారంభమైనందున పిల్లలు స్నేహితులతో కలిసి ఈతలకు వెళ్లే ప్రయత్నాలు చేస్తారని, తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండి ఈతలకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

హామీని అమలు చేయాలి

గిద్దలూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఉచిత ఇసుక హామీని అమలు చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులు రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఉచిత ఇసుక హామీతో పాటు గిద్దలూరు సగిలేరువాగులో ఎర్ర ఇసుకను తెచ్చుకునేందుకు అనుమతులు ఇవ్వాలని సంఘ జిల్లా సహాయ కార్యదర్శి టి.ఆవులయ్య అధికారులకు విజ్ఞప్తి చేశారు. సగిలేరులో ఎర్ర ఇసుక తీసుకువచ్చే వారిని అడ్డుకుంటున్నారని, దీని వలన పేద, మధ్యతరగతి ప్రజలు అధిక రేట్లు వెచ్చించి తెల్ల ఇసుక కొనుగోలు చేయాల్సి వస్తుందని, అలాగే ఎర్ర ఇసుక లేక గ్రామాలలో పనులు లేక కార్మికులు అల్లాడిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం ప్రతినిధులు నారాయణ, ఆబేలు, థామస్ పాల్గొన్నారు.

బాలిక కాలిపైకి ఎక్కిన వాహనం

కంభం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : రోడ్డును దాటుతున్న బాలిక కాలిపైకి వాహనం ఎక్కడంతో తీవ్రంగా గాయపడిన ఘటన మంగళవారం అర్ధవీడు మండలం గన్నేపల్లి గ్రామంలో జరిగింది. అర్ధవీడు పోలీసుల తెలిపిన వివరాల మేరకు గన్నేపల్లికి చెందిన దూదేకుల ఆస్మా అనే మూడేళ్ల బాలిక రోడ్డు దాటుతుండగా అదే సమయంలో వేగంగా వచ్చిన వాహనం బాలిక ఎడమ కాలిపై నుంచి వెళ్లడంతో కాలు నుజ్జు నుజ్జు అయింది. బాలికను కంభం ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించి చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నల్ల పొగాకు నిషేధం

పెద్ద దోర్నాల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : నల్ల పొగాకు సాగును ప్రభుత్వం నిషేధించిందని ఏవో జవహర్‌లాల్ నాయక్ అన్నారు. మండలంలోని ఎగువ చెర్లోపల్లి, చిలకచెర్ల గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. సాగులో ఉన్న మిరప, మొక్క జొన్నను ఏవో పరిశీలించారు. కార్యక్రమంలో వీఏఏ శివ నాయక్ పాల్గొన్నారు.











పేదరిక నిర్మూలనలో మార్గదర్శకుల పాత్ర కీలకం

తాళ్లూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీ4 ద్వారా పేదరిక నిర్మూలనలో మార్గదర్శకుల పాత్ర కీలకమని ఎంపీడీవో పి.అజిత అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ సమావేశం హాలులో పీ4పై సచివాలయ సిబ్బంది, మార్గదర్శులతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మార్గదర్శకులు ప్రత్యేక శ్రద్ధచూపి పేదలకు ప్రభుత్వ పథకాలు అందేలా, జీవనోపాధి మెరుగుపడేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ట్రైనర్స్ మస్తాన్, సుబ్బారెడ్డి, కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ అధికారి సానికొమ్ము సత్యం, డిప్యూటీ ఎంపీడీవో డి.నాగమల్లేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

తాళ్లూరు ఎంపీడీవోగా పి.అజిత మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. చీమకుర్తి డిప్యూటీ ఎంపీడీవోగా పనిచేస్తున్న ఆమె ఎంపీడీవోగా పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారుల, ప్రజా ప్రతినిధుల సహాయ సహకారాలతో మండలాన్ని అగ్రగామిగా నిలిపేందుకు కృషిచేస్తానన్నారు. బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీవో అజితను కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

సర్వేలో ప్రతి ఇంటి సమాచారాన్ని నమోదుచేయాలి

పీసీపల్లి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): పీ4 సర్వేలో ప్రతి ఇంటి సమాచారాన్ని ఖచ్చితంగా నమోదు చేయాలని ఎంపీడీవో జీవీ కృష్ణారావు అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పీ4 సర్వేపై జరిగిన శిక్షణలో ఆయన మాట్లాడారు. సర్వేలో ఎలాంటి లోపాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రజలకు అత్యంత వేగంగా, సులభంగా సేవలు అందించేందుకు ఈ సర్వే కీలకంగా మారుతుందన్నారు. సర్వే చేసే విధానం, మొబైల్ యాప్ వినియోగం, డేటా నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించారు.

ఈ సర్వే ద్వారా అర్హులైన లబ్ధిదారులందరికీ ప్రభుత్వ పథకాలు పారదర్శకంగా చేరుతాయన్నారు. మార్గదర్శి, బంగారు కుటుంబాల వివరాలను గుర్తించాలన్నారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటర్ అధికారి ప్రభాకరశర్మ, డిప్యూటీ ఎంపీడీవో వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శరన్నవరాత్రులు

» గాయత్రీదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు


దర్శి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలో శరన్నవరాత్రులు వైభవంగా జరుగుతున్నాయి. దర్శి పట్టణంలోని కనకదుర్గమ్మ, పోలేరమ్మ, దద్దాలమ్మ, వెంకటేశ్వరస్వామి దేవాలయాల్లో అమ్మవారు గాయత్రీదేవిగా దర్శనమిచ్చి పూజలందుకున్నారు. పలుచోట్ల అమ్మవారికి యజ్ఞం చేసి మొక్కులు తీర్చుకున్నారు. అధికసంఖ్యలో మహిళలు అలయాలకు వెళ్లి పూజలు చేశారు.

దొనకొండ: స్థానిక ఆనంద ఆశ్రమంలో గాయత్రీదేవిగా శ్రీఈశ్వరీదేవి భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

పీసీపల్లి: దసరా శరన్నవరాత్రుల సందర్భంగా రెండవ రోజైన మంగళవారం మల్లేశ్వరస్వామి ఆలయంలోని అమ్మవారు శ్రీభ్రమరాంబికాదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయాన్నే కుంకుమార్చనతో మొదలైన పూజలు లలితాసహస్రనామస్తోత్రం, త్రిశూల పూజ, అష్టోత్తరపూజ కార్యక్రమాలను అర్చకస్వామి పలుకూరి సుబ్బారావు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఉభయదాతలు కొండారెడ్డి, శ్రీమతి కొండమ్మలు అమ్మవారికి పట్టుచీరను సమర్పించారు.



దర్శి: గాయత్రీదేవి రూపంలో దర్శనమిస్తున్న అమ్మవారు



పీసీపల్లి: భ్రమరాంబికాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు

త్రిముఖ దుర్గాంబను దర్శించుకొన్న డీఎస్పీ

సీఎస్‌పురం(పామూరు), సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : భైరవకోనలోని శ్రీభైరవేశ్వర దేవస్థానాన్ని డీఎస్పీ సాయిఈశ్వర్ యశ్వంత్, ఎస్‌ఐ ఎం. వెంకటేశ్వరనాయక్ మంగళవారం రాత్రి సందర్శించారు. ఆలయ అర్చకులు ఆశీర్వాదాలు అందజేసి అమ్మవారి శేషవస్త్రాలతో సత్కరించారు. అమ్మవారి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేశారు. త్రిముఖ దుర్గాంబ అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా

నల్లబర్లీ పొగాకును సాగు చేయొద్దు!

తాళ్లూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నల్లబర్లీ పొగాకును సాగు చేయవద్దని తహసీల్దార్ బీవీ రమణారావు అన్నారు. నల్లబర్లీ పొగాకు నిషేధంపై రైతులకు అవగాహన కల్పించేందుకు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఏవో బి.ప్రసాద్‌రావు మాట్లాడుతూ నల్లబర్లీ పొగాకు సాగు నిషేధించినందున, రైతులు ఆపంట సాగుచేస్తే చట్టపర చర్యలు తీసుకుంటామన్నారు. మండలంలో యూరియా కొరత లేదన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై భాస్కర్‌రావు, వైద్యాధికారి రాజేష్‌యాదవ్, డిప్యూటీ తహసీల్దార్ జి.ఫణీంద్ర, రీసర్వే డీటీ ప్రశాంత్, ఆర్‌ఐ సుధీర్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో పేదలకు ఊరట

సీఎస్‌పురం(పామూరు) సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం జీఎస్టీ స్లాబులు తగ్గించడంతో పేదలకు ధరల తగ్గుదలతో ఆర్థిక ప్రయోజం చేకూరిందని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కేవీ రమణయ్య అన్నారు. ఈసందర్భంగా మంగళవారం సీఎస్‌పురంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఆర్థికశాఖమంత్రి నిర్మలా సీతారామన్ చిత్రపటాలకు పాలభిషేకం చేశారు. రమణయ్య మాట్లాడుతూ 395 రకాల వస్తువుల ధరలు తగ్గాయన్నారు. దేశంలో అవినీతి రహిత పాలన మోదీకే సాధ్యమన్నారు. కార్యక్రమంలో ఇండ్ల వెంకటసత్యం, జె.చినసుబ్బయ్య, లక్ష్మణ్‌యాదవ్, సాధు వెంకటేశ్వర్లు, కేవీ సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై మహిళలు శ్రద్ధ చూపాలి

పామూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మహిళలు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించి పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాలని ఆయుర్వేద మెడికల్ ఆఫీసర్ డాక్టర్ గడ్డె ఏడుకొండలు అన్నారు. మంగళవారం మండలంలోని కంభాలదిన్నె ఆయుర్వేద వైద్యశాలలో జరిగిన స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈసందర్భంగా 75 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

కనిగిరి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని పరిశ్రమలశాఖ ప్రోత్సాహక అధికారి గోగినేని థామ్సన్ అన్నారు. స్థానిక అమరావతి ప్రాంగణంలోని సమావేశపు హాలులో మంగళవారం రాంప్ కార్యక్రమంలో భాగంగా ఉద్యమ్‌పై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యమ్ కార్యక్రమం ద్వారా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు శిక్షణ ఇచ్చి వారి ఆర్థిక పురోగతి బాటలు వేయనున్నట్లు తెలిపారు. ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పోషక పదార్థాలతో సంపూర్ణ ఆరోగ్యం

పామూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పోషక పదార్థాలతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని సూపర్‌వైజర్ ఎంవీఎస్ పార్వతి అన్నారు. మంగళవారం మండలంలోని డొడ్డవెంకటపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో 8వ రాష్ట్రీయ పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా స్థానిక ఉత్పత్తులు, బొమ్మలు, పోషకాహార పదార్థాలు, స్థానిక వంటలు, డీఐవై బొమ్మలను ప్రదర్శించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ సీహెచ్ రత్తమ్మ, కార్యకర్తలు ఫణికుమారి, రజియాబేగం, ఖాజాబి, కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

యూరియా నిల్వలపై తనిఖీలు

కనిగిరి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కనిగిరి పట్టణంలో యూరియా నిల్వలపై రెవెన్యూ, పోలీసు అధికారులు మంగళవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. ఒంగోలు బస్టాండు వద్ద ఉన్న యూరియా అమ్మకం షాపు, రామాలయం వీధిలోని షాపులతో పాటు వివిధ షాపులపై ఎస్‌ఐ టి.శ్రీరాం, తహసీల్దార్ ఏ.రవిశంకర్ ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఆయా షాపుల్లోని రికార్డులను, వాటి ఆధారంగా నిల్వలను పరిశీ లించారు. ఎలాంటి తేడాలు లేవని ధ్రువీకరించారు.

ప్రభుత్వ పథకాలు పేదల దరిచేరాలి

ముండ్లమూరు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలు పేదలకు అందేవిధంగా ఆయా శాఖల అధికారులు, సిబ్బంది కృషి చేయాలని ఇన్‌చార్జ్ ఎంపీడీవో షేక్ అబ్దుల్ కరీం అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పీ-4పై జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో పేదరికంలో ఉన్న కుటుంబాలను గుర్తించినట్లయితే మార్గదర్శకులు వారిని దత్తత తీసుకుంటారన్నారు.

ప్రత్యామ్నాయ పంటలు సాగుచేయాలి

ముండ్లమూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులు పొగాకుకు బదులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవాలని దర్శి సహాయ వ్యవసాయ సంచాలకులు కె.బాలాజీ నాయక్ అన్నారు. మంగళవారం మండంలోని బలాపురం, పసుపుగల్లు గ్రామాల్లో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులు సాగు చేసిన వరి పంటను పరిశీలించారు. మండలంలో ఎరువుల కొరత లేదన్నారు. కార్యక్రమంలో ఏవో ఏ.తిరులమరావు, వీఏఏ విజయనిర్మల, సువర్చల తదితరులు పాల్గొన్నారు.

ఈపంట నమోదు చేయించుకోవాలి

పీసీపల్లి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): రైతులు ఈపంట నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఎన్.రంగాక్రిష్ణ అన్నారు. మంగళవారం మండలంలోని బుడ్డారెడ్డిపల్లి, పెదవరిమడుగు గ్రామాల్లో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

పామూరు: రైతులందరూ ఈ పంట నమోదు చేసుకోవాలని ఏవో టి.అబ్రహాం లింకన్ తెలిపారు. మంగళవారం మండలంలోని మోపాడు రైతు సేవా కేంద్రంలో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నానో యూరియా వాడటం వల్ల ఖర్చులు తగ్గి పరిసరాల కాలుష్యం తగ్గుతుందన్నారు.

ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరాలి

పామూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సర్వే ద్వారా గుర్తించిన పేదలను ఆదుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎంపీడీవో ఎల్.బ్రహ్మయ్య అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పీ4 కార్యక్రమంపై పంచాయతి కార్యదర్శులు, గ్రామ సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బంగారు కుటుంబం సర్వే ద్వారా మండలంలో 685 మందిని గుర్తించినట్లు చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో సుందరరామయ్య, పామూరు మేజర్ పంచాయతీ కార్యదర్శి జీవీ అరవిందారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దర్శి ఎంపీడీవోగా కల్పన బాధ్యతల స్వీకరణ

దర్శి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): దర్శి ఎంపీడీవోగా పి.కల్పన మంగళవారం బాధ్యతలు చేపట్టారు. నాగులుప్పలపాడులో డిప్యూటీ ఎంపీడీవోగా పనిచేస్తున్న ఆమె పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల అభివృద్ధికి అందరి సహకారంతో శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు.

ఎంపీడీవోను కలిసిన జనసేన నాయకులు

పీసీపల్లి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో జీవీ కృష్ణారావును మంగళవారం జనసేన నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల ఎంపీడీవో బాధ్యతలు చేపట్టిన ఆయనను జనసేన మండల అధ్యక్షుడు బండారు రాజు, రామక్రిష్ణ, అజయ్‌కుమార్, మోహన్‌క్రిష్ణ, కార్తీక్, చింటు, ఆది తదితరులు కలిసి సన్మానించారు.

ఉపాధి కల్పించాలి

దొనకొండ, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): దొనకొండలో పరిశ్రమలు ఏర్పాటు చేసి ప్రజలకు ఉపాధి కల్పించాలని రైతు సంఘం, వ్యవసాయ కార్మికసంఘం నాయకులు పమిడి వెంకటరావు, కంకణాల ఆంజనేయులు డిమాండ్ చేశారు. దొనకొండలోని కారిడార్ ప్రాంతాన్ని మంగళవారం పరిశీలించారు. కార్యక్రమంలో బాలనాగయ్య, అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
5
బుధవారం 24 సెప్టెంబరు 2025





సభా ప్రాంగణంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ అన్సారియా, ఎస్పీ వకుల్ జిందాల్

శబరి.. బుకింగ్

హాట్‌కేక్‌ల్లా టిక్కెట్‌లు



- నవంబరు 22 వరకు బుకింగ్ క్లోజ్
- ఉదయం 8 గంటలకు టిక్కెట్ కౌంటర్ల వద్ద ఉన్నా ఫలితం శూన్యం
- ఆన్‌లైన్‌లోనూ కన్‌ఫర్మ్ కాని పరిస్థితి

బాపట్ల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): శబరి ఎక్స్‌ప్రెస్‌లో అన్ని తరగతుల టిక్కెట్‌లు హాట్ కేక్‌లు మాదిరిగా బుకింగ్ అయిపోతున్నాయి. రైల్వే శాఖ అడ్వాన్స్ రిజర్వేషన్ పీరియడ్ (ఏ ఆర్‌పీ)ని 60 రోజులకు తగ్గించడంతో నవంబరు నెల 22వ తేదీ వరకు ఓపెన్ చేసిన అన్నీ తేదీలలో టిక్కెట్‌లు బుకింగ్ అయిపోయాయి. స్లీపర్ క్లాస్ మొదలుకొని ఫస్టు ఏసీ వరకు కూడా టిక్కెట్‌లు అందుబాటు లేవు. కనీసం వెయిటింగ్ లిస్టులోనైనా బుకింగ్ చేసుకోలేని విధంగా రిగ్రెట్ మెసేజ్ వచ్చేస్తోన్నది. టిక్కెట్ల కోసం చాలా మంది తెల్లవారు జామునే సమీపంలోని బుకింగ్ కౌంటర్ల వద్దకు వెళ్లి నిరీక్షిస్తున్నారు. ఆధార్ ప్రామాణీకరణ కలిగిన ఐఆర్‌సీటీసీ యూజర్లు మొబైల్ ఫోన్లు/ కంప్యూటర్ల ముందు లాగిన్ అయి కూర్చుంటున్నా టిక్కెట్ బుకింగ్ కావడం లేదు. దీంతో శబరిమలకు ఎలా వెళ్లాలోనని మధన పడుతున్నారు. ఇక భారం అంతా స్పెషల్ ట్రైన్‌ల పైనే వేసి అయ్యప్ప మాలధారణల కు సిద్ధమౌతున్నారు.

ఏటా అక్టోబరు నెల నుంచి ఎక్కువ మంది అయ్యప్ప భక్తులు మాలధారణ చేస్తుంటారు. వీలుని బట్టి 45 రోజుల నుంచి 60 రోజుల పాటు దీక్ష (మిగతా 6వ పేజీలో)

ఆస్తిపన్నుపై.. కసరత్తు

20 శాతం ఆదాయం పెంపే లక్ష్యం

రూ.52 కోట్లు పెరగాలి..

పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల పరిధిలోని పురపాలక సంఘాల్లో ఆస్తి పన్ను ద్వారా వార్షిక ఆదాయం ప్రస్తుతం రూ.258.95 కోట్లుగా ఉంది. ఈ మొత్తంపై 20 శాతం పెంచుకోవాలని ప్రభుత్వం లక్ష్యాలను నిర్దేశించింది. ఈ ప్రకారం మున్సి పాల్టీల్లో ఆదాయం సుమారు రూ.52 కోట్లు పెరుగుతుందని అంచనా.

* గుంటూరు జిల్లాలో గుంటూరు కార్పొరేషన్ సహా జిల్లా పరిధిలోని మున్సిపాల్టీలలో ఆస్తి పన్ను వార్షిక ఆదాయం రూ.185.31 కోట్లు ఉంది. 20 శాతం పెరగాలని ప్రభుత్వం నిర్దేశించింది. ఈ మేరకు 37.06 కోట్లు ఆదాయం పెరిగే అవకాశం ఉంది.
* పల్నాడు జిల్లాలో ఆస్తి పన్ను ఆదాయం రూ 47.01 కోట్లు. రూ.9.40 కోట్లు పెరగాల్సి ఉంది.
* బాపట్ల జిల్లాలో ఆస్తి పన్ను 26.63 కోట్లు ఉండగా రూ.5.32 కోట్లు ఆదాయం పెరగాలని ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించింది.

- పట్టణాల్లో రెండో విడత ఇంటింటి సర్వే
- మున్సిపాల్టీల్లో చేజారిన ఆదాయాలపై దృష్టి
- పన్నుపోటు లేకుండా ఆదాయం పెంపునకు లక్ష్యాలు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

మున్సిపాల్టీల్లో పన్ను పెంచకుండా ఆదాయ వనరులను పొందేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రస్తుతం ఉన్న ఆస్తి పన్నుల ఆదాయం మరో 20 శాతం పెరిగాలని లక్ష్యం నిర్దేశించింది. ప్రభుత్వ ఆదేశాలతో ఆదాయం పెంచుకునేందుకు ఉన్న మార్గాలపై పురపాలకులు దృష్టి సారించారు. ఈ క్రమంలో చేజారిన పన్నులను తిరిగి రాబట్టుకునేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఆస్తి పన్నుల ఆదాయాన్ని పెంచుకునేందుకు సర్వే చేస్తున్నారు. తొలివిడత సర్వే సక్రమంగా జరగలేదని భావించిన డీఎంఏ మరో సారి ఆస్తి పన్ను సర్వేకు ఆదేశించారు. ఈ నేపథ్యంలో రెండో సారి ఆస్తి పన్ను పునః పరిశీలనకు ఇంటింటి సర్వే చేస్తున్నారు. ఈ సర్వేను వచ్చే 15 కల్లా పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఎక్కడికక్కడ మున్సిపాల్టీల్లోని సిబ్బంది, సచివాలయ కార్యదర్శులు మున్సిపల్ రెవెన్యూ అధికారుల పర్యవేక్షణలో సర్వే చేస్తున్నారు. సర్వే జరుగుతున్న తీరుపై డీఎంఏ వారాంతపు సమీక్షలు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ అధికారులు చెబుతున్నారు.

అక్రమాలకు చెక్ పడేనా..

మున్సిపాల్టీలకు ప్రధాన ఆదాయ వనరు ఆస్తి పన్ను. ఈ పన్ను మదింపులో గతంలో అనేక అక్రమాలు చోటుచేసుకున్నాయి. పన్నులకు సంబంధించి గత టీడీపీ ప్రభుత్వం ఆన్‌లైన్ విధానాన్ని ప్రవేశపెట్టింది. భవనం.. ఖాళీ (మిగతా 6వ పేజీలో)



డీఎస్సీ సభకు ఏర్పాట్లు

- వెలగపూడిలో 25న నియామక పత్రాల పంపిణీ
- ఏర్పాట్లలో లోపం ఉండకూడదన్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

తుళ్లూరు(వెలగపూడి), సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీలో ఎంపికైన వారికి ఈ నెల 25న నియామకపత్రాల పంపిణీ సభకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. రాజధాని అమరావతి పరిధిలోని వెలగపూడి రాష్ట్ర సచివాలయం వద్ద ఎన్- 9 రోడ్డు పక్కన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు డీఎస్సీ అభ్యర్థులకు నియామకపత్రాలు అందజేయనున్నారు. వర్షాల నేపథ్యంలో 19న జరగాల్సిన కార్యక్రమం వాయిదా పడింది. అయితే 25న నిర్వహణకు అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. మూడు భారీ జర్మన్ వాటర్ ప్రూఫ్ టెంట్లను ఏర్పాటు చేశారు. విద్యాశాఖ ఉన్నతాధికారులు, గుంటూరు కలెక్టర్ తమీమ్అన్సారియా, ఎస్పీ వకుల్ జిందాల్ ఏర్పాట్లను మంగళవారం పరిశీలించారు. వర్షాభావ పరిస్థితులకు అనుగుణంగా రాకపోకల మార్గాలు, స్టేజి, భారీకేడింగ్ పనులతో పాటు సీటింగ్ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. భద్రత, బందోబస్తు ఏర్పాట్ల గురించి చర్చించారు. ఎల్ఈడీ స్ర్కీన్లు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యాశాఖ సెక్రటరి కోన శశిధర్, డైరెక్టర్ విజయ్ రామరాజు, ఇంటెలిజెన్స్ ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ తదితరులు పాల్గొన్నారు.



డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మకు సమ్మె నోటీసు అందజేస్తున్న వైద్యులు

25 నుంచి పీహెచ్‌సీ వైద్యుల సమ్మె

- అధికారులకు నోటీసు ఇచ్చిన ఏపీపీహెచ్‌సీడీఏ

బాపట్ల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కారం కాని పక్షంలో గురువారం నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామని ఏపీపీహెచ్‌సీడీఏ రాష్ట్ర జాయింట్ సెక్రటరి డాక్టర్ గోపీనాథ్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ హెల్త్ సెంటర్ డాక్టర్స్ అసోసియేషన్ (ఏపీపీహెచ్‌సీడీఏ) ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మలకు సమ్మె నోటీసు అందజేశారు. ఇన్‌సర్వీస్ పీజీ కోటా పునరుద్ధరణ, టైమ్‌బౌండ్ ఉద్యోగోన్నతులు అమలు, గిరిజన ప్రాంతాలలో పనిచేసే వారికి బేసిక్ పే 50శాతం, ట్రైబల్ అలవెన్స్, నోషనల్ ఇంక్రిమెంట్స్ మంజూరు, చంద్రన్న సంచార చికిత్స ప్రోగ్రామ్ కింద వైద్యులకు రూ.5 వేల అలవెన్స్, నేటివిటి అండ్ అర్బన్ ఎలిజిబిలిటీ సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేస్తున్నట్లు వారు ప్రకటించారు. పని గంటలు, స్థిరమైన వాతావరణపు సెలవులు కూడా ఇవ్వాలన్నారు. వైద్యుల జాబ్‌చార్టు ఇవ్వాలని, విషపూరితమైన పని వాతావరణాలు తగ్గించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పీహెచ్‌సీల్లో విచ్చలవిడిగా అనధికార వ్యక్తులు తనిఖీ చేయకుండా స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వాలన్నారు. తగినంత మంది స్టాఫ్‌నర్సులు లేకపోయినా తాము ఆరోగ్య కేంద్రాలను నిర్వహిస్తున్న కఠిన పరిస్థితులను ప్రభుత్వం గమనించాలన్నారు. వైద్యసేవలలో అంతరాయం కలగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో పి.హెచ్‌సి వైద్యులు పాల్గొన్నారు.

మూడో ట్రాక్‌పై తనిఖీలు

నేడు, రేపు 160 కిమీ వేగంతో స్పీడ్ టెస్టు

- పరిశీలించి క్లియరెన్స్ ఇవ్వనున్న సీఆర్ఎస్ బృందం
- చుండూరు-పెదవడ్లపూడి సెక్షన్‌లో ఇన్‌స్పెక్షన్
- అప్పికట్ల - నిడుబ్రోలు మధ్య శాశ్వత డైవర్షన్ పనుల పరిశీలన

గుంటూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): చుండూరు - పెదవడ్లపూడి సెక్షన్‌లో రైల్వే శాఖ పూర్తి చేసిన మూడో రైలుమార్గాన్ని కమిషన్ ఆఫ్ రైల్వే సేఫ్టీ(సీఆర్ఎస్) బుధ, గురువారంలో తనిఖీ చేయనున్నది. దాదాపు 160 కిలోమీటర్ల వేగంతో స్పీడ్ టెస్టు కూడా చేయనున్నది. మోటార్ ట్రాలీ ఇన్‌స్పెక్షన్ ద్వారా సీఆర్ఎస్ అధికారులు పర్యవేక్షించనున్నారు. ఇందుకోసం రెండు రోజుల షెడ్యూల్‌ని దక్షిణ మధ్య రైల్వే హెడ్‌క్వార్టర్స్ సంబంధిత రైల్వే అధికారులకు పంపించింది. ఇన్‌స్పెక్షన్‌కు ఎలాంటి అవరోధాలు తలెత్తకుండా చూసుకోవాలని విజయవాడ డీఆర్ఎంని ఆదేశించారు. దీంతో పాటుగా అప్పికట్ల - నిడుబ్రోలు మధ్య శాశ్వత డైవర్షన్ పనులను కూడా సీఆర్ఎస్ ఇన్‌స్పెక్షన్ చేసి క్లియరెన్స్ ఇస్తారు. ఇందుకోసం సీఆర్ఎస్ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రానుంది. సీఆర్ఎస్‌తో పాటు సిబ్బంది, ఆర్‌వీఎన్ఎల్ అధికారులు కూడా రానున్నారు. ఈ ఇన్‌స్పెక్షన్ కోసం ఐదు మోటార్ ట్రాలీలను వినియోగిస్తారు. ఈ ట్రాలీలను అప్పికట్ల, చుండూరులో అందుబాటులో ఉంచాల్సిందిగా హెడ్‌క్వార్టర్స్ నుంచి ఆదేశాలు జారీ చేశారు.

30 కిలోమీటర్ల ట్రాక్ సిద్ధం..

విజయవాడ-గూడూరు మధ్య మూడో రైలు నిర్మాణంలో భాగంగా బాపట్ల, గుంటూరు జిల్లా పరిధిలో చుండూరు - పెదవడ్లపూడి మధ్య 30 కిలోమీటర్ల సెక్షన్‌ని రైల్వే శాఖ నిర్మించింది. ఇటీవలే 100కు పైగా రైళ్లను బ్రేక్‌డౌన్ చేసి ప్రీఎన్ఐ, ఎన్ఐ వర్కులను కూడా పూర్తి చేసింది. దీంతో రైళ్లను నడిపేందుకు అవసరమైన క్లియరెన్స్‌ని ఇచ్చేందుకు సీఆర్ఎస్ బుధవారం ఉదయం విజయవాడకు చేరుకునున్నది. విజయవాడ డివిజన్ డీఆర్ఎంతో కలిసి ఉదయం 9 గంటలకు మోటారు ట్రాలీ ఇన్‌స్పెక్షన్‌ని అప్పికట్ల నుంచి చేపడతారు. ఇక్కడి నుంచి చుండూరు వరకు మోటార్ ట్రాలీని సాధారణ వేగంతోనే నడిపి పరిశీలిస్తారు. మధ్యాహ్నం 12.30 గంటల లోపు చుండూరు - తెనాలి మధ్య లైట్‌రన్ నిర్వహిస్తారు. భోజన విరామం అనంతరం తెనాలి నుంచి దుగ్గిరాల వరకు ఇన్‌స్పెక్షన్, లైట్‌రన్ చేపడతారు. ఈ నెల 25న గురువారం ఉదయం దుగ్గిరాల నుంచి పెదవడ్లపూడి వరకు ఇన్‌స్పెక్షన్ జరుగుతుంది. ఆ తర్వాత పెదవడ్లపూడి నుంచి చుండూరు/అప్పికట్ల వరకు స్పీడ్ టెస్టు నిర్వహించనున్నారు.



విభాగాలను పరిశీలిస్తున్న ఎస్పీ బి.ఉమామహేశ్వర్

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- పోలీసు కార్యాలయ తనిఖీలో ఎస్పీ ఆదేశాలు

బాపట్ల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కార్యాలయ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పరిశుభ్రత ఆహ్లాదకర వాతావరణంలో ఒత్తిడికి లోనుకాకుండా విధులు నిర్వహించగలమని ఎస్పీ బి.ఉమామహేశ్వర్ జిల్లా పోలీసు ఉద్యోగులకు తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని వివిధ విభాగాలను ఎస్పీ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. మెరుగైన పనితీరుకు సంబంధించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రతినెల మూడో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ప్రతీఒక్కరు వారివారి విభాగాలను శుభ్రం చేసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీసీఆర్‌బీ డీఎస్పీ బాలమురళికృష్ణ, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ జి.నారాయణ, సీఐ శ్రీనివాసరావు, పీజీఆర్ఎస్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, ఆర్ఐలు మౌలుద్దీన్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

భయం భయంగా విధులు

- శిథిలావస్థలో ప్రభుత్వ కార్యాలయాలు



తహసీల్దారు కార్యాలయంలో పెచ్చులు ఊడుతున్న పై కప్పు



శిథిలావస్థకు చేరిన గృహనిర్మాణ శాఖ కార్యాలయం

బల్లికురవ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎప్పుడు ఎవరిపై శ్లాబు పెచ్చులు పడతాయోనని భయంభయంగా ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. విధుల అనంతరం క్షేమంగా ఇంటికి చేరితే చాలన్నట్లుగా ఉద్యోగులు ఉన్నారు. మండల కేంద్రమైన బల్లికురవలో ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించిన ప్రభుత్వ కార్యాలయ భవనాలు శిథిలావస్థకు చేరాయి. భవనాల గోడలు సైతం సిమెంట్ ఊడి పడిపోతుంది. గోడలకు రంగులు వెలిసి అధ్వానంగా మారాయి. నిధులు ఉండి కూడా ఎంపీడీవో కార్యాలయానికి మరమ్మతులు చేయడంలేదని సమాచారం. గృహ నిర్మాణ, తహసీల్దారు కార్యాలయ భవనాలు పై కప్పు పెచ్చులు ఊడి పడుతున్నాయని ఉద్యోగులు వాపోతున్నారు. ఆయా కార్యాలయా ల్లోని పరిస్థితులను చూసి సందర్శకులు సైతం భయపడుతున్నారు.

వరదపై అప్రమత్తంగా ఉండాలి

- నీటి విడుదలతో నదిలో పెరుగుతోన్న ఉధృతి
- ముంపు గ్రామాల పరిస్థితిపై కలెక్టర్ సమీక్ష.. పలు ఆదేశాలు

భట్టిప్రోలు(కొల్లూరు), సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు, ప్రాజెక్టుల నుంచి నీటి విడుదలతో కృష్ణానదికి వరద వచ్చే సూచనలు ఉన్నాయని ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ డాక్టర్ వాసుదేవ వినోద్‌కుమార్ తెలిపారు. రేపల్లె, భట్టిప్రోలు, కొల్లూరు మండలాల్లోని ముంపు గ్రామాల సర్పంచ్‌లు, అధికారులతో భట్టిప్రోలు ఎంపీడీవో కార్యాలయంలో కలెక్టర్ మంగళవారం సమీక్షించారు. 2009లో వెంకట్రావునగర్ దగ్గర కరకట్టకు గండి పడి కుంగిందని, అక్కడ పటిష్ట పరచాలని భట్టిప్రోలు మండల పరిధిలోని పలువురు సర్పంచ్‌లు కలెక్టర్‌ను కోరారు. పెదపులివర్రు నుంచి దోనేపూడి వరకు కరకట్ట బలహీనంగా ఉందని అక్కడ ఎత్తు పెంచి, బలపరచాలని ఆయా గ్రామాల సర్పంచ్‌లు తెలిపారు. వరదల అనంతరం రహదారులు అధ్వానంగా మారుతున్నాయని, వాటి అభివృద్ధికి చర్యలు చేపట్టాలన్నారు. 3 లక్షల క్యూసెక్కుల వరద నీరు విడుదల చేస్తే దోనేపూడి వద్ద చినరేవుపై రాకపోకలకు అంతరాయం కలుగుతుందన్నారు. వరదల సమయంలో తోకలవానిపాలెం, పోతార్లంక, కిష్కిందపాలెం, తిప్పలకట్ట గ్రామాల నుంచి రాకపోకలకు ఇబ్బందికరంగా ఉంటుందని హైలెవల్ వంతెన నిర్మించాలని తెలిపారు. ముంపు గ్రామాల్లోని సమస్యలపై సర్పంచ్ టి.కృష్ణమోహన్ కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. సమావేశం అనంతరం దోనేపూడి వద్ద చినరేవు చప్టాను కలెక్టర్ పరిశీలించారు. వెల్లటూరుతో పాటు ఇక్కడ కూడా ఫెర్రీ ఏర్పాటు చేయాలన్నారు. కొల్లూరు లాకుల వద్ద ఉన్న ఫెర్రీని కూడా కలెక్టర్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కొల్లూరు నుంచి సుమారు కిలోమీటరుకు పైగా పూర్తిగా దెబ్బతిన్న కరకట్ట గురించి తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లు కలెక్టర్‌కు వివరించగా ఆ మార్గాన్ని పరిశీలించారు. ఆయా కార్యక్రమాల్లో రేపల్లె ఆర్డీవో రామలక్ష్మి, తహసీల్దార్లు మేకా శ్రీనివాసరావు, మోర్ల శ్రీనివాసరావు, పి.వెంకటేశ్వరరావు, ఎంపీడీవోలు, అధికారులు పాల్గొన్నారు.



కొల్లూరు వద్ద ఫెర్రీని పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వాసుదేవ వినోద్‌కుమార్



గుంటూరు ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో పనిచేయని ఆర్వో ప్లాంట్

మరమ్మతులు మరిచారు

కళాశాలల్లో అటకెక్కిన ఆర్వో ప్లాంట్లు

- నిర్వహణను పట్టించుకోని నిర్వాహకులు
- ప్రిన్సిపాళ్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోని గుత్తేదారు
- సురక్షిత తాగునీరు అందక విద్యార్థులు అవస్థలు

చీరాల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కళాశాలల్లో విద్యార్థులకు సురక్షిత తాగునీరు అందించేందుకు రూ.లక్షలతో ఆర్వో ప్లాంట్లు నిర్మించారు. అయితే నిర్వహణను పట్టించుకోకపోవడంతో ఆర్వో ప్లాంట్లు మూణ్నాళ్ల ముచ్చటగా మారాయి. మరమ్మతులు గురించి నిర్వహణ సంస్థ పట్టించుకోక పోవడంతో పలు కళాశాల్లో ఆర్వో ప్లాంట్లు నిరుపయోగంగా మారాయి. మరమ్మతుల గురించి గుత్తేదారు పట్టించుకోక పోవడంతో విద్యార్థులకు పరిశుభ్రమైన నీరు అందించడం కాగితాలకే పరిమితమైంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రభుత్వం జూనియర్ కళాశాలలు 21 పైగా ఉండగా గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నాడు నేడు పేరుతో ఒక్కో ఆర్వో ప్లాంట్లను రూ.3 లక్షలకుపైగా వ్యయం చేసి నిర్మించారు. పదివేల లీటర్లకు పైగా పరిశుభ్రమైన తాగునీరు అందించేలా వీటిని ఏర్పాటు చేశారు. ఈ ప్లాంట్లను ఐదేళ్ల పాటు గుత్తేదారు సంస్థ నిర్వహించాలి. అయితే ప్లాంట్లు ఏర్పాటు చేసి రెండున్నరేళ్లు కూడా కాలేదు. అయినా అనేక కళాశాలల్లో ఆర్వో ప్లాంట్లు పని చేయడం లేదు. కొన్నిచోట్ల వైరింగ్, ప్లంబింగ్ సమస్యలతో పాటు సాంకేతిక సమస్యలతో ప్లాంట్లు అటకెక్కాయి. సకాలంలో మరమ్మతు లు చేయాల్సిన కాంట్రాక్టు సంస్థ పట్టించు కోవడంలేదని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆయా సమస్యలపై ప్రిన్సిపాళ్లు ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నా గుత్తేదారు పట్టించుకోవడం లేదు. ఫలితంగా ప్లాంటు ఉన్నా పరిశుభ్రమైన తాగునీరు అందక విద్యా ర్థులు ఇబ్బందులు పడుతున్నారు. గుంటూరులోని వృత్తి విద్య జూనియర్ కళాశాల, బాలి కల జూనియర్ కళాశాలలో ప్లాంట్లు మూడు నెలల నుంచి పనిచేయడం లేదు. ఇటీవల కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ కళాశాలకు వచ్చిన సమయంలో కూడా ప్లాంట్ల పరిస్థితి గురించి విద్యార్థులు, అధ్యాపకులు ఫిర్యాదులు చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా అనేక కళాశాలలో ఆర్వో ప్లాంట్లు పరిస్థితి ఇదే విధంగా ఉందని ఫిర్యాదులు వస్తున్నాయి. ప్లాంట్ల మరమ్మతుల గురించి ఉన్నతస్థాయిలో అధికారులు స్పందిం చాలని విద్యార్థులు, వారి తల్లి దండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు కోరుతున్నారు.



ట్యాప్ ల వద్ద అపరిశుభ్ర వాతావరణం

అవీ..ఇవీ..

గ్రామ దేవతలకు సారె సమర్పణ



అమ్మవారికి సారె తీసుకువెళుతున్న మహిళలు

చినగంజాం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాజుబంగారుపాలెం గ్రామంలో వేంచేసిన గ్రామ దేవతలకు మహిళా భక్తులు భక్తిశ్రద్ధలతో సారెను సమర్పించారు. దసరా పండుగను పురస్కరించుకొని గ్రామంలోని మహిళా భక్తులు తలమీద చీరలు, జాకెట్లు, పసుపు, కుంకుములు, గాజులు, చలిమిడి, పొంగళ్లు, కొబ్బరి కాయులు, అరటి పండ్లు, స్వీట్లును పెట్టుకొని గ్రామంలోని ప్రధాన రహదారులలో మేళతాళాలలో ఊరేగింపుగా వెళ్లి మహాలక్ష్మి, అంకమ్మ, పోలేరమ్మ అమ్మవార్లకు సారె సమర్పించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సారె ఊరేగింపు కార్యక్రమంలో గ్రామ పంచాయతీ పరిధిలోని 500 మంది మహిళలు పాల్గొన్నారు. మూడు వేల మంది భక్తులకు అన్నదానం చేశారు.

గ్రామగ్రామాన స్మార్ట్‌రేషన్ కార్డుల పంపిణీ



స్మార్ట్‌కార్డులు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

పంగులూరు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి):మండలంలోని 21 గ్రామ పంచాయితీల పరిధిలో క్యూఆర్ కోడ్‌తో జారీ అయిన స్మార్ట్‌రేషన్ కార్డులు లబ్దిదారులకు పంపిణీ చేస్తున్నారు. మండలానికి 14,874 స్మార్ట్ రేషన్ కార్డులు మంజూరయ్యాయి. ముప్పవరం గ్రామంలోని రెండు రేషన్ షాపుల పరిధిలో మంగళవారం స్మార్ట్‌రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జేవీ.పాలెం పీఏసీఎస్ అధ్యక్షులు అల్లంనేని బ్రహ్మానందస్వామి, నియోజకవర్గ వాణిజ్యవిభాగం అధ్యక్షులు గరిమిడి జగన్మోహనరావు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు మరియదాసు, డీలర్లు ఉదయగిరి శంకర్, రౌతు వీరాంజనేయులు, వీఆర్‌వో సుబ్బారావు, రమ్య పాల్గొన్నారు.

మున్సిపల్ సిబ్బందికి వైద్యపరీక్షలు



పరీక్షలు చేస్తున్న వైద్యులు

అద్దంకి, సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో స్వచ్ఛత హీసేవా కార్యక్రమాలలో భాగంగా మంగళవారం మున్సిపల్ సిబ్బంది, కార్మికులు, సచివాలయాల సిబ్బంది 130 మందికి వైద్య పరీక్షలు చేశారు. అనంతరం మందులను పంపిణీ చేశారు. వైద్యశిబిరాన్ని మున్సిపల్ కమిషనర్ రవీంద్ర, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ చిన్ని లక్ష్మీశ్రీనివాసరావులు పర్యవేక్షించారు. సీహెచ్‌సీ, అర్బన్ హెల్త్ సెంటర్ల వైద్యులు డాక్టర్ వాహిళాచౌదరి, డాక్టర్ జయసింహా, డాక్టర్ హేమామాధురి లు వైద్య పరీక్షలు చేశారు.

పీ4 అమలుపై కార్యదర్శులకు శిక్షణ

పంగులూరు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): పంచాయతీలో పీ4 అమలుపై పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి మంగళవారం పంగులూరు మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామాలలో మార్గదర్శులకు బంగారుకుటుంబాలకు అనుసంధానం చేసే పద్ధతులను వివరించారు. బంగారు కుటుంబాల అవసరాలు, వాటికి మార్గదర్శుల నుంచి అందించాల్సిన చేయూత, సిబ్బందిపాత్రపై ఆర్పీలకు ప్రజంటేషన్ ఇచ్చారు. ప్రభుత్వ మార్గదర్శకాలను అమలు చేయడంలో సిబ్బంది అప్రమత్తతో వ్యవహరించాలని ఎంపీడీవో స్వరూపారాణి సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో సుమంత్, ఆర్పీలు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యంగా ఉండాలన్నదే లక్ష్యం



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి సాయిశ్రీచరణ్

చినగంజాం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రతి మహిళా సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలన్నదే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం అని చినగంజాం పీహెచ్‌సీ వైద్యాధికారి పి.సాయిశ్రీచరణ్ అన్నారు. 'ఆరోగ్యవంతమైన మహిళ- శక్తిమంతమైన కుటుంబం' కార్యక్రమంలో భాగంగా చినగంజాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని రాజుబంగారుపాలెం గ్రామ సచివాలయంలో మంగళవారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. బలమైన కుటుంబాల కోసం నిర్వహిస్తున్న ఆరోగ్య శిబిరాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ వైద్యశిబిరంలో మహిళలకు రక్తపోటు, మధుమేహం, నోటి క్యాన్సర్, రొమ్ము, గర్భాశయ కేన్సర్లకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తల్లిబిడ్డలు వయోవృద్ధుల సేవలు, కిశోర బాలికల ఆరోగ్య పరీక్షలు, క్షయవ్యాధి స్ర్కీనింగ్ మానసిక ఆయుష్ సేవలు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆయుష్ వైద్యాధికారి భవాని, పీ.హెచ్.సీ. సీ.హెచ్.వో పి.ఝాన్సీరాణి, పీహెచ్ఎన్ కె.స్వర్ణలత, సూపర్‌వైజర్ ఎం.చిరంజీవి, హెల్త్ అసిస్టెంట్ నర్రా మురళి, 104 డీఈవో పొదిలి రాఘవ, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆస్తి పన్నుపై.. కసరత్తు

(5వ పేజీ తరువాయి)

స్థలం కొలతలను ఆన్‌లైన్‌లో పొందుపరిస్తే పన్ను ఎంతో తెలుస్తుంది. ఈ విధానంలో అక్రమాలు జరగవని భావించినా కొన్ని మున్సిపాలిటీల్లో సిబ్బంది చేతివాటం ప్రదర్శించి తప్పుడు కొలతలు నమోదు చేశారు. దీంతో పన్ను తక్కువగా నమోదైందని కూటమి ప్రభుత్వం నిర్ధారించింది. నివాస భవనాన్ని వ్యాపార, వాణిజ్య అవసరాలకు వినియోగించడం, పన్ను విధించిన సమయంలో ఒక అంతస్తు ఉన్న భవనంపై కట్టడాలు కూడా ఉన్నాయి. పైగా గత వైసీపీ ప్రభుత్వంలో అధికార పలుకుబడితో పలువురు పన్నులను తగ్గించుకున్నారు. ఇలాంటి అక్రమాలపై దృష్టి సారించాలని పురపాలకులను డీఎంఏ ఆదేశించింది. దీంతో ఆ లోపాలను గుర్తించేందుకు సర్వే చేస్తున్నారు. అన్ అసైన్డ్.. అండర్ అసైన్డ్ భవనాలను కూడా గుర్తిస్తున్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం తగ్గించాలి

ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పుల్లారెడ్డి



సమీక్ష నిర్వహిస్తున్న సీఎండీ పుల్లారెడ్డి

అద్దంకి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అద్దంకిలో విద్యుత్ సరఫరాలో అంతరా యాలను తగ్గించాలని ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పుల్లారెడ్డి సూచించారు. అద్దంకి డివి జన్ పరిధిలోని విద్యుత్‌శాఖ అధికారులతో మంగళవారం స్థానిక విద్యుత్‌భవన్‌లో సమీక్ష నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభమైన సమీక్ష సాయంత్రం 5 గంటల వరకు కొనసాగింది. అన్ని విభాగాలను సీఎండీ పుల్లారెడ్డి, డైరెక్టర్(టెక్నికల్) మురళీ కృష్ణ యాదవ్ క్షుణ్ణంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పుల్లారెడ్డి విలేకర్లతో మాట్లాడారు. అంతరాయం లేకుండా మెరుగైన విద్యుత్ సరఫరాకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నామన్నారు. అవసరమైన మేర కొత్త సబ్‌స్టేషన్లు ఫీడర్లు ఏబీ స్విచ్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సూర్యఘర్ పథకం ద్వారా శ్లాబు ఉన్న ఇళ్లు ఉన్న ఎస్సీ కాలనీలలోని వినియోగదారుల ఇళ్లపై ఉచితంగా సోలార్ యూనిట్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మిగిలిన లబ్ధిదారులకు రాయితీపై సూర్యఘర్ అమలు చేస్తున్నట్లు తెలిపారు. డిసెంబర్ నాటికి అద్దంకి డివిజన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న 1500 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేస్తామన్నారు. అద్దంకిలో 220/132 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటు ప్రతి పాదనలు ఉన్నాయన్నారు. సంతమాగు లూరు మండలం ఏల్చూరు వద్ద 132/33 కేవీ సబ్‌స్టేషన్ మంజూరు అయ్యిందన్నారు. 5 కొత్త సబ్‌స్టేషన్లు మంజూరు అయ్యాయన్నారు. వీధి లైట్లు పగటి వేళలో కూడా వెలుగుతుండడాన్ని సీఎండీ దృష్టికి తీసుకురాగా త్వరలో స్పష్టమైన నిర్ణయం తీసుకొని విద్యుత్ వృథా వినియో గాన్ని అరికడతామన్నారు. వైసీపీ ప్రభుత్వంలో నిర్మించిన పలు జగనన్న కాలనీలలో ప్రజలు నివాసం ఉండకపోవడంతో ఆయా ప్రాంతాల లో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌లు, విద్యుత్ వైర్లు తొలగించి భద్రపరచనున్నట్లు తెలిపారు. ఎస్ఈ ఆంజనేయులు, ఈఈ నల్లూరి మస్తాన్‌రావు, డిఈఈ లు దామోదరం, సురేంద్రబాబు, ఏఈలు పాల్గొన్నారు.

దొంగలు దొరికితేనే కేసు

- 20 మోటార్ సైకిళ్లు రికవరీ.. పోలీసుల అదుపులో నిందితులు
- ఆరు నెలలుగా ఒంగోలు పరిసరాల్లో బైకుల చోరీ
- దొంగిలించిన కేటీఎం మోటార్ సైకిల్‌పై హల్‌చల్

ఒంగోలుక్రైం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): 'సార్ నా బైక్ దొంగిలించారు' అంటూ పోలీసుస్టేషన్‌కు వెళితే అక్కడ నుంచి వచ్చే సమాధానం ఏంటో తెలుసా? 'మీ బైక్ ఎక్కడ దొరికినా మన పోలీసుస్టేషన్‌కు సమాచారం వస్తుంది. దొరికిన వెంటనే మీకు తెలియజేస్తాం. కేసు నమోదు చేస్తే మీ వాహనం వెంటనే ఇవ్వడం కష్టం. కోర్టు ద్వారా తీసుకోవాల్సి ఉంటుంది' అంటూ పోలీసుల సమాధానం చెప్పి పంపడం పరిపాటిగా మారింది. దీంతో బైక్‌లు పోగొట్టుకున్నావారు పోలీసుస్టేషన్‌ల చుట్టూ తిరగక తప్పడం లేదు.

దొంగిలించిన బైక్‌పైనే దొంగల్ హల్‌చల్

ముగ్గురు యువకులు కేటీఎం బైక్‌ను దొంగిలించి ఆరు నెలలుగా అదే దానిపైనే తిరుగుతూ ఒంగోలుతో పాటుగా పరిసర ప్రాంతాల్లో మోటార్ సైకిళ్ల దొంగతనం చేస్తున్నారు. సీసీఎస్ పోలీసులకు దొరికిన క్లూ ఆధారంగా ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకొని ఇప్పటికి 20 మోటార్ బైక్‌లు రికవరీ చేశారు. దొంగలను పట్టుకున్న తరువాత బైక్ యజమానులను పిలిపించుకొని ఆయా పోలీసుస్టేషన్‌లలో మూడు రోజులుగా కేసులు నమోదు చేస్తున్నారు. మోటార్ సైకిల్ దొంగతనం జరిగిన రోజు కేసు నమోదు చేసి విచారణ చేపడితే దొంగలు ముందుగా దొరికే అవకాశం ఉండేది. 20 బైక్ చోరీలు జరిగేవి కావు. ఆరు నెలల క్రితం బాపూజీ కాంప్లెక్స్‌లో బైక్ పోయిందని ఫిర్యాదు ఇస్తే అదే సమయంలో సీసీఫుటేజీ సక్రమంగా పరిశీలించినట్లు అయితే అప్పుడే దొంగలు దొరికేవారు. ఇప్పుడు దొంగలను పట్టుకున్నది కూడా అదే క్లూతో కావడం గమనార్హం.

కేసు నమోదు చేయకుండా కాలయాపన

మోటార్ బైక్ దొంగతనం జరిగితే కేసులు నమోదు చేయకుండా కాలయాపన చేయడం పోలీసులకు పరిపాటిగా మారింది. ఎక్కడైనా దొంగలు దొరికాక మోటార్ బైక్ రికవరీ చేసిన తరువాత అయా పోలీసుస్టేషన్‌లో కేసులు నమోదు చేస్తున్నారు. ఒంగోలు, పరిసర ప్రాంతాల్లోని పోలీసుస్టేషన్‌లలో ఇటీవల నమోదు చేసిన కేసులే ఉదాహరణ. బైక్ పోయిన వెంటనే సంబంధిత పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసి విచారణ చేపట్టి, సీసీఫుటేజీని పరిశీలిస్తే వెంటనే దొంగలు దొరికిపోతారు. కానీ మోటార్ సైకిళ్ల దొంగలను పట్టుకోవడంలో పోలీసులు ఉదాసీనంగా వ్యవహరించడం సర్వత్ర చర్చనీయాశం అయింది.

ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు సాగు చేయాలి

అడిషనల్ డీపీఎం మెహన్



బల్లికురవలో కషాయాల తయారీ దుకాణాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

బల్లికురవ, సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి): రైతులు తక్కువ ఖర్చుతో సాగయ్యే సేంద్రియ వ్యవసాయాన్ని చేపట్టాలని జిల్లా ప్రకృతి వ్యవసాయ అడిషనల్ డీపీఎం మెహన్ అన్నారు. మంగళవారం మండలం లోని నక్కబొక్కలపాడు, బల్లికురవ గ్రామాలలో కషాయాల యూనిట్‌ను అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ఎవరైన ప్రకృతి పద్ధతిలో పంటలు సాగు చేయాలంటే వారికి అవసరమైన కషాయాలు అన్ని తక్కువ ధరకు అందు బాటులో ఉన్నాయన్నారు. రైతులు కూడా గ్రామాలలో అందుబాటులో ఉండే వస్తువులతో ఎరువులను తయారు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు గొట్టిపాటి లక్ష్మయ్య, ఏవో శ్రీనివాసరావు, వెలుగు ఏపీఎం రాజారావు పలు గ్రామాల ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

బల్లికురవ : పంటల సాగుకు ఇబ్బంది లేకుండా అన్ని గ్రామాలలోని రైతుసేవా కేంద్రాలలో యూరియా అందుబాటులో ఉందని ఏవో శ్రీనివాసరావు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని అంబడిపూడి, వల్లాపల్లి గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యాక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ యూరియాను ప్రభుత్వం రైతుసేవా కేంద్రాలకు పంపుతుందన్నారు. విత్తనశుద్ధి చేసిన తదుపరి పంటలను రైతులు సాగు చేసుకోవాలన్నారు కార్యక్రమంలో టీడీపీ నేతలు దద్దాల అంజయ్య, ఏఈవో మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

పంగులూరు : రైతులు తాముసాగు చేసిన పంటల వివరాలు ఈ-క్రాప్‌లో విధిగా నమోదు చేసుకోవాలని ఏవో డి.సుబ్బారెడ్డి సూచించారు. మండలంలోని తూర్పుతక్కెళ్లపాడు, కొప్పెరపాడు గ్రామాలలో మంగళవారం పొలంపిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన సమయంలో పంటనష్ట పరిహారం పొందాలన్నా, పండించిన పంటఉత్పత్తులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో మద్దతుధరకు అమ్ముకోవాలన్నా ఈ-క్రాప్ నమోదు తప్పనిసరన్నారు.అదేవిధంగా సేంద్రీయ ఎరువుల వినియోగంతో కలిగే ప్రయోజనాలను వివరించారు. బర్లీపొగాకు సాగుపై ఉన్న నిషేదాన్ని రైతులు గుర్తించి ప్రత్యామ్నాయ పంటలుగా అపరాలు, మొక్కజొన్న సాగుచేపట్టాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షులు గొల్లపూడి అంజయ్య, ఎనికపాటి శ్రీనివాసరావు, వ్యవసాయసహాయకులు ఫిలిప్, రైతులు పాల్గొన్నారు.

వరిలో ఆకుచుట్టు పురుగును నివారించుకోవాలి

అద్దంకిటౌన్ : వరి సాగు చేసిన రైతులు ఆకుచుట్టు పురుగును నివారించుకోవాలని ఏవో కొర్రపాటి వెంకటకృష్ణ తెలిపారు. మంగళవారం మండలంలోని ధర్మవరం, శంఖవరప్పాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ యా గ్రామాల పరిధిలో సాగు చేసున్న వరి పంటను పరిశీలించారు. పురుగు గుడ్డు దశలో ఉన్నప్పుడు వేప నూనె ఎకరాకు 500 ఎంల్ పిచికారి చేయాలన్నారు. పురుగు ఉధృతిని బట్టి కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 250 గ్రాములు ఎ కరాకు పిచికారి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో కోటేశ్వరరావు, వీఏఏలు శేషయ్య, ఖాజాబీ, ఆత్మ బ్లాక్ మేనేజర్ శేషారావు, రైతులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై తల్లులకు అవగాహన



అంబేద్కర్ కాలనీలో ప్రచారం నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

మార్టూరు, సెప్టెంబరు23 (ఆంధ్రజ్యోతి): అంగనవాడీ కేంద్రాలు ద్వారా చిన్నారులకు, వారి తల్లులకు బలవర్ధకమైన ఆహారాన్ని అందిస్తున్నామని అంగనవాడీ కార్యకర్త భాగ్యమ్మ అన్నారు. మంగళవారం మార్టూరులో అంబేద్కర్‌నగర్ లో అంగనవాడీ కార్యకర్తలు మహాపోషణ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కార్యకర్త భాగ్యమ్మ మాట్లాడుతూ ఆరేళ్ల లోపు పిల్లలకు పూర్వ ప్రాథమిక విద్యను తమ కేంద్రాల ద్వారా అందించడానికి కృషి చేస్తామన్నారు. మరో కేంద్రం కార్యకర్త ఎస్తేరు రాణి మాట్లాడుతూ తల్లులు ఆరోగ్యంగా ఉన్నపుడే పిల్లలు కూడా ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఆటలు,పాటలు ద్వారా చిన్నారులకు కేంద్రాలలో చదువును నేర్పించడం జరుగుతుందన్నారు కార్యక్రమంలో అంగనవాడీ కార్యకర్త కోటమ్మ పాల్గొనగా, మద్దిసీతాదేవినగర్ కేంద్రంలో కార్యకర్త పుష్పరాణి ఆధ్వర్యంలో పోషణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవడంతో పాటు కార్మికులకు 13 గంటల పనిభారాన్ని రద్దు చేయాలని ఐఎల్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి సుందరం డిమాండ్ చేశారు. మంగళవారం గాంధీనగర్‌లోని మూడుబొమ్మల సెంటర్ వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఎస్‌కే సర్దార్, కే కార్తీక్, దాసరి సంగీతరావు, ఐ.వెంకటేశ్వర్లు, యలమంద, బ్రహ్మజి, ఏసురత్నం, సుబ్బారావు, రామకృష్ణ ఉన్నారు.

రక్తదాన శిబిరం ఏర్పాటు



రక్తదాన శిబిరంలో పాల్గొన్న బీజేపీ నేతలు

చీరాల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రతిఒక్కరూ సేవాభావంతో రక్తదానం చేయడం వలన సమాజానికి ఎంతో మేలు చేకూరుతుందని బీజేపీ బాపట్ల పార్లమెంట్ కన్వీనర్ బండారుపల్లి హేమంత్‌కుమార్, రెడ్‌క్రాస్ చైర్మన్ బూదరాజు శశికిరణ్ అన్నారు. దేశప్రదాని మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని బీజేపీ, చీరాల రెడ్ క్రాస్ సంయుక్తంగా నిర్వహించిన రక్తదాన శిబిరంలో పలువురు కార్యకర్తలు పాల్గొని రక్తదానం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెడ్‌క్రాస్ సమాజానికి మేలుకరమైన సేవలు అందిస్తున్నట్లు కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు డా. తాడివలస దేవరాజ్, అబ్దుల్, డా.కుమార్, పూర్ణ, ప్రసాద్, సుబ్బారావు, తేజస్వీ, చంద్ర, జనసేన నాయకులు మామిడాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

శబరి..బుకింగ్

(5వ పేజీ తరువాయి)

చేసి ఇరుముడులతో అయ్యప్పస్వామిని దర్శించుకొనేందుకు బయలుదేరుతుంటారు. దాదాపుగా ఒక రోజంతా ప్రయాణ సమయం ఉండటంతో ఎక్కువమంది రైళ్లలోనే వెళ్లేందుకు ప్రాధాన్యం కనబరుస్తుంటారు. అయితే గుంటూరు మీదగా శబరిమలకు వెళ్లే ఒకే ఒక్క రైలు శబరి ఎక్స్‌ప్రెస్. ఇది సికింద్రాబాద్‌లో బయలుదేరి ఉమ్మడి గుంటూరు జిల్లాలో నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, నిడుబ్రోలు, బాపట్ల మీదుగా ప్రయాణిస్తుంది. ప్రస్తుతం నంబరు. 17230గా ఉన్న సికింద్రాబాద్ - తిరువనంతపురం శబరి ఎక్స్‌ప్రెస్ ఈ నెల 29వ తేదీ నుంచి నంబరు. 20629 సూపర్‌ఫాస్టు ఎక్స్‌ప్రెస్‌గా మారబోతున్నది. ఈ కారణంగా టైంటేబుల్‌ని కూడా మార్పు చేశారు. 28వ తేదీ వరకు ప్రస్తుత కాలమానపట్టికలోనే ప్రయాణిస్తుంది. 29వ తేదీ నుంచి మాత్రం సికింద్రాబాద్‌లో మధ్యాహ్నం 2.25కి బయలుదేరి సాయంత్రం 4.59కి నడికుడి, 5.19కి పిడుగురాళ్ల, 5.49కి సత్తెనపల్లి, 6.35కి గుంటూరు, రాత్రి 7.33కి తెనాలి, 7.53కి నిడుబ్రోలు, 8.13కి బాపట్ల, 8.28కి చీరాల, మరుసటి రోజు మధ్యాహ్నం 2.12కి కొట్టాయం, 2.55కి చెంగనూరు, సాయంత్రం 6.20కి తిరువనంతపురం చేరుకొంటుంది.

అయ్యప్ప భక్తులు ఇరుముడులు కట్టించుకొని మధ్యాహ్నం భోజనం చేసి కాసేపు విశ్రాంతి తీసుకొని ఈ రైలులో బయలుదేరే విధంగా టైంటేబుల్ ఉండటంతో ఇందులో ప్రయాణించేందుకు ఆసక్తి చూపుతున్నారు. విజయవాడ మీదగా శబరిమలకు వెళ్లే రైళ్లు ఉన్నప్పటికీ అవి దూర ప్రాంతాల నుంచి వచ్చేవి. ప్రస్తుతం తత్కాల్ కోటా టిక్కెట్‌లు ఎలాగైతే హాట్‌కేక్‌లు మాదిరిగా బుకింగ్ అయిపోతాయో శబరి ఎక్స్‌ప్రెస్‌కి ఏ రోజుకు ఆ రోజు ఉదయం 8 గంటలకు బుకింగ్ ఇలా తెరవగానే అలా అయిపోతున్నాయి. ఈ నేపథ్యంలో రద్దీ రోజులను బట్టి టీవోడీ(ట్రైన్ ఆన్ డిమాండ్)లను శబరిమలకు నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు.



పాలుట్లలో రోగులను పరిక్షిస్తున్న డాక్టర్

200 మందికి వైద్య పరీక్షలు

ఎర్రగొండపాలెం రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లమల అటవీ ప్రాంతమైన పాలుట్లలో డాక్టర్ కోటా నాయక్ ఆధ్వర్యంలో 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. 'స్వస్థ్ నారీ-సశక్త్ పరివార్'లో భాగంగా గూడెంలో ఆరోగ్య శిబిరం నిర్వహించి 200 మందికి పరీక్షించి అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎం జ్యోతి రాణి, స్టాఫ్‌నర్స్ అరుణ, ల్యాబ్‌టెక్నీషియన్ జానారెడ్డి, డీ జాస్మిన్, త్రివేణి, వెంకట రామయ్య సిబ్బంది పాల్గొన్నారు.

సమతుల ఆహారంతో ఆరోగ్యం

కొండపి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : సమతుల ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విక్టోరియారాణి తెలిపారు. పోషణ మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం మండలంలోని చోడవరం, కట్టుబడివారిపాలెం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. అనంతరం పోషకాహారాన్ని ప్రదర్శించారు.

మహిళ ఆరోగ్యమే కుటుంబానికి బలం

- డిప్యూటీ డీఎంహెచ్‌వో వాణిశ్రీ

సింగరాయకొండ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మహిళ ఆరోగ్యంగా ఉంటే ఆ కుటుంబం బలంగా ఉంటుందని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ వాణిశ్రీ అన్నారు. మండలంలోని మూలగుంటపాడు విలేజ్ క్లినిక్‌లో మంగళవారం నిర్వహించిన స్వస్థనారి-సశక్త్ పరివార్ కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం గర్భిణులు, బాలింతలు, పౌష్టికాహార లోపం ఉన్నవారిని గుర్తించి వైద్య పరీక్షలు నిర్వహించారు. తదుపరి సింగరాయకొండ పీహెచ్‌సీని సందర్శించారు. రికార్డులను పరిశీలించి వైద్యులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు షేక్ అయేషా, ధీరేందర్, వంశీధర్, సిబ్బంది పాల్గొన్నారు.

137 మంది మహిళలకు వైద్యపరీక్షలు

కొండపి : స్వస్థనారీ-సశక్త్ పరివార్ కార్యక్రమంలో భాగంగా కె.ఉప్పలపాడు గ్రామంలో మంగళవారం 137 మంది మహిళలకు పరీక్షలు చేశారు. వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈసందర్భంగా గ్రామస్థులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పెట్లూరు పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రియాంక, టీడీపీ గ్రామ నాయకుడు గుండపనేని రామ్మూర్తి నాయుడు, వైద్యారోగ్యశాఖ, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

గాయత్రీదేవిగా జాలమ్మతల్లి

సింగరాయకొండ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : సింగరాయకొండలోని జాలమ్మతల్లి దేవస్థానంలో శరన్నవరాత్రులు వైభవంగా నిర్వహిస్తున్నారు. రెండోరోజైన మంగళవారం అమ్మవారు గాయత్రీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి దర్శించుకున్నారు. అర్చకులు తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త దాసరి యానాదిరావు పాల్గొన్నారు.

గాయత్రీదేవిగా పోలేరమ్మ

జరుగుమల్లి (కొండపి), సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : దసరా నవరాత్రుల్లో రెండో రోజైన మంగళవారం కామేపల్లిలోని పోలేరమ్మ గాయత్రీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమాన్ని ఆలయ ఈవో బైరాగి చౌదరి పర్యవేక్షించారు.

నేడు క్వారీ ఓనర్లకు అవగాహన సదస్సు

చీమకుర్తి,సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి) : సీనరేజి వసూళ్ల ప్రక్రియను ప్రైవేటీకరణ చేసిన నేపథ్యంలో గెలాక్సీ గ్రానైట్ ఓనర్లకు బుధవారం గనులశాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. సీనరేజి వసూళ్ల అధికారం పొందిన ఏఎంఆర్ సంస్థ ప్రతినిధులు, మైన్స్ శాఖాధికారులు పాల్గొననున్నారు.

పురుగు మందుల దుకాణాలలో తనిఖీలు

ఒంగోలుక్రైం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ఎరువులు, పురుగుమందులు దుకాణాలలో మంగళవారం పోలీసు తనిఖీలు నిర్వహించారు. నిల్వలను పోలీసులు పరిశీలించారు. రికార్డులు తనిఖీలు చేశారు. ఒంగోలు బండ్లమిట్టలోని ఎరువులు దుకాణంలో సీఐ మేడా శ్రీనివాసరావు తనిఖీ చేశారు. అదే విధంగా కొత్తపట్నం మండలంలో కూడా ఎరువులు దుకాణాలు తనిఖీ చేసి యూరియ నిల్వల గురించి వాకబు చేశారు.

గాయత్రీదేవి అలంకరణలో అమ్మవారు

● వివిధ ఆలయాల్లో కొనసాగుతున్న శరన్నవరాత్రులు ● ఆకట్టుకుంటున్న అమ్మవారి అలంకరణలు

పర్చూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా మంగళవారం శ్రీ గాయత్రీదేవి అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. నవరాత్రి వేడుకల్లో భాగంగా ఆయా ఆలయాలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. స్థానిక అద్దంకి నాంచారమ్మ అమ్మవారి ఆలయంలో అమ్మవారిని గాయత్రీ దేవిగా అలంకరించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో వేడుకలను ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అత్యంత వేడుకగా జరుపుతున్నారు. అదేవిధంగా పర్చూరు మండల పరిధిలోని చెరుకూరు గ్రామంలో వేంచేసిన శ్రీ త్రివిక్రమ అగస్త్యేశ్వర స్వామివారి ఆలయంలో విశిష్ట పూజా కార్యక్రమాలు చేపడుతున్నారు. అలాగే నాగులపాలెం, నూతలపాడు, ఉప్పుటూరు, అన్నంబొట్లంవారిపాలెం గ్రామాల్లో అత్యంత భక్తిశ్రద్ధలతో దసరా శరన్నవరాత్రి వేడుకలు నిర్వహించి భక్తిని చాటుకున్నారు.

రెండోరోజు ఆలయాల్లో ప్రత్యేక పూజలు

మార్టూరు :దసరా శరన్నవరాత్రి ఉత్సవాలులో భాగంగా రెండవ రోజు మంగళవారం అమ్మ వారి ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. మార్టూరులోని దుర్గామల్లేశ్వరి దేవస్థానం, నాగరాజుపల్లి గ్రామంలో శ్రీగంగా పార్వతీ సమేత నాగలింగేశ్వర స్వామి దేవస్థానంలో గాయత్రీదేవి అవతరణలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా అమ్మ వారిని వివిధ రకాలు పూలదండలతో అలంకరించారు. అదేవిదంగా మార్టూరులో శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో అమ్మ వారిని శ్రీబాలత్రిపురసుందరి అవతారంలో, మండలంలోని ద్రోణాదుల గ్రామంలో అంకాళ పరమేశ్వరి దేవాలయంలో శ్రీలలిత త్రిపురసుందరిదేవి అవతారంలో అలంకరించారు. మార్టూరలోని బొడ్డరాయి కూడలిలోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయాన్ని సర్వాంగసుందరంగా విద్యుత్ దీపాలంకరణ చేశారు. రాత్రి సమయంలో భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

చినగంజాం : మండలంలోని పలు దేవాలయాలలో దసరా పండుగను పురస్కరించుకుని దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా అమ్మవారు వివిధ అలంకరణల్లో భక్తలకు దర్శనం ఇచ్చారు. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం స్థానిక రైల్వే సెంటర్ భవానీపురంలోని విజయకనకదుర్గాభవాని దేవస్థానంలోని అమ్మవారిని, చినగంజాం వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి మందిరంలోని అమ్మవారిని గాయత్రీదేవి అలంకారంలో, సోపిరాల రామకోటేశ్వరస్వామి దేవ స్థానంలో లలితాపరమేశ్వరి అమ్మవారిని పంచముఖ గాయత్రీదేవి అవతారంలో అలంకరించి భక్తులకు దర్శ నం కల్పించారు. స్థానిక భూ సమేత భావనారాయణస్వామి ఆలయంలో 18వ వార్షిక బ్రహ్మోత్సవాలల్లో భాగంగా మంగళవారం ఉదయం అగ్నిప్రతిష్ఠాపన, నిత్యహోమం నిర్వహించారు. అనంతరం ఆలయప్రాంగణంలో మహిళా భక్తులు హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాత్రికి గ్రామోత్సవంలో శేషవాహనంపై శ్రీవారు భక్తులకు దర్శనమిచ్చారు. పూజలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు, ఆలయ సేవాదళ్ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



చినగంజాంలోని రామకోటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

అద్దంకి : దసరా శరన్నవరాత్రులలో భాగంగా మంగళవారం స్థానిక కన్యకాపరమేశ్వరి అమ్మవారు భువనేశ్వరిదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా ఈశ్వరబహదూర్ బృందంతో ఆలపించిన గీతాలు, సంగీతం, నృత్యప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. దేవస్థానం అధ్యక్షుడు ఊటుకూరి రామకోటేశ్వరరావు, చిన్ని లక్ష్మీశ్రీనివాసరావు, అర్వపల్లి హనుమంతరావు, పోకూరి శ్రీనివాసరావు, నేరేళ్ల శ్రీనివాసరావు, పూజారి స్వర్ణ వెంకటసుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పూజలు నిర్వహించారు. పట్టణంలోని దత్తపాదుకాక్షేత్రం, వేయిస్థంభాల గుడి తదితర దేవాలయాలలో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు.

విశేషంగా శరన్నవరాత్రులు

పంగులూరు : మండలంలోని పలు ఆలయాలలో శ్రీదేవీ శరన్నవరాత్రి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని గాయత్రిదేవిగా ప్రత్యేకంగా అలంకరించారు. ముప్పవరంలోని శ్రీలక్ష్మీ గణపతిషిర్డీసాయి ఆలయంలో గణపతిపూజ, నవావర్ణపూజ, స్వామివారికి రుద్రాభిషేకం, సూక్తహోమములు నిర్వహించారు. సాయంత్రం శ్రీచక్ర నవావర్ణపూజ, సహస్రనామము, కుంకుమార్చన శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముప్పవరం, కొండమూరు, రామకూరు గ్రామాలలో గాయత్రిదేవి రూపంలో దర్శనమిచ్చిన అమ్మవారిని దర్శించుకున్న భక్తులు ప్రత్యేక పూజలుచేశారు. పంగులూరు, చందలూరు తదితర గ్రామాలలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలుచేశారు.



నాగరాజుపల్లిలో గాయత్రీదేవిగా, ద్రోణాదులలో లలిత త్రిపుర సుందరిగా అమ్మవారు, అద్దంకిలో భువనేశ్వరి దేవిగా కన్యకా పరమేశ్వరి, ముప్పవరంలో అమ్మవారి గాయత్రీ దేవి అలంకరణ, పర్చూరులో అద్దంకి నాంచారమ్మ అలంకరణ

అవీ..ఇవీ..

సముద్రపు నాచు పెంపకంపై శిక్షణ



సముద్రపు నాచు పెంపకంపై మత్స్యకారులకు శిక్షణ ఇస్తున్న అధికారులు

చినగంజాం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి) : సముద్ర నాచు పెంపకం ద్వారా తీరప్రాంత మత్స్యకారుల స్థితిగతుల మార్పు, ఆర్థిక పరిస్థితులు మెరుగుపడతాయని జిల్లా మత్స్యశాఖ అధికారి కే.శ్రీనివాస్‌నాయక్ అన్నారు. పెదగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని పల్లెపాలెం గ్రామంలోని గ్రామ సచివాలయం-2లో జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ఫిషర్‌మెన్ సొసైటీస్ ఫెడరేషన్ లిమిటెడ్ వారి సహకారంతో సముద్ర నాచు పెంపకంపై మంగళవారం మత్స్యకారులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సముద్ర నాచుపెంపకం చేపట్టడానికి ఆసక్తి ఉన్న మత్స్యకారులను, మత్స్యకార మహిళలను ఎంపిక చేయాలని జిల్లా మత్స్యశాఖ అధికారి ఏపీఎం గద్దె పెదసుబ్బారావుకు సూచించారు. శిక్షణ కార్యక్రమంలో పల్లెపాలెం గ్రామానికి చెందిన 60 మంది మత్స్యకారులకు సముద్ర నాచు ఉత్పత్తి, వాటి వినియోగం, వివిధ రకాల సముద్ర నాచు పెంపక పద్ధతులు, కొనుగోలు ప్రక్రియ, విలువ ఆధారిత ఉత్పత్తులపై శిక్షణా కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. మత్స్యకారులకు ఏటిమొగ సముద్రతీరం వద్ద సముద్ర నాచు పెంపకం ఎలా చేపట్టాలో పర్యావరణ తరంగ మేనేజింగ్ డైరెక్టర్ మాధవి ప్రదర్శన చేసి చూపించారు. కార్యక్రమంలో భావదేవరపల్లి ఎంవీకేఆర్ మత్స్యపాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.అనుపమ, జిల్లా మత్స్యశాఖ సహాయ సంచాలకులు బి.కృష్ణకిషోర్, కారంచేడు మత్స్యశాఖ అభివృద్ధి అధికారి ఎం.రవీంద్ర, ఎఫ్‌డీవో కిషోర్‌రెడ్డి, సాగరమిత్రులు పాల్గొన్నారు.

ఆయిల్‌ఫామ్ సాగుపై రైతులకు అవగాహన



ఏలూరులో పర్యటించిన రైతులతో ఉద్యాన అధికారి

మార్టూరు, సెప్టెంబరు23 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆయిల్‌పామ్ సాగుపై ఉద్యానశాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఆసక్తి గలిగిన రైతులను అధికారులు ఒక రోజు పర్యటనకు తీసుకువెళ్లారు. ఉద్యానశాఖ అధికారి బి హనుమంతనాయక్ ఆధ్వర్యంలో రైతులను ఏలూరు సమీపంలోని పెదవేగి గ్రామంలో ఉన్న ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆయిల్‌పాం రీసర్చ్‌స్టేషన్‌కు తీసుకువెళ్లారు. అనంతరం అక్కడ విజయ్‌రాయ్ అనే గ్రామంలో ఉన్న ఉద్యాన పరిశోధనా స్థానంలో ఆయిల్‌ఫామ్ సాగుకు సంబందించిన వివరాలను ఉద్యాన శాస్త్రవేత్తలు డాక్టరు సుశీల, డాక్టరు మాదవీలతలు రైతులకు వివరించారు. తరువాత దిబ్బగూడెం గ్రామంలో ఆయిల్‌ఫామ్,వక్క, పసుపు తోటలను రైతులు సందర్శించారు. వీటి సాగుపై వాటి యజమాని ఉప్పలపాటి చక్రపాణి రైతులకు అవగాహన కలిగించారు. కార్యక్రమానికి మండలంలోని బొబ్బేపల్లి, ద్రోణాదుల, నాగరాజుపల్లి, కోలలపూడి, వలపర్ల గ్రామాలకు చెందిన రైతులు తరలివెళ్లారు.

స్వర్ణకారుడిపై కేసు నమోదు

● బంగారం వస్తువులు చేస్తానని రూ.30 లక్షలకు టోకరా

ఈపూరుపాలెం(చీరాల), సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : బంగారు వస్తువులు చేసిస్తానని పలువురిని మభ్యపెట్టి ఈపూరుపాలెంకు చెందిన స్వర్ణకారుడు బూదాటి మల్లికార్జునరావు సుమారు రూ.30 లక్షలు నగదుతో ఉడాయించాడు. ఈపూరుపాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.., గ్రామానికి చెందిన ఆయన కొంత కొంతకాలంగా విడతల వారీగా ప్రజల నుండి నగదు వసూలు చేశాడు. అయితే రోజులు గడుస్తున్నా తిరిగి నగదు కానీ, వస్తువులు కానీ ఇవ్వకపోడంతో ప్రజలు అతడిని నిలదీస్తూ వచ్చారు. అకస్మాత్తుగా అతను ఇంటి నుండి పరారయ్యాడు. మోసపోయినట్లు తెలుసుకున్నా బాధితులు పోలీసులను ఆశ్రయించారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే బాధితుల సంఖ్య పెరిగే అవకాశం కూడా ఉందని పోలీసులు భావిస్తున్నారు.

ప్రభుత్వ కళాశాలకు సీలింగ్ ఫ్యాన్లు వితరణ



కళాశాలకు ఫ్యాన్‌లు అందిస్తున్న దాతలు

చీరాల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని వైఎ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు విశ్రాంత బ్యాంకు మేనేజర్ కేవీ శేషబాబు నాలుగు సీలింగ్ ఫ్యాన్‌లు అందజేశారు. ప్రభుత్వ కళాశాల అభివృద్ధికి తనవంతు సహకరిస్తానని ఆయన చెప్పారు. ప్రిన్సిపల్ డా.ఎన్ మురళీ మాట్లాడుతూ విద్యాలయాలకు సహకారం అందించడం ఆనందదాయకమన్నారు. శేషబాబుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

ఆయుర్వేద మొక్కలను పరిరక్షించండి



ఔషధమొక్కలను పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ తిరుపతమ్మగోపి

అద్దంకిటౌన్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఆయుర్వేదం ప్రాముఖ్యతను ప్రజలు తెలుసుకోవాలని 4వ వార్డు కౌన్సిలర్ మాగులూరి తిరుపతమ్మ అన్నారు. మంగళవారం ఇండియా ఎంపవర్మెంట్ అండ్ ఎడ్యూకేషనల్ రూరల్ డెవలప్‌మెంట్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని 4వ వార్డులో ఆయుర్వేద దినోత్సవం 2025 సందర్భంగా ఆయుర్వేదంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రజలకు యాలకులు, తులసి, ఇన్సులిన్ ప్లాంట్, అశ్వగంధ, రణపాల, కరివేపాకు, తమలపాకు, రోజుమేరీ, మరువం, మల్లె, తిప్పతీగ వంటి పలు రకాల మొక్కలను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో సచివాలయం అడ్మిన్ అశోక్, ఐఈఈఆర్‌డీ ప్రెసిడెంట్ బత్తుల కిరణ్‌చంద్, వాణిశ్రీ, సుధారాణి, మునీష్, ధనలక్ష్మి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

'మహిళాశక్తి'తో ఆర్టీసీకి రికార్డు ఆదాయం

● ఒక్కరోజులో రూ.15.43 లక్షల ఆదాయం

అద్దంకి,సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి): అద్దంకి ఆర్టీసీకి మరోసారి రికార్డు స్థాయి ఆదాయం వచ్చింది. సోమవారం అద్దంకి డిపోకు చెందిన 64 బస్సుల ద్వారా రూ.15,43,027 ఆదాయం వచ్చినట్లు అసిస్టెంట్ డీఎం మహబూబి తెలిపారు. మహిళాశక్తి పథకం అమలు ప్రారంభించినప్పటి నుంచి సోమవారం వరకు 6 రోజులలో 100 శాతం ఓఆర్ వచ్చినట్లు తెలిపారు. సోమవారం 105 శాతం ఓఆర్ వచ్చినట్లు తెలిపారు.

అద్దంకిటౌన్ హాల్ నిర్మాణానికి సన్నాహాలు

రూ.3.30 కోట్లు ఇచ్చేందుకు ముందుకు వచ్చిన అదానీ సంస్థ

అద్దంకి, సెప్టెంబరు23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో టౌన్ హాల్ నిర్మించేందుకు అదానీ సంస్థ ముందుకు వచ్చింది. పట్టణంలోని భవానిసెంటర్‌లో 16 సెంట్ల స్థలంలో అద్దంకి టౌన్‌హాల్ నిర్మాణం చేయాలని పలువురు మంత్రి రవికుమార్ దృష్టికి తీసుకు పోయారు. ఈ నేపథ్యంలో రెండు అంతస్థులతో రూ.3.30 కోట్లతో ఆదాని సంస్థ సామాజిక బాధ్యతగా టౌన్‌హాల్ నిర్మించేందుకు ముందుకు వచ్చింది. ఈ నేపథ్యంలో ఇటీవల ఆదాని సంస్థల ప్రతినిధులు స్థల పరిశీలన చేశారు. అద్దంకి టౌన్ హాల్ నిర్మాణానికి రూ.3.30 కోట్లు మంజూరు చేసేందుకు ఆ సంస్థ ఉన్నత స్థాయి అధికారులు అంగీకరించినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో త్వరలో పనులు కూడా ప్రారంభం కానున్నాయి. గ్రౌండ్ ఫ్లోర్ లో ముందు వైపు పార్కింగ్‌కు వదిలి, డైనింగ్‌హాల్ నిర్మాణం చేయనున్నారు. మొదటి అంతస్తు లో 180 మంది కూర్చొనే విధంగా సీటింగ్ తో హాల్ నిర్మాణం చేయనున్నారు. నిర్మాణం పూర్తయిన తరువాత అద్దంకి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహించే విధంగా ఏర్పాటు చేయనున్నారు. దీంతో పేద, మధ్య తరగతి కుటుంబాలు తక్కువ ఖర్చుతో వేడుకలు చేసుకునే అవకాశం ఏర్పడుతుంది. ఎన్నో ఏళ్ళు గా ఎదురు చూస్తున్న అద్దంకి టౌన్ హాల్ నిర్మాణం ఎట్టకేలకు నెరవేరనుంది.



పట్టణంలోని భవానీ సెంటర్‌లో టౌన్‌హాల్ నిర్మించనున్న స్థలం

ఆర్‌వోబీ వంతెన సమస్యపై ఎమ్మెల్యే గళం

● అసెంబ్లీలో ప్రస్తావించిన కొండయ్య

చీరాల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : చీరాల ప్రజా సమస్యలకు పరిష్కారం చూపాలని ఎమ్మెల్యే కొండయ్య అసెంబ్లీ సమావేశాల్లో గళం వినిపించారు. చీరాల అగ్నిప్రమాద కేంద్రం సమీపంలోని ఏర్పాటు చేయనున్న రైల్వే ఓవర్ బ్రిడ్జ్ (ఆర్‌వోబీ) వంతెన ఇటీవల అనివార్య కారణాలతో రద్దయ్యింది. అయితే దీనిపై అసెంబ్లీ లో ఎమ్మెల్యే స్పందించి మాట్లాడారు. గతంలో 1999 సంవత్సరంలో దగ్గుబాటి రామానాయుడు ఎంపీగా ఉన్నప్పుడు పర్చూరు వైపు ఒక ఆర్‌వోబీ ఏర్పడిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన సభ దృష్టికి తీసుకొచ్చారు. అయితే తాజాగా మరో వంతెన ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇప్పటికే మంజూరైన ఈ వంతెన రద్దు కావడంతో సమస్య మళ్లీ మొదటికి వచ్చింది. దీంతో దాదాపుగా రెండు లక్షల మంది ప్రజలు రాకపోకలకు నిత్యం ఇబ్బంది పడుతున్న విషయాన్ని సభకు వివరించారు. వెంటనే సమస్యకు పరిష్కారం చూపాలని ఎమ్మెల్యే కోరారు.



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

ఇంకొల్లులో డ్రోన్ పైలెట్ శిక్షణ కేంద్రం

ఇంకొల్లు, సెప్టెంబరు 23,(ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వ పౌరవిమానశాఖ ఆధ్వర్యంలో బాపట్ల జిల్లా ఇంకొల్లులో డ్రోన్ శిక్షణా కేంద్రం ఏర్పాటు చేయడాకి అనుమతి లభించినట్లు మారుతీ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ కారుమూడి శ్రీనివాసరావు తెలిపారు. ఇంకొల్లు మారుతీ ఐటీఐ, డ్రోన్ లాబ్ టెక్నాలజీస్ ప్రై లిమిటెడ్, అహ్మదాబాద్ వారు సంయుక్తంగా ఈ శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఈ శిక్షణా కేంద్రంలో డ్రోన్ ఆపరేట్ చేయడం, నిర్వాహణ గురించి శిక్షణ ఇచ్చి పరీక్ష అనంతరం కేంద్ర పౌర విమానయాన శాఖ వారు రిక్రూట్ పైలెట్ లైసెన్సును మంజూరు చేస్తారని శ్రీనివాసరావు తెలిపారు. రైతులు, సివిల్ ఇంజనీర్లు, మైనింగు ఇంజనీర్లు, డ్రోన్ ద్వారా ఉపాధి పొందాలనుకొనే యువత డ్రోన్ ఆపరేట్ చేయడానికి ఈ శిక్షణకు అందిపుచ్చుకోవాలన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులకు గ్రామీణ ప్రాంతంలో అధునాతన టెక్నాలజీని అందిపుచ్చుకోవడానికి ఈ శిక్షణా కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పటికే రాష్ట్రంలో ఇటువంటివి 3 శిక్షణా కేంద్రాలు ఉన్నాయని 4వ కేంద్రం ఇంకొల్లులో ఏర్పాటు చేసుకునేందుకు అనుమతులు పొందినట్లు తెలిపారు. ఈ శిక్షణా కేంద్రాన్ని ఈ నెల 29న పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రారంభించనున్నట్లు తెలిపారు.

క్రీడలతో రెవెన్యూ ఉద్యోగులకు ఆటవిడుపు

రెవెన్యూ క్రీడా కరపత్రాలు ఆవిష్కరించిన ఆర్డీవో

చీరాల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : నిత్యం ప్రజాసేవలో ఉండే రెవెన్యూ ఉద్యోగులకు ఆటలు మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయని ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు పేర్కొన్నారు. రెవెన్యూ ఉద్యోగులకు అక్టోబరు 10, 11 తేదీలలో జిల్లా రెవెన్యూ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడలు నిర్వహిస్తున్నారు. అందుకు సంబంధించిన కరపత్రాలను మంగళవారం తహసీల్దార్ గోపీకృష్ణతో కలిసి ఆర్డీవో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు క్రీడలు, సాంస్కృతిక ఉత్సవాల్లో ఉత్సాహంగా పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సీహెచ్ సురేష్, డివిజన్ కార్యదర్శి పి.సురేష్, క్రీడల కార్యదర్శి అర్జున్, సత్యనారాయణ, శ్రీనివాసులు, ఆదినారాయణ, తేజ, రమేష్, నారాయణమ్మ, కృష్ణవేణి, వీఆర్వోలు, వీఆర్ఏ లు పాల్గొన్నారు.

ఆర్‌డీవోను కలిసిన తహసీల్దార్

వేటపాలెం(చీరాల) : చీరాల ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడును వేటపాలెం తహసీల్దార్ గీతారాణి మర్యాదపూర్వకంగా కలిశారు. సివిల్ సప్లయి డీటీగా పనిచేసిన ఆమె ఉద్యోగోన్నతిలో భాగంగా ఉన్నతాధికారులు వేటపాలెం తహసీల్దార్‌గా నియమించారు. ఈక్రమంలో మంగళవారం బాధ్యతలు చేపట్టిన ఆమె ఆర్డీవోను కలిశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో పారదర్శకతతో పనిచేయాలని ఆర్డీవో సూచించారు.



క్రీడాకరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

రోటరీ క్లబ్ నూతన సభ్యులతో ప్రమాణ స్వీకారం

ఇంకొల్లు,సెప్టెంబరు 23,(ఆంధ్రజ్యోతి) : స్థానిక రోటరీ గంగలో ఇంకొల్లు రోటరీ క్లబ్‌లో నూతనంగా చేరిన సభ్యులతో మంగళవారం రాత్రి రోటరీ అసిస్టెంట్ గవర్నర్ నాగభైరు శ్రీనివాసరావు ప్రమాణస్వీకారం చేయించారు. ముందుగా ఇటీవల మృతి చెందిన రొటేరియన్, మాజీ ఎంపీపీ మద్దినేని హనుమంతరావు చిత్రపటానికి పూలమాలతో నివాళ్లులర్పించారు. అనంతరం రోటరీక్లబ్ అధ్యక్షులు బలగం కోటేశ్వరరావు అధ్యక్షతన నూతనంగా క్లబ్‌లో చేరిన డాక్టర్ పుసులూరి మురళీకృష్ణ, జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలకృష్ణ, పెరికాల నాగరాజులతో ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి అలవల రాఘవరెడ్డి, ట్రెజరర్ గోరంట్ల నాగేశ్వరావు, సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు అంచులో బోల్తాపడ్డ గ్యాస్ ట్యాంకర్

భారీ ఎక్స్‌కవేటర్‌తో నామ్ రోడ్డు పైకి చేర్చిన వైనం

అద్దంకి,సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి): రోడ్డుఅంచులో గ్యాస్ ట్యాంకర్ బోల్తాపడిన ఘటన అద్దంకి సాధునగర్ సమీపంలో నామ్‌రోడ్డు వెంబడి శ్రీనివాసనగర్ వద్ద చోటుచేసుకొంది. చెన్నై నుంచి హైదరాబాద్ వైపు వెళుతుండగా ప్రమాదం చోటుచేసు కొంది. దీన్ని ప్రత్యేకంగా తెప్పించిన భారీ ఎక్స్‌కవేటర్ సహాయంతో మంగళవారం సాయంత్రానికి రోడ్డుపైకి తీసుకొచ్చారు. మండే స్వభావం ఉన్న గ్యాస్ ట్యాంకర్ కావడంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.



బోల్తా పడ్డ గ్యాస్ ట్యాంకర్‌ను లేపుతున్న ఎక్స్‌కవేటర్

హెచ్‌ఐవీని నిర్మూలిద్దాం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కమిషనర్ రవీంద్ర

అద్దంకిటౌన్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): హెచ్‌ఐవీ, ఎయిడ్స్ వ్యాధిగ్రస్థులు లేని సమాజాన్ని, మాదకద్రవ్యాలు లేని సమాజాన్ని రూపొందించడంలో గ్రామస్థాయి నుంచి అందరూ కలిసిరావాలని, మున్సిపల్ కమిషనర్ రవీంద్ర అన్నారు. మంగళవారం అద్దంకి మున్సిపల్ కార్యాలయం వద్ద, మండలంలోని బొమ్మనంపాడు గ్రామంలో హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. సంబంధిత పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ వాహిల చౌదరి, డాక్టర్ గొట్టిపాటి జయసింహ, సర్పంచ్ పద్మావతి, సీహెచ్‌వో పద్మజ, ప్రోగ్రాం మేనేజర్ దుర్గా, సురేంద్ర, దుర్గా భవాని, పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో అభ్యంతరకర పోస్టులు

● నిందితుడికి పోలీసుల నోటీసులు

అద్దంకి,సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి): సోషల్‌మీడియాలో సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌లతో పాటు బీఆర్.నాయుడిపై వ్యంగ్యంగా పోస్టులు పెట్టిన ఘటనపై గతంలో అద్దంకిలో కేసు నమోదైంది. ఈ నేపథ్యంలో పోస్టులు పెట్టిన తాటికొండ మండలం కంతేరుకు చెందిన కల్లం హరికృష్ణారెడ్డికి మంగళవారం 41 నోటీసు అందజేసినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు. ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులతో పాటు ఎవరిపైనైనా సోషల్ మీడియా లో వ్యంగంగా పోస్టులు పెడితే కేసులు నమోదు చేస్తామని సీఐ సుబ్బరాజు తెలిపారు. సోషల్ మీడియాలో పెట్టే పోస్టులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

మొక్కుతీర్చుకొని వస్తుండగా ప్రమాదం

● లారీ - ఆటో ఢీకొని తొమ్మిది మందికి గాయాలు

బల్లికురవ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): చేపపిల్లలతో వస్తున్న లారీ, ట్రాలీ ఆటో ఢీ కొని 9 మందికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు అద్దంకి మండలం చినకొత్తపల్లికి చెందిన ఓ కుటుంబం పల్నాడు జిల్లా అడిగొప్పులలో మొక్కుతీర్చు కొనేందుకు ఆటోలో బంధువులతో కలిసి వెళ్లారు. తిరిగి వచ్చే సమయంలో బల్లికురవ మండలం వి.కొప్పెరపాడు చెరువు వద్ద మంగళవారం సాయంత్రం ముందు చేపపిల్లలతో వెళ్తున్న లారీ, వెనుక ప్రయాణికులతో వస్తున్న ట్రాలీ ఆటో ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో చింతంరెడ్డి జయరామిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, ప్రభాకరరెడ్డి, అంజిరెడ్డి, పేరమ్మ, మాగంటి రామాంజనేయులు, మిరియాల సీతారామయ్యలతో పాటు ఆటోడ్రైవర్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రులను నర్సరావుపేట వైద్యశాలకు తరలించారు.



ప్రమదానికి గురైన వాహనం

టీడీపీ అనుబంధ సంఘాల ఏర్పాటుపై అభిప్రాయ సేకరణ

అద్దంకి, సెప్టెంబరు23 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అద్దంకి మండల శాఖ, అనుబంధ సంఘాల నియామకానికి సంబంధించి మండల నేతలు మంగళవారం స్థానిక కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మండల కమిటీ, అనుబంధ సంఘాలలో ఉత్సాహంగా పనిచేసే నాయకుల పేర్లను ఆయా గ్రామాల నేతల నుంచి సేకరించారు. సమావేశంలో టీడీపీ మండల నేతలు నాగినేని రామకృష్ణ, కరి పరమేష్, మానం మురళీ మోహన్‌దాస్, పెంట్యాల రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు సహకరించండి

మార్టూరు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి) మండలంలోని డేగరమూడి గ్రామంలో డాక్టరు బీఆర్ అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు సహకరించాలని మంగళవారం దళిత సంఘాల నాయకులు సీఐ ఎం.శేషగిరిరావు, ఎంపీడీవో రాంబాబులకు వినతిపత్రం అందజేశారు. దీంతో వారికి సహకరిస్తామని సీఐ శేషగిరిరావు దళిత నాయకులకు తెలిపారు. అధికారులకు వినతిపత్రం అందచేసిన వారిలో దళిత నాయకులు జెట్టి ఖాజావలి, సుబ్బారావు, బి బెంజిమెన్, సాతులూరి ఉదయభాస్కర్, రోశయ్య, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ



కార్మికులకు దుస్తులను అందజేస్తున్న రోటరీ సభ్యులు

మార్టూరు, సెప్టెంబరు23 (ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి స్థానిక ఎఫర్ట్ కార్యాలయంలో రోటరీ మాజీ అధ్యక్షులు తాళ్లూరి సాంబశివరావు తన మనుమరాలు ఇషిర జన్మదినం సందర్భంగా పారిశుధ్య కార్మికులకు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. మండలంలోని 10 గ్రామాలకు చెందిన 45 మంది పారిశుధ్య కార్మికులకు సాంబశివరావు నూతన దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధ్యక్షులు మాదాల సాంబశివరావు, ఇంటూరి ఆంజనేయులు, తాటి నాగేశ్వరరావు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

'సోమశిల'కు తగ్గిన వరద



అనంతసాగరం సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల నుంచి సోమశిల జలాశయానికి వరద ప్రవాహం తగ్గుముఖం పట్టింది. సోమవారం 35,847 క్యూసెక్కులు వస్తుండగా మంగళవారం28,611 క్యూసెక్కులుగా నమోదైంది. డ్యాంలో 72.250 టీఎంసీలు నిల్వ ఉంది. ఇక మూడు గేట్ల ద్వారా 15,000, పవర్ టెన్నల్ ద్వారా 2,600, ఉత్తర కాలువకు 400, కండలేరుకు వరద కాలువ ద్వారా 10,450 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

'విజయ'లో డైరెక్టర్ స్థానాలు ఏకగ్రీవం

ఇద్దరు నామినేషన్ల ఉపసంహరణ

నెల్లూరు(వెంకటేశ్వరపురం), సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు జిల్లా పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సమితి(విజయ డెయిరీ)లో ఖాళీ అయిన మూడు డైరెక్టర్ స్థానాలకు ముగ్గురు అభ్యర్థులు ఏకగ్రీవం అయినట్లు ఎన్నికల అధికారి హరిబాబు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మూడు స్థానాల్లో రెండు మహిళా రిజర్వు స్థానాలు కావడంతో నామినేషన్లు దాఖలు చేసిన కొడవలూరు మండలం రేగడిచెలిక పాల సొసైటీ అధ్యక్షురాలు గుర్రం నాగేశ్వరమ్మ, బాలాయపల్లి మండలం వెంగమాంబాపురం సొసైటీ అధ్యక్షురాలు సూదలగుంట సాయినిరోషా ఏకగ్రీవం అయ్యారు. మిగిలిన జనరల్ పురుష స్థానానికి ముగ్గురు నామినేషన్ వేయగా వారిలో సంతదాసుపల్లి సొసైటీ సభ్యుడు ఇనుకుర్తి మల్లికార్జున నాయుడు, మైపాడు సొసైటీ సభ్యుడు కాకుటూరు చంద్రశేఖర్‌డ్డి మంగళవారం నామినేషన్ ఉపసంహరించుకున్నారు. దీంతో మిగిలిన అల్లూరు మండలం బీరంగుంట పాల సొసైటీ అధ్యక్షుడు పొంకం హరిబాబు ఏకగ్రీవం అయ్యారు. గెలుపొందిన ముగ్గురు డైరెక్టర్ల పదవీకాలం ఐదేళ్లని ఎన్నికల అధికారులు హరిబాబు,శివయ్య తెలిపారు.

అయిగిరి నందిని...

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు జిల్లాలోని ఆలయాల్లో వైభవంగా జరుగుతున్నాయి. అమ్మవార్లు వివిధ అవతారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. విశేష అభిషేకాలు, పూజలు, హోమాలు జరిగాయి. ప్రధాన ఆలయాలకు భక్తులు పోటెత్తారు.



రాపూరు : పెంచలకోన క్షేత్రంలో ఆదిలక్ష్మి అవతారంలో అమ్మవారు



నెల్లూరులోని మూలస్థానేశ్వర స్వామి ఆలయంలో నృత్యం చేస్తున్న విద్యార్థిని

వివరాలు 6లో

ప్రపంచ శాస్త్రవేత్తల జాబితాలో వీఎస్‌యూ వీసీకి చోటు

- వివరాలు 6లో..

రాపూరులో పొత్తపి చోళుల శిలాశాసనం

- వివరాలు 6లో..

విద్యుత్ శాఖ.. బంపర్ ఆఫర్!

- అదనపు లోడ్ క్రమబద్ధీకరణకు 50 శాతం రాయితీ
- డిసెంబరు ఆఖరు వరకు గడువు



ఉదయగిరి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : గృహ వినియోగదారులకు విద్యుత్ శాఖ బంపర్ ఆఫర్ ఇచ్చింది. అదనపు లోడ్ క్రమబద్ధీకరణకు 50 శాతం రాయితీ ఇవ్వడంతోపాటు డిసెంబరు నెలాఖరు వరకు గడువు ఇచ్చింది. గృహాలకు విద్యుత్ కనెక్షన్ తీసుకునే సమయంలో లైట్లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువుల వినియోగాన్ని అంచనా వేసి లోడును కిలోవాట్లలో లెక్కించి సెక్యూరిటీ డిపాజిట్, డెవలప్‌మెంట్ చార్జీలు వసూలు చేస్తారు. జిల్లాలో సుమారు 8,99,151 గృహ విద్యుత్ కనెక్షన్లు ఉండగా, దాదాపు అన్నీ దశాబ్దాల క్రితం నాటివే. వాడే బల్బులు, ఫ్యాన్ల లెక్క ఆధారంగా వీటిని ఇచ్చారు. తరువాత ఎలక్ట్రానిక్ వస్తువుల వినియోగం బాగా పెరిగింది. అప్పట్లో విద్యుత్ వాడకం 0.5 కిలోవాట్ ఉంటే ఇప్పుడు అదే సర్వీసుపై 2 నుంచి 3 కిలోవాట్‌లు ఉంది. నిర్దేశిత మొత్తం చెల్లించి ఈ అదనపు లోడును క్రమబద్ధీకరించుకోవాల్సి ఉన్నా చాలా మంది చేసుకోలేదు. అధిక విద్యుత్ వాడుతున్నా తక్కువ సామర్థ్యానికే అనుమతి తీసుకుంటున్నారు. సాధారణ రోజుల్లో ఇబ్బంది లేకున్నా వేసవిలో వినియోగం పెరిగి ఆ భారం ట్రాన్స్‌ఫార్మర్లపై పడుతోంది. దీంతో తరచూ విద్యుత్ సమస్యలు తలెత్తుతాయి. ఇలాంటి పరిస్థితుల్లో సిబ్బంది తనిఖీల సమయంలో గుర్తిస్తే జరిమానా విధించి రూ.వేలల్లో అదనపు లోడు రుసుము వసూలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వినియోగదారులే స్వచ్ఛందంగా ముందుకొస్తే క్రమబద్ధీకరణ రుసుంలో 50 శాతం రాయితీ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది.

రాయితీ ఇలా.. (రూ.లలో)

కిలోవాట్	అసలు	రాయితీ
1	2,250	1,250
2	4,450	2,450
3	6,650	3,650
4	8,850	4,850
5	11,050	6,050

ఏపీఎఫ్‌డీసీ ఆర్‌ఎంగా వివేక్

నెల్లూరు(వెంకటేశ్వరపురం) సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు జిల్లా ఏపీఎఫ్‌డీసీ (ఆంధ్రప్రదేశ్ ఫారెస్ట్ డవలప్‌మెంట్ కార్పొరేషన్) రీజనల్ మేనేజర్(ఆర్‌ఎం)గా ఐఎఫ్‌ఎస్ అధికారి వివేక్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. తిరుపతి డీఎఫ్‌వోగా ఉన్న ఆయనను నెల్లూరు ఆర్‌ఎంగా ఇటీవల ప్రభుత్వం బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బాధ్యతలు చేపట్టిన ఆయన కార్యాలయ ఉద్యోగులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ప్లాంటేషన్‌పై ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో నెల్లూరు డీఎం శారద, అధికారులు పాల్గొన్నారు.

ఎక్కడో ప్రాజెక్టు.. కావలిలో లోతట్టు!

- వరికుంటపాడు ప్రాంతంలో 'నక్కలగండి' జలాశయం
- లోతట్టు ప్రాంతంగా వెంగళరావు నగర్
- రెవెన్యూ రికార్డుల్లో తప్పుగా నమోదు
- సరిచేయాలని అధికారుల చుట్టూ ప్రజల అవస్థలు
- కలెక్టరేట్‌లో ఫైల్ ఉందంటున్న వైనం..(ఇక్కడ ఫైల్ అదృశ్యం
- దిక్కుతోచని స్థితిలో బాధితులు

కావలిలో భారీ భవంతులతో ఉన్న వెంగళరావు నగర్ ప్రాంతాన్ని రెవెన్యూ రికార్డులలో నక్కలగండి లోతట్టు ప్రాంతంగా రెవెన్యూ అధికారులు రికార్డుల్లో చూపారు. ఎక్కడో వరికుంటపాడు- పాములు మధ్యలో ఉన్న నక్కలగండి ప్రాజెక్ట్ లోతట్టు ప్రాంతం (సుమారు 100 కి.మీ దూరం) కావలిలో ఉందంటూ రికార్డులలో ఎలా నమోదు చేశారో అధికారులకే తెలియాలి. ఒకవేళ తప్పుగా నమోదు చేసినప్పుడు దానిని వెంటనే సరిదిద్దాల్సిన బాధ్యత వారిపైనే ఉంది. కానీ రికార్డులు సరిచేయమని కాలనీవాసులు కాళ్లరిగేలా తిరుగుతన్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు.

వెంగళరావునగర్‌లో 2098 సర్వే నంబరులో 27 ఎకరాలకుపైన ఉండగా అందులో ఒక్క సెంటును మినహాయించి మిగిలిన భిన్నం మొత్తాన్ని 22 ఏ నుంచి తొలగించారు. అయితే ఆ ఒక్క సెంట్ మొత్తం భిన్నంలో ఉందని 27 ఎకరాలలో రిజిస్ట్రేషన్లు ఆపేశారు. దీంతో పిల్లల చదువులు, వివాహాలు తదితర అవసరాలకు ఆస్తులు అమ్ముకోవాలన్నా, బ్యాంకులో తనఖా పెట్టి రుణాలు తెచ్చుకోవాలన్నా ఇళ్ల యజమానులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయితే రెవెన్యూ అధికారులు మాత్రం 2098 సర్వే నెంబరులో రోడ్లు, ఓపెన్ స్థలాలు కూడా ఉన్నందున ఆ భిన్నం మొత్తాన్ని సరిచేయాలని ఉన్నతాధికారులకు ఫైళ్లు పంపినట్లు చెబుతున్నారు. అయితే కలెక్టరేట్‌లో ఆ ఫైలు లేదని అక్కడి అధికారులు చెబుతుండటం ప్రజలను అయోమయానికి గురి చేస్తోంది.



కావలి పట్టణంలోని వెంగళరావునగర్ వ్యూ

కావలి పట్టణంలో 2048/బీ సర్వే నెంబరులో ఉన్న 300 ఎకరాల అటవీ భూమిని 1970 సంవత్సరంలో నివేశన స్థలాల కోసం గుర్తించి దానిని డీఫారెస్ట్ చేశారు. 1972లో వెంగళరావునగర్‌లో ఒక ప్రాం తంగా తుఫాన్‌నగర్‌ను గుర్తించి 110 ప్లాట్లకు పట్టాలు ఇచ్చారు. తిరిగి 1977లో వెంగళరావునగర్‌లో మార్కెట్ విలువ కింద అంకణం రూ.7 చొప్పున విశ్వోదయ హౌస్ బిల్డింగ్ సొసైటీకి, కృష్ణసింగ్ ఎన్‌జీవోస్‌కు పట్టాలు ఇచ్చారు. మిగిలిన ప్లాట్లకు 1987 వరకు పట్టాలు ఇస్తూ వచ్చారు. అయితే మార్కెట్ రేట్ ప్రకారం విక్రయించిన ప్లాట్లకు 2017, అక్టోబరు వరకు రిజిస్ట్రేషన్లు చేశారు. ఆ తర్వాత భూమి స్వభావంలో అడవి, నక్కలగండి లోతట్టు ప్రాంతంగా ఉందని పేర్కొంటూ వెంగళరావునగర్‌లో మొత్తం రిజిస్ట్రేషన్లు ఆపేశారు. ఆ తర్వాత స్థానికులు చేసిన పోరాటం ఫలితంగా 2048/బీ సర్వే నంబరును సబ్‌డివిజన్లు చేసి 2023, సెప్టెంబరులో 157.43 ఎకరాలను 22ఏ నుంచి తొలగించి రిజిస్ట్రేషన్లకు అవకాశం ఇచ్చారు. వాటిలో 20 ఏళ్ల దాటిన అసైన్ ప్లాట్లకు కూడా రిజిస్ట్రేషన్ అవకాశం కలిగింది. ఇంతవరకు బాగానే ఉంది. మిగిలిన దానిలో ప్రభుత్వ స్థలాలు, ప్రభుత్వ కార్యాలయాలకు కేటాయించిన ప్లాట్లు పోను 79 ఎకరాలలో ప్రజలు ఇళ్లు నిర్మించుకున్నారు. అయితే, ఆ 79 ఎకరాలలో ప్లాట్ల రిజిస్ట్రేషన్లు ఆగాయి. వాటిలో 2098, 2096 సర్వే నెంబర్లు రెవెన్యూ రికార్డులలో అనుభవ స్వభావం నక్కలగండి లోతట్టు ప్రాంతమని చూపిస్తుండగా, 2086/1 అనుభవ స్వభా వం అడవి అని చూపిస్తోంది. నివాసలు ఉంటున్నా ఇంకా అధికారులు రికార్డులలో నక్కలగండి లోతట్టు ప్రాంతం, అడవి అని ఎలా చూపిస్తారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. 22ఏ నుంచి వాటిని తొలగించాలని అధికారులకు మొరపెట్టుకున్నా ఆ ఫైల్ నేటికి ఓ కొలిక్కి రాక పోవటంతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు.

- నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)

కలెక్టరేట్‌కు ఫైలు పంపాం

వెంగళరావునగర్‌లో 22ఏలో ఉన్న ప్లాట్లను తొలగించమని కలెక్టరేట్‌కు ఫైల్ పంపాము. అయితే, 2098 సర్వే నెంబరులో ఒక్క సెంటు మినహా మిగతాది 22ఏ నుంచి తొలగించినట్లు రావటంతో దానిని మరలా వెరిఫికేషన్ చేసి అందులో ఉన్న ప్రైవేట్ ప్లాట్లనే తొలగించమని ఫైలు పంపాము. రెవెన్యూ రికార్డులు కంప్యూటీకరణ చేసేటప్పుడు రెండు నెంబర్లు నక్కలగండి లోతట్టు ప్రాంతమని గతంలో నమోదు చేశారని కానీ 22ఏ నుంచి తొలగించేందుకు అది ఆటంకం కాదు.

- పీ.శ్రాణ్‌కుమార్, తహసీల్దార్, కావలి

ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తు గడువు పొడిగింపు

6లో

దిగొచ్చిన మందులు

- భారీగా తగ్గిన ఔషధాల ధరలు
- ప్రాణాంతక మందులపై జీఎస్టీ ఎత్తివేత
- అందుబాటులో బీపీ, షుగర్ పరికరాలు
- వెంటనే అమలు చేయాలన్న ఔషధ నియంత్రణ శాఖ
- ఎక్కడైనా తగ్గింపు రేట్లకు అమ్మకపోతే చర్యలు

నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : వస్తు సేవల పన్ను (జీఎస్టీ) ఎత్తి వేయటంతో ఔషధాల ధరలు భారీ తగ్గాయి. క్యాన్సర్, గుండె, లివర్‌తో సహా మానవ అవయవాల మార్పిడి, ఇతర ప్రాణాంతక వ్యాధులపై అవసరమైన 36 ఔషధాలపై జీఎస్టీ ఎత్తి వేయటంతో ధరలు తగ్గుముఖం పట్టాయి. కుటుంబ నియంత్రణకు ఉపయోగపడే గర్భనిరోధక మందులు, క్రిటికల్ కేర్‌కు ఉపయోగించే ఔషధాలు, శానిటరీ నాప్కిన్‌లు వంటి వాటిపై జీఎస్టీ ఎత్తివేశారు. అలాగే కొన్ని రకాల వ్యాధి నిరోధక టీకాలు, హెపటైటిస్ వ్యాధిని గుర్తించే వ్యాధి నిర్ధారణ కిట్‌లు, ఆర్థోపెడిక్ ఉపకరణాలు, వీల్ చైర్లు, ట్రైసైకిళ్లు, దివ్యాంగుల కోసం వినియోగించే పరికరాలు, గుండె వ్యాధుల్లో వినియోగించే స్టంట్‌లు, శిశువుల పాల ఉత్పత్తులతో పాటు బీపీ, షుగర్ పరికరాలు కొన్ని ఔషధాలపై గతంలో 12 శాతం ఉన్న పన్ను రేటు ఇప్పుడు 5 శాతానికి తగ్గించారు. తగ్గిన ధరలు ఈనెల 22 నుంచి అమలులోకి వచ్చాయి.



ప్రతిరోజూ రూ.2 కోట్ల అమ్మకాలు

జిల్లా వ్యాప్తంగా 2500 ఔషధ దుకాణాలు ఉన్నాయి. ఇందులో హోల్‌సేల్ దుకాణాలు 400 వరకు ఉన్నాయి. ఒక్క నెల్లూరు నగరంలోనే 800 ఔషధ దుకాణాలు ఉన్నాయి. ఇందులో 50కి పైగా కార్పొరేట్ ఆసుపత్రులకు సంబంధించి ఉన్న ఔషధ దుకాణాల్లో ప్రతిరోజూ రూ. 10 లక్షల వరకు అమ్మకాలు జరుగుతుంటాయి. ఇక జిల్లా వ్యాప్తంగా ఉన్న దుకాణాలతో కలిపి మొత్తం ప్రతి రోజూ రూ. 2 కోట్ల ఔషధాల రూపేణా వ్యాపారం జరుగుతుంటాయి. మొత్తం మీద జీఎస్టీ ఎత్తివేయటంతో ఔషధాల ధరలు రోగులకు మరింత అందుబాటులోకి వచ్చాయి.

పాతరేటుకు అమ్మితే చర్యలు

జిల్లాలో తగ్గిన ఔషధాల ధరలు ప్రకారం తప్పక అమ్మాలని, ఎవరైనా ఇందుకు విరుద్ధంగా పాత రేటుకే అమ్మితే చర్యలు తీసుకుంటామని ఔషధ నియంత్రణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు.

తగ్గిన ధరలు ఇలా.. (రూ.లలో)

మందులు	పాత	కొత్త
టిష్యూ ప్లాస్మినోజన్ ఏక్టివేటర్ 18 ఎంజీ (రక్తం గడ్డకట్టకుండా ఉండేందుకు)	47,510	44,540
టెస్టుజ్యూమాబ్ 150 ఎంజీ (క్యాన్సర్ వ్యాధికి ఉపయోగించే మందు)	42,871	40,191
ఆదలిమ్‌యుమాబ్ 40 ఎంజీ (వెన్నుముఖ, పేగుల్లో నొప్పికి)	26,620	25,956
టెనిక్టిపల్స్ 50 ఎంజీ వయల్స్ (గుండె వ్యాధుల నివారణకు)	63,355	59,395
డినోషుమాబ్ 120 ఎంజీ వయల్ (ఎముకల బలహీనతకు)	41,726	39,118
గోలిముమాబ్ 100 ఎంజీ (టీబీ, ఫంగస్ ఇన్‌ఫెక్షన్)	54,700	51,281
రిలైసీయల్ కిట్ ఇంజక్షన్ (రక్తస్రావం అరికట్టేందుకు)	11,273	10.568

ఔషధ దుకాణాల తనిఖీ

ఔషధ దుకాణాల్లో తగ్గిన ధరల ప్రకారం అమ్మకాలు జరపాలి. అలా జరపని వారిపై చర్యలు తీసుకుంటాం. ప్రతి రోజూ ఆయా ఔషధ దుకాణాలకు పర్యవేక్షిస్తాం. ప్రత్యేకించి కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఉన్న ఔషధ దుకాణాలపై ప్రత్యేక దృష్టి పెట్టి తనిఖీలు చేస్తాం.

- రమేష్‌రెడ్డి, ఔషధ నియంత్రణ శాఖ ఏడీ

వ్యాపారులను హెచ్చరించాం

జీఎస్టీ కొత్త నిబంధనల ప్రకారం ఔషధాలు అమ్మాలని వ్యాపారులను తెలియచేశాం. జీఎస్టీ ఎత్తి వేసిన మందులకు అనుగుణంగా అమ్మకాలు చేయాల్సి ఉంది.

- పేరూరి ప్రదీప్, జిల్లా కెమిస్ట్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ నాయకులు

మెగా డీఎస్సీ అభ్యర్థులు నేడు గొలగమూడికి రండి!

నెల్లూరు (విద్య్బఆంధ్రజ్యోతి) : జిల్లాలో మెగా డీఎస్సీ-2025కి ఎంపికైన అభ్యర్థులకు ఈ నెల 25వ తేదీన అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా నియామక పత్రాలు అందచేస్తున్నట్లు డీఈఓ బాలాజీరావు ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి హాజరయ్యేందుకు అభ్యర్థులంతా 24న సాయంత్రం 4 గంటలకు వెంకటాచలం మండలం గొలగమూడి వెంకయ్యస్వామి ఆశ్రమం వద్ద హాజరు కావాలని పేర్కొన్నారు. ప్రతి అభ్యర్థి ఆధార్, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, కాల్ లెటర్, డీఎస్సీ హాల్‌టికెట్‌తోపాటు వ్యక్తిగత అవసరాలకు ఉపయోగించే వస్తువులతో హాజరు కావాలని తెలిపారు. 25న ఉదయం 6 గంటలకు విజయవాడకు బస్సు బయలుదేరుతుందని వెల్లడించారు.

హాస్టల్ విద్యార్థులకు ప్రాధాన్యమివ్వాలి

- వసతి గృహ సౌకర్యాల సమీక్షలో కలెక్టర్ శుక్లా

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రభుత్వ వసతి గృహాల్లోని విద్యార్థుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో వివిధ శాఖల సంక్షేమ వసతి గృహాల్లో సౌకర్యాలపై సమీక్ష జరిపారు. హాస్టల్ విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం, మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించాలని సూచించారు. క్రమం తప్పకుండా కంటి, దంత వైద్య పరీక్షలు చేయించాలని ఆదేశించారు. గిరిజనులకు ఆధార్ కార్డులు, రేషన్ కార్డులు ఇప్పించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో ఐటీడీఏ పీవో మల్లికార్జునరెడ్డి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖల అధికారులు శోభారాణి, ప్రభావతి, వెంకటలక్ష్మి, ఫైపా, మహ్మద్ ఆయూబ్ తదితరులు పాల్గొన్నారు.

ఆ రెండు లారీల్లో 90 టన్నుల రేషన్ బియ్యం

రూ.41.40 లక్షల సొత్తు స్వాధీనం

6ఏ తోపాటు ఇతర కేసుల నమోదుకు సిద్ధం

నెల్లూరురూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులో పట్టుబడిన ఐదు లారీల బియ్యం వ్యవహారం హాట్ టాపిక్‌గా మారింది. ఇవన్నీ రేషన్ బియ్యమంటూ అనుమానించిన పౌరసరఫరాల శాఖ వాటిల్లో నుంచి నమూనాలను సేకరించింది. వాటిని పరీక్షించగా అందులో రెండు లారీల్లోని బియ్యం రేషన్ సరుకుగా, మిగిలిన 3 లారీల్లోని బియ్యం సాధారణమైనవిగా తేల్చుతూ సోమవారం రాత్రి ఫలితాలు వచ్చాయి. దీంతో మంగళవారం ఉదయం పౌరసరఫరాల శాఖ అధికారులు రేషన్ బియ్యం ఉన్న రెండు లారీలను స్వాధీనం చేసుకున్నారు. నెల్లూరురూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో ఈ లారీలను ఉంచడంతో అక్కడకు వెళ్లిన ఏఎస్‌వో అంకయ్య, రూరల్ సీఎస్‌డీటీ జమీర్‌బాషాలు రెవెన్యూ అధికారుల సమక్షంలో స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 90 టన్నుల రేషన్ బియ్యం ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. వాటి విలువ రూ.41.40 లక్షలు వరకు ఉంటుందని లెక్కగట్టారు. సరుకు సరఫరాకు పాల్పడిన వ్యక్తులపై 6ఏతో పాటు మరిన్ని సెక్షన్ల కింద కేసు నమోదుకు పోలీసులకు సిఫార్సు చేయనున్నారు. జిల్లాలోని ఏ ఏ నియోజకవర్గాలలో ఈ రేషన్ బియ్యం సేకరించారన్నది లోతుగా దర్యాప్తుచేస్తున్న అధికారులు వీటిని నగర శివారు ప్రాంతంలో ఎందుకు ఉంచారన్నది ఆరా తీస్తున్నారు. ఈ లారీలు అనంతసాగరానికి చెందిన వ్యక్తివిగా అధికారులు అనుమానిస్తుండగా రేషన్ బియ్యం రాకెట్ వారి పాత్రపై దర్యాప్తు సాగుతుంది.



స్వాధీనం చేసుకున్న లారీలతో ఏఎస్‌వో, సీఎస్‌డీటీలు

సాధారణ బియ్యంపైనా విచారణ

కాగ మిగిలిన మూడు లారీల్లోని సాధారణ బియ్యంపైనా పౌరసరఫరాల శాఖ అధికారులు విచారణ మొదలుపెట్టారు. లోడైన బియ్యానికి లెక్కలున్నాయా? ఉంటే వాటి రశీదులెక్కడ? ఎవరి దగ్గర కొనుగోలు చేశారు? ఎక్కడికి పంపుతున్నారు? అన్న కోణంలో విచారిస్తున్న అధికారులు నివేదిక తయారు చేసి జాయింట్ కలెక్టర్‌కు అందచేయనున్నారు. తదుపరి ఆయన ఉత్తర్వుల మేరకు తుది నిర్ణయం తీసుకుంటామని పౌరసరఫరాల శాఖ అధికారులు వెల్లడించారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	128
స్కిన్ చికెన్	230
స్కిన్‌లెస్	256

కోడిగుడ్ల ధర (100): 560

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.10,794
వెండి కిలో ధర	రూ. 1,38,400
వెండి ఒక గ్రాము	రూ.141.40

కావలిలో ప్రత్యేక ఆధార్ క్యాంపులు

కావలి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న బయోమెట్రిక్ అప్‌డేట్స్ పూర్తి చేసేందుకు కావలి పట్టణంలోని 4 సచివాలయాలలో ఈనెల 23 నుంచి 26 వరకు ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు కావలి మున్సిపల్ కమిషనర్ జీ.శ్రావణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని బొమ్మారెడ్డివారి వీధి, వైకుంఠపురం, వెంగళరావునగర్, కలుగోళమ్మపేట సచివాలయాలలో ఏర్పాటు చేసిన ఈ ఆధార్ క్యాంపులను పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

న్యూస్ బాక్స్

కుళ్లిన కోడి గుడ్లపై విచారణ

వలేటివారిపాలెం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలినేనిచెరువు అం గన్‌వాడీ కేంద్రలో కుళ్లిన గుడ్లు అని ఆంధ్రజ్యోతిలో మంగళవారం ప్రచురితమైన కథనానికి ఐసీడీఎస్ సీడీపీఓ ఉషారాణి ఆదేశాల మేరకు సూపర్‌వైజర్ సునీత తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలోని గుడ్లతో పాటు పిల్లలను, రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం గరుకుపాలెం, చుండి మాలకొండ గ్రామాల్లో ని అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె తనిఖీ చేసి గుడ్లను తూకం వేశారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ సునీత మాట్లాడుతూ చిన్నసైజు గుడ్లు, కుళ్లిన గుడ్లపై ఉన్నతాధికారుల ద్వారా కాంట్రాక్టర్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ఆమె తెలిపారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రోడ్డు ఆక్రమించి గోడ నిర్మించారని ఫిర్యాదు

కావలిరూరల్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజువారి చింతలపాలెంలో రోడ్డు ను ఆక్రమించి మసీదు గోడ నిర్మాణం చేపడుతున్నారని మంగళవారం తహసీల్దారు శ్రావణ్‌కుమార్‌కు రైతులు ఫిర్యాదు చేశారు. గ్రామంలోని సుమారు 200 ఎకరాల మాగాణి భూములకు, చెరువుకు వెళ్లే దారిని ఆక్రమించి మసీదు గోడ నిర్మాణం చేపడుతున్నారని, దారి వదులి కట్టుకోవాలని సూచించినా అందుకు నిరాకరిస్తున్నారన్నారు. అక్రమంగా కడుతున్న గోడ నిర్మాణాన్ని అడ్డుకుని న్యాయం చెయ్యాలని స్థానిక రైతులు ప్రసాద్, మల్లికార్జున, హరి, మాలకొండయ్య తదితరులు వినతిపత్రం అందించేశారు. గ్రామానికి వచ్చి కట్టడాలను పరిశీలిస్తానని తహసీల్దారు హామీ ఇచ్చారు.

'స్వస్త్ నారీ స్వశక్త్'

బిట్రగుంట, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం జువ్వలదిన్నెలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మంగళవారం స్వస్త్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ వైద్యులు నిత్యప్రశాంతి, హెల్త్ సూపర్‌వైజర్ వసంత, గ్రామ సర్పంచు మామిడి అంకమ్మ, అంగన్వాడీ సూపర్‌వైజర్ హైమావతి పాల్గొన్నారు.

● **అల్లూరు :** అల్లూరులో నిర్వహించిన స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, వైద్యులు పాల్గొని మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎంపీడీవో రజనీకాంత్, కమిషనర్ ఉమామహేశ్వరరావు, పలగాటి శ్రీనివాసులురెడ్డి, బండి శ్రీనివాసుల రెడ్డి, అనురాధ, విజయకుమార్, కార్తీక్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు



కావలి(టౌన్) : బ్రహ్మచారిణిగా దుర్గాభ్రమరాంబ



కలిగిరి : గాయత్రీదేవి అలంకారంలో భద్రకాళి



బిట్రగుంట : గాయత్రీదేవిగా రాజరాజేశ్వరి దేవి

కావలి(టౌన్), సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): దేవి నవ రాత్రోత్సవాలు రెండవ రోజు మంగళవారం వైభవంగా జరిగాయి. గ్రామదేవత కలుగోళశాంభవి కాత్యాయనీదేవిగా భక్తులకు దర్శనమిచ్చి రాత్రి సర్వభూపాల వాహన సేవ లందుకున్నారు. శివాలయంలోని దుర్గాభ్రమరాంబ బ్రహ్మచారిణిగా, కొత్తబజారులోని వాసవీ కన్యకాపరమేశ్వరి గాయత్రీదేవిగా దర్శనమిచ్చారు. ఆలయ ప్రాంగణంలో మహిళా భక్తుల కోలాటం ఆకట్టుకుంది. విష్ణాలయంలో రాజ్యలక్ష్మి ఆదిలక్ష్మీగా, వడ్డిపాలెంలోని కనకదుర్గా బాల త్రిపురసుందరీ దేవిగా దర్శనమిచ్చారు.

● **గాయత్రీదేవిగా భద్రకాళి**

కలిగిరి: దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా మండలంలోని తెల్లపాడులో వెలసి ఉన్న భద్రకాళి భక్తులకు గాయత్రీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. అమ్మవారికి జరిగిన కుంకుమార్చన పూజా కార్యక్రమంలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఉమ్మడిశెట్టి శేషయ్య-లావణ్య, నాగభూషణం-లక్ష్మి, నాగేశ్వరరావు- చెంచమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

● **వెండి పంచలోహ పాత్రల బహూకరణ**

భద్రకాళికి గ్రామానికి చెందిన మామిళ్లపల్లి వెంకటేశ్వరరావు, రాజ్యలక్ష్మి దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారుడు, కోడలు బాలాజీబాబు, సౌదామిని దంపతులు రూ.లక్ష ఖరీదైన వెండి పంచ లోహపాత్రలు అందజేశారు. దాతలను దేవస్థానం కమిటీ సభ్యులు ఆలయ మర్యాదలతో సత్కరించి వేదపండితులచే ఆశీర్వచనం చేయించారు.

● **గాయత్రీదేవిగా రాజరాజేశ్వరిదేవి**

బిట్రగుంట : బోగోలు మండలం విశ్వనాథరావుపేటలోని రాజరాజేశ్వరిదేవి గాయత్రీదేవిగా భక్తులకు దరనమిచ్చారు. బోగోలు సాయిబాబా మందిరం, రామస్వామిపాలెం, చెన్నారెడ్డిపాలెం తదితర ప్రాంతాల్లో నవరాత్రికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● **నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం**

కొండాపురం : మండలంలోని సాయిపేట పంచాయతీల మక్కెనవారిపాలెంలోని గంగమ్మ ఆలయంలో దసరా నవరాత్రి ఉత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజున అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి తీర్థప్రసాదాలను అర్చకులు భక్తులకు అందచేశారు.

భారత్‌ను ముందంజలో నిలపడమే మోదీ లక్ష్యం



కంటి పరీక్ష చేయించుకుంటున్న బీజేపీ నేత భరత్‌కుమార్

బిట్రగుంట, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): అన్ని రంగాల్లో భారత్‌ను ముందంజలో ఉంచడమే ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రధాన లక్ష్యం అని బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు జీ.భరత్‌కుమార్, జిల్లా కోశాధికారి సీవీసీ సత్యం అన్నా రు. మోదీ జన్మదిన వేడుకల్లో భాగంగా బోగోలు మండలం జువ్వలదిన్నె సచివాలయంలో బీజేపీ మండల అధ్యక్షులు వీరాల శ్రీనివాసులు యాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. నెల్లూరు జయభారతి ఆసుపత్రి వైద్యబృందం రోగులకు పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు నూకసాని శ్రీనివాసులు యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి బీ.మాల్యాద్రి, నాయకులు ఎస్.రాజ్యలక్ష్మి, జీ.వెంకటేశ్వర్లు, కే.కొండయ్య, ఏ.అరుణ్‌కుమార్, అంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు ఆసుపత్రిలో నర్సుపై హిజ్రాల దాడి

కందుకూరు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): కందుకూరు పట్టణంలో హిజ్రాలు రెచ్చిపోతున్నారు. వ్యాపారులు, నివాస గృహాలు, పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాల వద్దకు వెళ్లి దౌర్జన్యంగా డబ్బులు వసూలు చేయడం పరిపాటిగా మారింది. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి పట్టణంలోని బస్టాండ్ సెంటర్‌లో ఉన్న హరిణి ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లి పెద్ద మొత్తంలో డబ్బు డిమాండ్ చేశారు. ఇదేమని ప్రశ్నించినందుకు ఆసుపత్రిలో నర్సుపై మూకుమ్మడిగా దాడికి పాల్పడి విచాక్షణా రహితంగా కొట్టి గాయపరిచారు. ఈ వ్యవహారం అంతా సీసీ కెమెరాల్లో రికార్డయింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చిన్నారులకు మున్సిపల్ కమిషనర్ సత్కారం



చిన్నారులను సత్కరించిన మున్సిపల్ కమిషనర్ అనూష

కందుకూరు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): శాస్త్రీయ నృత్య ప్రదర్శనలో ఉత్తమ ప్రతిభ కనపరిచి ప్రపంచ రికార్డుల్లో స్థానం దక్కించుకున్న చిన్నారులను మున్సిపల్ కమిషనర్ అనూష మంగళవారం తన కార్యాయంలో ఘనంగా సత్కరించారు. స్థానిక కనిగిరి రోడ్డులోని శ్రీనటరాజ నాట్యమండలి, సరస్వతి నిలయంకు చెందిన నాట్య గురువులు తిరుమల శెట్టి వెంకట దత్తేశ్వరి, ప్రేమ్‌కుమార్ శిష్య బృందం గత ఏడాది డిసెంబర్‌లో జరిగిన అంతర్జాతీయ శాస్త్రీయ సంగీత, నృత్య సంఘం నిర్వహించిన శివతాండంలోని రావణఘట్టంలో పాల్గొని వివిధ ప్రపంచ రికార్డుల్లో పేరు లిఖించుకున్నారు. ఉపాధ్యయ దినోత్సవం రోజున హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన నృత్య ప్రదర్శనలో అత్యుత్తమ ప్రదర్శనతో రైసింగ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డును అందుకున్నారు. ఉగాది జాతీయ పురస్కారాలు అందుకునన చిన్నారుల ప్రతిభను గుర్తించిన మున్సిపల్ కమిషనర్ అనూష వారిని శాలువాతో ఘనంగా సత్కరించి అభినందించారు.

పీ4 కార్యక్రమంపై శిక్షణ

వలేటివారిపాలెం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం గ్రామ సచివాలయ ఉద్యోగులకు పంచాయతీ కార్యదర్శులు చంద్రశేఖర్, కృపారావులు పీ4 పథకంపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శంకర్‌రావు, ఈవోఆర్డీ నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు నింపిన సీఎం

కావలి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు ఉద్యోగాలలో 3 శాతం రిజర్వేషన్ కల్పించి వారి జీవితాల్లో సీఎం చంద్రబాబునాయుడు వెలుగులు నింపారని పారా స్పోర్ట్స్ కమిటీ జిల్లా అధ్యక్షుడు టీసీ మాల్యాద్రి నాయుడు తెలిపారు. కావలి జర్నలిస్ట్‌క్లబ్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉపాధ్యాయ నియామకాల్లో పారా స్పోర్ట్స్ మెరిట్ కోటాలో 15 మంది దివ్యాంగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనన్నారు. ఆయన వెంట స్వచ్ఛంద సంస్థల గౌరవ అధ్యక్షుడు షేక్ ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

పోర్టు పనులను పరిశీలించడం దేశద్రోహమా?

గుడ్లూరు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): రామాయపట్నం పోర్టు నిర్మాణ పనులు పరిశీలన దేశద్రోహమా అని వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మంగళవారం వైసీపీ శ్రేణులతో కలసి పోర్టు వద్దకు వెళుతున్న గోవర్ధన్‌రెడ్డిని, కందుకూరు ఇన్‌చార్జీ బుర్రా మధుసూదన్ యాదవ్‌ను, గుడ్లూరు, కందుకూరు పోలీసుల చేవూరు దగ్గర అడ్డుకున్నారు. దీనితో పోలీసుల తీరుపై కాకాణి మండిపడ్డారు. వైసీపీ నేతలు కే.కృష్ణ, ఎన్.వెంకటేశ్వరరెడ్డి, ఆర్.బ్రహ్మానందం, తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



అంకురార్పణ పూజల్లో అర్చకులు

కావలి(టౌన్), సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): బృందావనం కాలనీలో వెలసివున్న వేంకటేశ్వర స్వామి నవరాత్రి బ్రహ్మోత్సవాలు మంగళవారం రాత్రి మేధావి పూజ అంకురార్పణతో వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ వ్యవస్థాపక కమిటీ అధ్యక్షుడు శ్రీరామ్ మాల్యాద్రి పర్యవేక్షణలో అక్టోబరు 3వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. బుధవారం ధ్వజారోహణ జరగనుంది.

పుల్లారెడ్డినగర్‌లో బార్ పెడితే ఊరుకోం

కావలి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పుల్లారెడ్డి నగర్‌లో జనవాసాల మధ్య బార్ అండ్ రెస్టారెంట్ ఏర్పాటును ఉపసంహరించుకోవాలని ఉమెన్ ఫోర్స్ కన్వీనర్ చాకలికొండ శారద, డాక్టర్ కల్పన, హరీష్‌లు పేర్కొన్నారు. కావలి జర్నలిస్ట్‌క్లబ్‌లో మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ పుల్లారెడ్డినగర్ ప్రశాంతమైన నివాస ప్రాతమన్నారు. అక్కడ బార్‌అండ్ రెస్టారెంట్ ఏర్పాటు చేస్తే శాంతిభద్రతలకు విఘాతం కలుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి, ఆర్డీవో సన్నీ వంశీకృష్ణల దృష్టికి తీసుకెళ్లినా అధికారులు పట్టించుకోలేదన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక మహిళలు పద్మ, సునీత, నరసమ్మ, స్థానికులు కృష్ణారావు, సుబ్బారెడ్డి, సుధాకర్, గోపి పాల్గొన్నారు.

పొగాకుకు ప్రత్యామ్నాయంపై దృష్టి సారించాలి

కందుకూరు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి) : పొగాకు పంటకు ప్రత్యామ్నాయ పంటలపై రైతులు దృష్టి సారించాలని ఎన్ఐఆర్‌సీఏ శాస్త్రవేత్త డాక్టర్ గంగాధర్ సూచించారు. కందుకూరు-2 పొగాకు బోర్డు వేలం కేంద్రంలో ఒంగోలు ప్రాంతీయ కార్యాలయ ఆధ్వర్యంలో కందుకూరు-1, 2 వేలం కేంద్రాల పొగాకు రైతులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. మిరప, పత్తి, శనగ, కంది, మినుము, పెసర, మొక్కజొన్న, ప్రొద్దుతిరుగుడు, నువ్వులు, జనుము వంటి పంటలు సాగు చేసుకోవచ్చన్నారు. వేలం నిర్వహణ అధికారి చంద్రశేఖర్ మాట్లాడారు. కార్యక్రమంలో ఏవో గీతా ప్రకాష్, హార్టికల్చర్ కాలేజీ డీన్ విజయభాస్కర్, సత్యశ్రీనివాస్, రాజ్‌గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అధ్యక్షా..

ఉదయగిరి-నందవరం రహదారి నిర్మాణం చేపట్టాలి



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

ఉదయగిరి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): నియోజవర్గంలో 29 కిలోమీటర్ల మేర అధ్వానంగా ఉన్న ఉదయగిరి-నందవరం రహదారి నిర్మాణం చేపట్టాలని మంగళవారం అసెంబ్లీలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ విన్నవించారు. ఉదయగిరి, ఆత్మకూరు నియోజకవర్గాల్లో ఈ రహదారి విస్తరించి ఉందన్నారు. జిల్లా కేంద్రమైన నెల్లూరుకు వెళ్లే ఈ రహదారి 50 ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోలేదన్నారు. మోకాటిలోతు గుంతలు, సింగిల్‌రోడ్డుతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ మార్గంలో డబుల్‌రోడ్డు ఏర్పాటు చేస్తే ఈ ప్రాంత ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని, ఆ దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని రోడ్లు,భవనాల శాఖ మంత్రి జనార్దన్‌కు ఆయన విజ్ఞప్తి చేశారు.

తూనికలు, కొలతల శాఖ అధికారుల తనిఖీ

వింజమూరు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలో కావలికి చెందిన తూనికల కొలతల శాఖ అధికారి మోహన్ బృందం మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ప్రధాన రహదారి వెంబడి ఉన్న షాపుల్లో తనిఖీలు నిర్వహించి జరిమానాలు విధించారు. ఈ విషయం తెలుసుకున్న పలువురు దుకాణదారులు దుకాణాలు మూసివేశారు. ఈ సందర్భంగా అధికారి మోహన్ మాట్లాడుతూ కొత్త జీఎస్టీ నిబంధన ప్రకారం సరుకులను విక్రయించాలని, కచ్చితమైన కొలతలు, తూకం ఉండాలని, నూతన విధి విధానాలతో సరుకులు విక్రయించాలన్నారు. లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మాజీ ఎమ్మెల్యేకి సన్మానం

సంగం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్రిపాడుకి చెందిన మందిపాటి అజయ్‌కుమార్‌రెడ్డి వైసీపీ విద్యార్థి విభాగం జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డిని అజయ్ కుమార్ రెడ్డి శాలువాతో సత్కరించారు.

బాలాత్రిపుర సుందరి అలంకారంలో జ్వాలాముఖి అమ్మవారు



ఉదయగిరిలో గాయత్రీదేవి అలంకరణలో పార్వతీదేవి



దుత్తలూరు మండలం గుదేవారిపాళెంలో గాయత్రీదేవిగా రేణుకాఎల్లమ్మ



సీతారామపురం : రాజరాజేశ్వరి దేవి అలంకారంలో వాసవీ కన్యకా పరమేశ్వరి



వరికుంటపాడు : తూర్పురొంపిదొడ్లలో బ్రహ్మచారిణి అలంకరణలో మానసాదేవి

ఆత్మకూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఉత్తర బలిజ వీధిలో వెలసిన శ్రీ జ్వాలాముఖి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం జ్వాలాముఖి అమ్మవారు బాలాత్రిపుర సుందరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

మర్రిపాడు: శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా మర్రిపాడు మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో మంగళవారం గాయత్రి దేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు అభిషేకం చేసి, భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ ఏడాది పదకొండు రోజులు పదకొండు అవతారాలతో అమ్మవారిని అలంకరించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

సంగం : స్థానిక సంగమేశ్వరాలయంలో జరుగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి శ్రీ కామాక్షిదేవి గాయత్రీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి పల్లకీసేవ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి నున్నా వెంకటేశ్వర గుప్త, వెంకట సుజన దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. స్థానిక తిరుమనత్పిలో వెలసిన శ్రీ రాజరాజేశ్వరీదేవి సమేత కాశీ విశ్వేశ్వరస్వామి జ్ఞానపీఠంలో పీఠాధిపతి రాజరాజేశ్వరానందస్వామి ఆధ్వర్యంలో హోమం నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల మూలవిరాట్‌లకు క్షీర, పంచామృతాలు, సకల ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించి, ప్రత్యేకంగా అలంకరించారు.

సీతారామపురం : శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజు వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి, గ్రామ దేవత అంకాలమ్మ, నారాయణమ్మపేటలో విజయ కనక దుర్గదేవి, ఘటిక సిద్ధేశ్వరం క్షేత్రంలోని ఇష్టకామేశ్వరీదేవిలు రాజరాజేశ్వరి దేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. అమ్మణ్ణులకు పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు.

ఉదయగిరి : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజైన మంగళవారం అమ్మవార్లు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా పట్టణంలోని పార్వతీ పరమేశ్వర, బాలాజీనగర్, సంతానలక్ష్మీ ఆలయాల్లో అమ్మవారు భక్తులకు గాయత్రీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అమ్మవార్లను దర్శించి కాయాకర్పూరం అందజేసి మొక్కులు తీర్చుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

దుత్తలూరు : మండలంలోని నర్రవాడ పంచాయతీ గుదేవారిపాళెంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండోరోజు రేణుకాఎల్లమ్మ తల్లి గాయత్రీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని కాయాకర్పూరం అందజేసి మొక్కులు తీర్చుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్): దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం మండలంలోని తూర్పురొంపిదొడ్ల గ్రామంలో వెలసి ఉన్న మానసాదేవి బ్రహ్మచారిణి, వరికుంటపాడులో నాగారప్పమ్మ గాయత్రీదేవి అలంకరణల్లో భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలతోపాటు కుంకుమార్చన, సహస్రదీపాలంకరణ, అభిషేకాలు చేపట్టారు. ఆయా ఆలయాలకు భక్తులు అధికసంఖ్యలో చేరుకోవడంతో అర్చకులు గోత్రనామాలతో ప్రత్యేక పూజలు చేపట్టారు.

సీతారామపురం : శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజు వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి, గ్రామ దేవత అంకాలమ్మ, నారాయణమ్మపేటలో విజయ కనక దుర్గదేవి, ఘటిక సిద్ధేశ్వరం క్షేత్రంలోని ఇష్టకామేశ్వరీదేవిలు రాజరాజేశ్వరి దేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. అమ్మణ్ణులకు పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చన, సహస్ర దీపాకాలంకరణ, అర్చన అభిషేకాలు నిర్వహించి వేద పండితులు అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు. అంకాలమ్మ గుడి వద్ద అన్నదానం చేశారు.

ఏఎస్ పేట : స్థానిక కృష్ణమందిరంలో శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా రెండవ మత్యన్యకా పరమేశ్వరి అమ్మవారిని సరస్వతి అలంకారంలో ముస్తాబు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్ని అమ్మ వారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు

చిరమనలో 'స్వస్త్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్'

ఏఎస్‌పేట, 3(ఆంధ్రజ్యోతి): చిరమనలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం 'స్వస్థ్ నారీ- స్వశక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమన్ని బీజేపీ నాయకులు కే వేంకటేశ్వర్లు ప్రారంభించారు. మహిళలు, పిల్లల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రధాని నరేంద్రమోదీ ఈ పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు.

చెత్త నుంచి సంపద సృష్టే లక్ష్యం : జడ్పీ సీఈవో

సంగం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో చెత్త నుంచి సంపద సృష్టే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు జెడ్పీ సీఈవో మోహన్‌రావు పేర్కొన్నారు. మంగళవారం ఆయన మండలంలోని ముక్తాపురంలోని చెత్త సంపద కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ తడి, పొడి చెత్త వేరు చేసి తొట్టెల్లో వానపాములు వేసి ఎరువు తయారు చేసే విధానాన్ని పరిశీలించారు. పంచాయతీ రికార్డులు తనిఖీ చేసి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పన్నులను వంద శాతం వసూలు చేయాలని సెక్రటరీని ఆదేశించారు. నిత్యం ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్తను సేకరించి చెత్త సంపద కేంద్రానికి తరలించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో రఘురామయ్య, ఇన్‌చార్జి డిప్యూటీ ఎంపీడీవో నరసయ్య, సెక్రటరీ అరుణ తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరిని జిల్లా చేయాలని వినతి



ఉదయగిరి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): చారిత్రక నేపథ్యం కలిగి అనాదిగా అభివృద్ధికి నోచుకోని ఉదయగిరిని జిల్లా చేయాలని మంగళవారం తహసీల్దారు ఎల్.రామ్మోహన్‌కు నాయిబ్రాహ్మణలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాగు, తాగునీరు, సరైన వైద్య, విద్యా అవసరాలు లేక ఈ ప్రాంత ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ ప్రాంతం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలంటే జిల్లా చేయడం ఒక్కటే మార్గమన్నారు. అందులో భాగంగా నెల్లూరు, ప్రకాశం, కడప జిల్లాల్లోని 21 మెట్ట మండలాలను కలిపి ఉదయగిరి కేంద్రంగా జిల్లా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయిబ్రాహ్మణ సంఘ నాయకులు వీ.ప్రసాద్, ఎం.శ్రీనివాసులు, జీ.నారాయణ, శీను తదితరులు పాల్గొన్నారు.

కుర్చీల వితరణ

ఉదయగిరి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక సబ్ ట్రెజరీ కార్యాలయానికి విశ్రాంత ఉద్యోగ, ఉపాధ్యాయుల సంఘం ఉదయగిరి తాలుకా అధ్యక్షుడు షేక్ ఖాదర్‌బాషా కుర్చీల వితరణ చేశారు. కార్యాలయానికి అధికంగా విశ్రాంత ఉద్యోగులు వస్తుండడం, ఫర్నిచర్ కొరత ఉండడంతో కుర్చీలను వితరణ చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా కుర్చీలను సబ్ ట్రెజరీ అధికారి ఉస్మాన్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలని కార్మికుల ఆందోళన

ఉదయగిరి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులు వేతనాలు చెల్లించాలని మంగళవారం వైద్యశాల ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు పారిశుధ్య కార్మికులు మాట్లాడుతూ నాలుగు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో కుటుంబ పోషణ భారమైందన్నారు. విధులకు హాజరయ్యేందుకు చార్జీలకు సైతం నగదు లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. అరకొరగా ఇచ్చే వేతనాలు సైతం నెలల తరబడి చెల్లించకపోవడంతో కుటుంబ పోషణకు, వడ్డీలకు అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమకు వేతనాలు చెల్లించి ఆదుకోవాలని వారు కోరారు.

నేలటూరులో వైద్య శిబిరం

ఉదయగిరి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేలటూరులో మంగళవారం స్వస్త్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గండిపాళెం పీహెచ్‌సీ వైద్యాధికారి శివకల్పన ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వివిధ రుగ్మతలతో బాధపడుతున్న 70 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గన్నేపల్లి సర్పంచు నెల్లూరు వెంకటస్వామి, వైద్యఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నియామక పత్రాల పంపిణీ

ఉదయగిరి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఉదయగిరి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల ఆయా పోస్టులకు ఇటీవల నిర్వహించిన ఇంటర్వ్యూలో ఎంపికైన అభ్యర్థులకు నియామకపత్రాలు అందజేసినట్లు సీడీపీవో పుణ్యవతి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రాజెక్టు పరిధిలోని సీతారామపురం, ఉదయగిరి, వరికుంటపాడు మండలాల్లో ఖాళీగా ఉన్న తొమ్మిది ఆయా పోస్టులకు ఈనెల 9, 11వ తేదీల్లో ఇంటర్వ్యూలు నిర్వహించామన్నారు. వారిలో ఎంపికైన వారికి నియామకపత్రాలు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షేక్ షాను, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైద్యశాల తనిఖీ

దుత్తలూరు(ఉదయగిరి), సెప్టెంబరు 23(ఆంధ్రరజ్యోతి): మండలంలోని నర్రవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం తహసీల్దారు వై.నాగరాజు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్యశాలలో రోగులకు అందుతున్న సేవలను పరిశీలించడంతోపాటు వార్డు, మందుల గదిని, సంబంధిత రికార్డులను తనిఖీ చేశారు. వైద్యశాలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి మనోజ్ఞ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతు కార్డుల లక్ష్యాన్ని అధిగమించాలి

ఉదయగిరి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలానికి కేటాయించిన కౌలురైతు కార్డుల లక్ష్యాన్ని అధిగమించాలని తహసీల్దారు ఎల్.రామ్మోహన్, మండల వ్యవసాయాధికారి విజయభాస్కర్‌లు సూచించారు. మంగళవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో వీఆర్వోలు, వీపీఏలు, వీహెచ్‌ఏలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో కౌలు రైతులను గుర్తించి వీఆర్వోల వద్దకు ధ్రువపత్రాలతో పంపినట్లయితే కౌలురైతు కార్డులు జారీ చేస్తారన్నారు. అర్హులైన రైతులందరికీ కౌలుకార్డులు అందేలా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే ఈ-పంట నమోదు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.

జై భవానీ...!

వైభవంగా దేవీ నవరాత్రులు ● కనువిందు చేస్తున్న అమ్మవారి రూపాలు

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : దేవీ నవరాత్రి ఉత్సవాలు జిల్లాలోని ఆలయాల్లో వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం రెండో రోజు అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులను కటాక్షించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చి పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశేష అభిషేకాలు, నవా వరణ పూజలు, సామూహిక కుంకుమార్చనలు, చండీ హోమాలు జరిగాయి. నెల్లూరులోని రాజరాజేశ్వరి అమ్మవారు భవానీగా దర్శనమిచ్చారు. ఉదయం పంచామృతాభిషేకాలు, నవావరణ పూజలు జరిగాయి. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. స్టోన్‌హౌస్‌పేట కన్యకాపరమేశ్వరి ఆలయంలో భవానీ అలంకరణ, విశేష హోమాలు జరిగాయి. మూలవర్లకు కుబేర కుంకుమతో అలంకారం, సహస్ర దీపాలంకార సేవ భక్తులకు కనువిందు చేశాయి. కోలాట నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.


నెల్లూరు : అన్నపూర్ణగా ఇరుకళల పరమేశ్వరి


నెల్లూరు : భవాని అలంకరణలో రాజరాజేశ్వరి అమ్మవారు


బుచ్చిరెడ్డిపాళెం : జొన్నవాడలో త్రిపురాంబికాదేవి అలంకరణలో కామాక్షితాయి


నెల్లూరు : భవాని అలంకరణలో కన్యకాపరమేశ్వరి



నెల్లూరు : పెంచలకోనలోని విజయేశ్వరి ఆశ్రమంలో హోమం నిర్వహిస్తున్న విజయేశ్వరీదేవి


నెల్లూరులోని మూలస్థానేశ్వర స్వామి ఆలయంలో నృత్యం చేస్తున్న విద్యార్థినులు


నెల్లూరు : మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో భవానిగా భువనేశ్వరి దేవి


కావలి : కాత్యాయనీ అలంకరణలో కలుగోళ శాంభవి

ప్రపంచ శాస్త్రవేత్తల జాబితాలో వీఎస్‌యూ వీసీకి చోటు

వరుసగా ఐదోసారి ప్రతిష్టాత్మక జాబితాలో ..
ఘనంగా సత్కరించిన బోధన, బోధనేతర సిబ్బంది

వెంకటాచలం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు మరో కీర్తి శిఖరాన్ని అధిరోహించారు. ప్రపంచ అగ్ర శాస్త్రవేత్తల జాబితాలో ఆయనకు చోటు దక్కింది. అమెరికాకు చెందిన ప్రతిష్టాత్మక స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ పరిశోధకులు రూపొందించిన ఈ జాబితాకు అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేక స్థానం ఉంది. అసాధారణ ప్రతిభ కలిగిన శాస్త్రవేత్తలకే ఈ జాబితాలో చోటు దక్కుతుంది. ఐదేళ్లుగా విడుదల చేస్తున్న ఈ ప్రతిష్టాత్మకమైన జాబితాలో వరుసగా 5వసారి ఆయనకు చోటు లభించడం గర్వించదగ్గ విషయం. ఈసారి విక్రమ సింహపురి యూనివర్సిటీ నుండి తనకు ఈ గుర్తింపు దక్కడం సంతోషదాయకమని వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు ఆనందం వ్యక్తం చేశారు. భౌతిక శాస్త్రం, ఫోటానిక్స్ విభాగాల్లో ఆయన చేసిన పరిశోధనలు అంతర్జాతీయంగా ఎంతో గుర్తింపు పొందాయి. ఇప్పటివరకు ఆయన 270కి పైగా పరిశోధన పత్రాలు, పుస్తకాలు ప్రచురించారు. 25 మంది పరిశోధక విద్యార్థులకు మార్గదర్శకత్వం వహించారు. ఈ విశిష్ట గుర్తింపు వీఎస్‌యూ ప్రతిష్ఠను మరింత ఇనుమడింపజేస్తుందని వర్సిటీ అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. అవిశ్రాంత కృషి, నిబద్ధత వల్లే ఉపకులపతి శ్రీనివాసరావుకు ఈ గౌరవం లభించిందని వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత తెలిపారు. మంగళవారం వర్సిటీలో వీసీని బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు ఘనంగా సత్కరించారు.



వీఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావును సన్మానిస్తున్న వర్సిటీ అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు

పసికందు మృతిపై విచారణ

ఉదయగిరి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఉదయగిరి సామాజిక ఆరోగ్య కేంద్రంలో కాన్పు సమయంలో పసికందు మృతిపై మంగళవారం వైద్యాధికారుల బృందం సీహెచ్ కిరణ్, ఎం.బెట్టి బనాల్, ఆర్‌వీ హరితలు విచారణ చేపట్టారు. వారు మాట్లాడుతూ ఈనెల 20న సీతారామపురం మండలం బసినేనిపల్లి ఏసీనగర్ కాలనీకి చెందిన ముళ్లపాటి మంజుల కాన్పు కోసం వైద్యశాలకు వచ్చిందన్నారు. మంజులకు కాన్పు సమయంలో వైద్యుడి నిర్లక్ష్యం, అలసత్వం కారణంగానే పసికందు మృతి చెందాడని కుటుంబ సభ్యులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారన్నారు. అందులో భాగంగా డీసీహెచ్ఎస్ డాక్టర్ పరిమళ ఆదేశాల మేరకు విచారణ చేపడుతున్నామన్నారు. విచారణలో భాగంగా వైద్యులు, వైద్యసిబ్బంది, పారిశుధ్య కార్మికులతో పాటు బాధిత కుటుంబ సభ్యులను విచారించామన్నారు. విచారణలో గుర్తించిన అంశాలను నివేదిక రూపంలో ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. విచారణ సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి తన సిబ్బందితో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.


వైద్యులను విచారిస్తున్న విచారణ వైద్యాధికారులు

ఎరుకల సమస్యలు పరిష్కరించండి

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఎరుకల కుల స్తుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ ఎరుకల సేవా సంఘం కలెక్టర్ హిమాన్షు శుక్లాను కోరింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర కన్వీనర్ నల్లగొండ్ల శివ ఆధ్వర్యంలో నాయకులు మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిశారు. ఐటీడీఏ కార్యాలయం లో ఎరుకుల కులస్తులను చిన్నచూపు చూస్తున్నారని ఆరోపించారు. వారికి ప్రభు త్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని కోరారు.

కలెక్టర్‌ను కలిసిన ఏపీజీఈఏ నాయకులు

ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు మంగళవా రం కలెక్టర్ హిమాన్షు శుక్లాను కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడు బసిరెడ్డి సుధాకర్‌రెడ్డి, కోశాధికారి సురేష్, నెల్లూరు సిటీ యూనిట్ అధ్యక్షుడు కిరణ్‌కుమార్, ఉపాధ్యక్షుడు శశికుమార్, వెంకటేశ్వర్లు, నెల్లూరు రూరల్ అధ్యక్షుడు శ్రీనివాసులు పాల్గొన్నారు.

కలెక్టర్‌తో 'రెడ్‌క్రాస్' సభ్యుల భేటీ

నెల్లూరు (వైద్యం): కలెక్టర్ హిమాన్షు శుక్లాను మంగళవారం రెడ్‌క్రాస్ సొసైటీ పాలక మండలి సభ్యులు కలిశారు. అక్టోబరు 1వ తేదీన జరపాల్సిన జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవాన్ని అక్టోబరు 5వ తేదీన జరుపుకునేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు.

శైవక్షేత్రానికి సైకిల్ యాత్ర



తమ గ్రామానికి 2,500 కిమీ దూరంలో ఉన్న ఆదియోగి క్షేత్రానికి ఓ వ్యక్తి సైకిల్ యాత్ర ప్రారంభించారు. వివరాలిలా ఉన్నాయి. పశ్చిమ బెంగాల్ రాష్ట్రం రాయ్ గంజ్ ప్రాంతానికి చెందిన అచిన్ తమిళనాడులోని కోయంబత్తూరు సమీపంలోని ఆదియోగి శైవక్షేత్రానికి సైకిల్‌పై బయలుదేరాడు. జాతీయరహదారిపై వెళ్తూ మంగళవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. ఈ నెల 4న తన స్వగ్రామమైన రాయ్‌గంజ్ నుంచి యాత్ర ప్రారంభించానన్నారు. ఆదియోగిలోని శివక్షేత్రాన్ని సందర్శించాలనే లక్ష్యంతో యాత్ర చేపట్టానన్నారు. కాగా యోగాకు మూలగురువైన ఆదిక్షేత్రాన్ని దర్శించేందుకు సైకిల్ యాత్ర చేస్తున్న అచిన్‌ను స్థానికులు అభినందించారు.

- కోవూరు (ఆంధ్రజ్యోతి)

సర్వేశాఖ ఏడీకి డీడీగా ఉద్యోగోన్నతి


నాగేశ్వర్

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి) : జిల్లా సర్వే, ల్యాండ్ రికార్డుల శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా నాగేశ్వర్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సర్వే శాఖలో పదోన్నతులలో భాగంగా నాగేశ్వర్‌కు అసిస్టెంట్ డైరెక్టర్ నుంచి డిప్యూటీ డైరెక్టర్‌గా ఉద్యోగోన్నతి లభించింది. నెల్లూరులోనే ఏడీగా పనిచేస్తున్న ఆయనను డీడీగా ఇక్కడే నియమించడం విశేషం. ఆయనకు పలువురు అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తు గడువు పొడిగింపు

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఏపీ ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు రూ.200 అపరాధ రుసుముతో అక్టోబరు 31వతేదీ వరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ గడువు పొడగిస్తున్నట్లు డీఈవో బాలాజీరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు apopen-school.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా వ్యక్తిగతంగాగానీ ఏపీ ఆన్‌లైన్ కేంద్రం, గ్రామవార్డు సచివాలయాల ద్వారా అయినా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. పూర్తి వివరాలకు సమీపంలోని అధ్యయన కేంద్రంలో సంప్రదించాలని కోరారు.

ఎల్‌టీపీల సమస్యలు పరిష్కరిస్తాం

● నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి

నెల్లూరు (జడ్పీ), సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఎల్‌టీపీలు ఎదుర్కొనే సమస్యలను పరిష్కరించేందుకు నెల్లూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చిత్తశుద్ధితో పని చేస్తుందని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. నుడా కార్యాలయంలో మంగళవారం ఎల్‌టీపీలు, బిల్డర్స్‌తో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎల్ఆర్ఎస్ మీద అవగాహన కల్పించారు. ఎల్‌టీపీలు ఫీజ్ తగ్గించేలా కృషి చేస్తానన్నారు. ఎల్ఆర్ఎస్ విషయంలో చాలా మంది నిర్లక్ష్యంగా ఉన్నారని, అలాంటి వారికి భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నుడా సెక్రటరీ అల్లంపాటి పెంచల్‌రెడ్డి, పీవో హిమబిందు, కాలేషా, చంద్ర పాల్గొన్నారు.


సమస్యలు తెలుసుకుంటున్న నుడా చైర్మన్ శ్రీనివాసులురెడ్డి

మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ

నెల్లూరు(క్రైం),(ఆంధ్రజ్యోతి): ఇంటి అద్దె విషయం మాట్లాడుతున్నట్లు నటిస్తూ ఓ మహిళ మెడలోని బంగారు గొలుసును గుర్తుతెలియని దుండగుడు దోచుకెళ్లాడు. పోలీసుల కథనం మేరకు... నెల్లూరులోని చాకలివీధిలో లక్ష్మమ్మ ఒంటరిగా నివసిస్తోంది. ఆమె ఇంటి మిద్దె మీద వాటా అద్దెకు తీసుకునేందుకు సోమవారం సాయంత్రం ఓ వ్యక్తి వచ్చి మాట్లాడాడు. మంగళవారం అడ్వాన్స్ ఇస్తానని చెప్పి వెళ్లాడు. మంగళవారం ఉదయం 10.30 గంటలకు వచ్చి లక్ష్మమ్మతో మాట్లాడుతూ ఆకస్మత్తుగా ఆమె మెడలోని 12 గ్రాముల బం గారు సరుడును తెంపుకెళ్లాడు. బాధితురాలు చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు

పీఎఫ్ ఖాతాలు అప్‌డేట్ చేయాలి

నెల్లూరు(విద్య),(ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు ప్రావిడెంట్ ఫండ్ ఖాతాలను అప్‌డేట్ చేసి పీఎఫ్ స్లిప్పులను ఆన్‌లైన్‌లో ఉంచాలని ఏపీటీఎఫ్ నాయకులు కోరారు. ఈ మేరకు జడ్పీ కార్యాలయంలో మంగళవారం సీఈవో మోహన్‌రావుకు వినతిపత్రం అందించారు. కొన్నేళ్లుగా పీఎఫ్ స్లిప్పులు ఆన్‌లైన్‌లో ఉంచకపోవడంతో ఉద్యోగులు, ఉపాధ్యాయులు రుణాల విషయంలో ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఆరియర్స్, డిడక్షన్స్ సరిగ్గా జరుగుతున్నాయో లేదో కూడా తెలియడం లేదన్నారు. విశ్రాంత ఉపాధ్యాయుల పీఎఫ్ క్లోజర్స్‌ను ఆలస్యం చేయకుండా ఆడిటింగ్ చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సబ్‌కమిటీ సభ్యులు రియాజ్, కృష్ణారెడ్డి, జుల్ఫికర్ అలీ, జిల్లా అధ్యక్షుడు అల్లం సురేంద్రరెడ్డి పాల్గొన్నారు.

కుల గణన చేశాకే 'స్థానిక' ఎన్నికలకు వెళ్లాలి

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర కులగణన చేసి, బీసీ రిజర్వేషన్లను వర్గీకరణ చేసిన తరువాతే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాం డ్ చేశారు. మంగళవారం నగరంలోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల వాగ్దానమైన బీసీల జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు అమలు జరిపే ముందు సమగ్రంగా కులగణన చేయాలన్నారు. సంఘం జిల్లా అ.ధ్యక్షుడు పలమాల శ్రీహరిరావు మాట్లాడు తూ బీసీ ఐక్యత దిశగా రాజకీయ పార్టీల నాయకులు కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ బొందిలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణసింగ్, రాము గౌడ్, కోటేశ్వరరావు, నాగసేనరావు, ప్రసాద్ గౌడ్, సుంకు వెంకటేశ్వర్లు, నర్మదా బాయి తదితరులు పాల్గొన్నారు.

'గాలికుంటు' టీకాలు తప్పనిసరి

నెల్లూరు(వ్యవసాయం), సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం ద్వారా ప్రభుత్వం గాలికుంటు వ్యాధి నివారణకు పశువులకు ఉచితంగా టీకాలు వేస్తోందని, పాడిరైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కే రమేష్ నాయక్ పిలుపునిచ్చారు. నెల్లూరులోని మన్సూర్‌నగర్‌లో మంగళవారం వెటర్నరీ పాలీ క్లినిక్(వీపీసీ) డిప్యూటీ డైరెక్టర్ టీ సోమయ్య ఆధ్వర్యంలో పశువులకు ఉచితంగా టీకాల కార్యక్ర మం జరిగింది. ఈ సందర్భంగా జేడీ మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి వల్ల పాల దిగుబడి తగ్గిపోతుందని, దూడల మరణాలు సంభవిస్తాయని, వ్యాధి రాకముందే జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నాలుగు నెలలు వయసు నిండిన పశువులకు తప్పనిసరిగా టీకాలు వేయించాలన్నారు. జిల్లాకు 5,18,000 డోసులు వచ్చాయని, జిల్లాలోని అన్ని పశువైద్య కేంద్రాలకు సరఫరా చేశామని చెప్పారు. ఇప్పటి వరకు 1,12,000 పశువులకు టీకాలు వేశామని, అక్టోబరు 21వతేదీ వరకు ఇది కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో లైవ్ స్టాక్ అసిస్టెంట్ శ్రీనివాసులు, వెటర్నరీ విద్యార్థి బీ లలిత, పాలిటెక్నిక్ విద్యార్థులు, పాడిరైతులు పాల్గొన్నారు.


గాలికుంటు వ్యాధి నివారణ టీకా వేస్తున్న జేడీ రమేష్‌నాయక్, పక్కన డీడీ సోమయ్య తదితరులు

నమ్మకంగా ఉంటూ దోచేశాడు..!

● నలుగురు నిందితుల అరెస్టు ● రూ.2.06 కోట్ల రికవరీ

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): వ్యాపారవేత్త వద్ద నమ్మకంగా ఉంటూ నగదు దోచేసిన డ్రైవర్, అతనికి సహకరించిన మరో ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.2.06 కోట్ల సొత్తు, మూడు కార్లు స్వాధీనం చేసుకున్నారు. నెల్లూరులోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో మంగళవారం నెల్లూరు నగర, రూరల్ డీఎస్పీలు పీ సింధుప్రియ, జీ శ్రీనివాసరావులు నిందితుల వివరాలను మీడియాకు వెల్లడించారు. నెల్లూరు రాంజీనగర్‌కు చెందిన వ్యాపారవేత్త కే కోదండరామిరెడ్డి బెంగళూరులో కన్‌స్ట్రక్షన్ కంపెనీ నిర్వహిస్తున్నారు. ఆయన వద్ద కర్ణాటక రాష్ట్రం మైసూరు జిల్లా సంజనగూడ తాలుక, హెల్లర్ గ్రామానికి చెందిన మహేష్ నాయక్ ఐదేళ్లుగా డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఎంతో నమ్మకంగా ఇంట్లో వాళ్లతో కలిసిపోయాడు. ఈ నెల 14న కోదండరామిరెడ్డి కంపెనీకి చెందిన రూ.2.10 కోట్ల నగదును డ్రైవర్‌కు ఇచ్చి కారులో పెట్టమని చెప్పాడు. ఇదే అదునుగా భావించిన డ్రైవర్ మహేష్ నాయక్ నగదు తీసుకొని పరారయ్యాడు. మైసూరు జిల్లాకు చెందిన రమేష్, బెంగళూరుకు చెందిన బసవరాజ్ భరత్ సహాయంతో తన స్వగ్రామానికి వెళ్లాడు. సహకరించిన వారికి రూ.10 లక్షల నగదు ఇచ్చాడు. మిగిలిన నగదును తన తండ్రి సోమానాయక్ సహాయంతో దాచి పెట్టాడు. బాధితుడు కోదండరామిరెడ్డి ఫిర్యాదు మేరకు నెల్లూరులోని బాలాజీ నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. సీసీఎస్, బాలాజీనగర్ ఇన్‌స్పెక్టర్లు అశోక్‌కుమార్, సాంబశివరావు తమ సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సాంకేతికత ఆధారంగా దర్యాప్తు చేశారు. మహేష్ నాయక్ పరారయ్యేందుకు సహకరించిన రమేష్, బసవరాజ్, భరత్‌ను ఈ నెల 18వ తేదీన అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.10 లక్షల నగదు, రెండు కార్లను స్వాధీనం చేసుకున్నారు. వారిచ్చిన సమాచారం మేరకు మహేష్ నాయక్, అతని తండ్రిని వారి స్వగ్రామంలోనే సోమవారం అరెస్ట్ చేసి వారి నుంచి రూ.1,96,29,000 నగదు, ఓ కారును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి సొత్తును రికవరీ చేయడంలో కృషి చేసిన ఇన్‌స్పెక్టర్లు అశోక్‌కుమార్, సాంబశివరావు, ఎస్ఐలు విజయ్‌శ్రీనివాస్, విశ్వనాథ్‌రెడ్డి, సిబ్బంది కేవీ సుధాకర్, సుబ్రహ్మణ్యం, భాస్కర్ తదితరులను ఎస్పీ అభినందించారు. వారికి రివార్డులు అందజేశారు.

పొత్తపి చోళుల శిలాశాసనం లభ్యం

● 12వ శతాబ్దం నాటిదిగా గుర్తింపు

రాపూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మునగాల వెంకటాపురం గ్రామ సమీపాన గల అటవీ ప్రాంతంలో 12వ శతాబ్దం నాటి శిలాశాసనం గుర్తించినట్లు జిల్లాకు చెందిన ప్రముఖ చరిత్రకారుడు షేక్.రసూల్ అహ్మద్ తెలిపారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు, ఈ ప్రాంతంలో కేంద్ర పురావస్తు అధికారుల బృందంతో కలిసి పర్యటించి, ఇక్కడ అటవీ ప్రాంతంలో దొరికిన చారిత్రక అవశేషాలను బట్టి తెలుస్తోందని ఆయన తెలిపారు. ఈ క్రమంలో రాతి శాసనాన్ని కనుగొన్నట్లు రసూల్ పేర్కొన్నారు. ఈ శాసనాన్ని గ్రామానికి ఉత్తరాన గల అటవీ ప్రాంతంలోని దేవళ్లదిబ్బ సమీపంలోని శిథిలమైన శివాలయ ప్రాంతంలో గుర్తించామని తెలిపారు. నాలుగు అడుగుల పొడవు, రెండు అడుగుల వెడల్పు గల గ్రానైట్ రాతిపై మూడు వైపులా చెక్కబడిన ఈ శాసనంలో పొత్తపి చోళుల పాలన కడప, చిత్తూరు, నెల్లూరు తదితర ప్రాంతాలకు విస్తరించినట్లుగా, అలాగే ఆయా ప్రాంతాలలో వివిధ ఆలయాలు నిర్మించినట్లుగా తెలుస్తోందని కేంద్ర ప్రభుత్వ పురావస్తు శాఖ చెన్నై శాసన విభాగ అధికారి డాక్టర్ ఎం.ఏసుబాబు విలేకరులకు తెలిపారు.


చోళుల నాటి శిలాశాసనంతో పురావస్తు శాఖ అధికారులు

కందుకూరులో అర్ధరాత్రి దౌర్జన్యం

జర్నలిస్టు స్థలం ఆక్రమణ

కందుకూరు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): కందుకూరులో అర్ధరాత్రి దౌర్జన్యం జరిగింది. పట్టణంలోని కోవూరు రోడ్డులో ప్రభుత్వం జర్నలిస్టులకు ఇచ్చిన స్థలాలలో స్థానిక అధికారపా ర్టీ నేతలు దురాక్రమణకు తెగబడ్డారు. 2000 లో కందుకూరులో ఉన్న వర్కింగ్ జర్నలిస్టులకు అప్పటి ఎమ్మెల్యే దివి శివరాం నివాసస్థల పట్టాలు మంజూరుచేశారు. జర్నలిస్టులు ఆ స్థలాలను అభివృద్ధి చేసుకోగా ఇటీవల కొందరు గృహాలు నిర్మించుకోగా, మరికొందరు చుట్టూ ప్రహరీలు ఏర్పాటు చేసుకున్నారు. ఈ స్థితిలో ఓ విలేకరి స్థలాన్ని సోమవారం అర్ధరా త్రి స్థానిక అధికార పార్టీ నాయకులు పువ్వాడి కోటయ్య, గోపి, మధు తదితరులు ప్రహరీగోడను కూల్చివేసి, స్థలాన్ని చదునుచేసి టెంట్‌లు వేసి హోమగుండం ఏర్పాటు చేశారు. ఈ విషయమై బాధిత విలేకరి తహసీల్దార్‌కు, పోలీసులకు ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ లావణ్య మాట్లాడుతూ జర్నలిస్టులకు చట్టబద్ధంగా జారీచేసిన పట్టాలుగా రికార్డులను పరిశీలించి నిర్ధారణకు వచ్చామని, తగుచర్యలు తీసుకుంటామన్నారు. సీఐ అన్వర్‌బాషా మాట్లాడుతూ రికార్డు లు పరిశీలించి బాధ్యులపై కఠినచర్యలు తీసుకుంటామన్నారు.


జర్నలిస్టు స్థలాన్ని ఆక్రమించి టెంట్‌లు వేసి హోమగుండం ఏర్పాటుచేసిన దృశ్యం

చర్యలు తీసుకోవాలి

కందుకూరులో జర్నలిస్టు స్థలాన్ని దురాక్రమణ చేసిన వైనంపై అధికారులు తక్షణం కఠినచర్యలు తీసుకోవాలని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.